భగవద్గీత

# గీతామృత సార సంగ్రహము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# గీతామృత సార సంగ్రహము



వ్యాఖ్యాత :


## శ్రీ స్వామి నరేంద్ర ఆనంద సరస్వతి

## భాస్కరానందాశ్రమము

నందిగామ :: కృష్ణా జిల్లా


★


ప్రకాశకులు :

## హిందూ విజ్ఞాన ప్రచార సమితి

## విజయవాడ

**1951**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| గీతా ప్రశంస | ... | ... | ... |
| ముఖ వచనము | ... | ... | ... |
| విజ్ఞాపన | ... | ... | ... |
| ధ్యానశ్లోకములు | ... | ... | ... |
| ప్రథమోధ్యాయము | ... | అర్జున విషాదయోగము | 1- 13 |
| ద్వితీయోధ్యాయము | ... | సాంఖ్యయోగము | 14- 28 |
| తృతీయోధ్యాయము | ... | కర్మయోగము | 29- 36 |
| చతుర్థోధ్యాయము | ... | జ్ఞానయోగము | 37- 51 |
| పంచమోధ్యాయము | ... | కర్మసన్న్యాసయోగము | 52- 60 |
| షష్ఠోధ్యాయము | ... | ఆత్మ సంయమయోగము | 61- 70 |
| సప్తమోధ్యాయము | ... | విజ్ఞానయోగము | 71- 77 |
| అష్టమోధ్యాయము | .. | అక్షర పరబ్రహ్మయోగము | 78- 82 |
| నవమోధ్యాయము | ... | రాజవిద్యా రాజగుహ్య యోగము | 83- 91 |
| దశమోధ్యాయము | ... | విభూతియోగము | 92- 97 |
| ఏకాదశోధ్యాయము | ... | విశ్వరూపసందర్శనయోగము | 98-104 |
| ద్వాదశోధ్యాయము | ... | భక్తియోగము | 105-109 |
| త్రయోదశోధ్యాయము | ... | క్షేత్రక్షేత్రజ్ఞయోగము | 110-122 |
| చతుర్దశోధ్యాయము | ... | గుణత్రయవిభాగయోగము | 123-127 |
| పంచదశోధ్యాయము | ... | పురుషోత్తమప్రాప్తి యోగము | 128-132 |
| షోడశోధ్యాయము | ... | దైవాసుర సంపద్విభాగ యోగము | 133-137 |
| సప్తదశోధ్యాయము | ... | శ్రద్ధాత్రయవిభాగయోగము | 138-144 |
| అష్టాదశోధ్యాయము | ... | మోక్షసన్న్యాసయోగము | 145-150 |



"శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నం"

—అర్జునుడు (గీ 2-7)

# గీతా ప్రశంస

"మయిసర్వమిదం ప్రోతం సూత్రే మణిగణాయివ" "అహం సర్వస్య ప్రభవః" "అహమాత్మాగుడాకేశ" అను వచనములతో పరమాత్మ మానవ జీవితోత్కృష్టతను ప్రశంసించి యున్నారు. మానవుడు నిజమునకు భగవదంశా సంభూతుడు. ఈ విషయము ననుభవములోనికి తెచ్చుటయే విజ్ఞానప్రయోజనము. " Ye, Divinities on Earth-Sinners ? " ప్రపంచమున నవతరించిన భగవత్స్వరూపులగు మానవులు పాపులెట్లగుదురు ? ఈ పంచశబ్దప్రణాళికలో విజ్ఞాన సర్వస్వ మిమిడియున్నది.

ప్రపంచ నడకకు ప్రాక్పశ్చిమ విజ్ఞానవాహినీ సమ్మేళనము మూలము. ప్రాచ్యవిజ్ఞానము మానవుని దైవత్వమును ప్రకటించుచున్నది. ప్రాశ్చాత్య విజ్ఞానము మానవుడు జన్మతఃపాపియను మూలసూత్రము నాధారముగా గలిగి యున్నది. ప్రాక్పశ్చిమ దేశీయుల జీవితలక్ష్యములందును, విధానములందును గల విభేదములు వైజ్ఞానిక సంబంధములై యున్నవి. 19, 20 శతాబ్దములలోని ప్రజాజీవితము 'జన్మతః' మానవుడు పాపియను సిద్ధాంతము నంగీకరించు స్థితిలోలేదు. శాస్త్రీయ పరిశోధనలు మానవుని సమర్థతను అనంతముగా రుజువుచేయుచున్నవి. కాన మానవుడు 'జన్మతః' శుభలక్షణసంపన్నుడను విశ్వాసము ప్రజాహృదయమందు నాటుకొనిపోయినది.

1893 సంవత్సరములో, అమెరికాలోని చికాగోనగరమున జరిగిన ప్రపంచ మతమహాసభలో "Each Soul is Divinely Potential" అను వైజ్ఞానికమంత్రరాజమును, శ్రీమద్వివేకానంద స్వాములవారు, ప్రపంచ విజ్ఞాన వేత్తలసమక్షమున ఉద్ఘాటించియున్నారు. మానవులు జన్మతః పాపులను సూత్రమా మహామంత్రరాజముచే ఛేధింపబడెను. పేరెన్నికగన్న విజ్ఞాన వేత్తలందరు "మానవుడు దైవాంశ సంభూతుడ"ను సూత్రమును సమగ్ర జీవిత సమన్వయమూలముగ ఆమోదించిరి. హైందవ విజ్ఞానవాహిను లెంత నిర్మాణాత్మకమైనవో, యెంత దూరదృష్టితో పూర్వపుభారతీయులు జీవిత సమస్యలను పరిష్కరించిరో, వారి ఆత్మపరిశోధన లెంత గాఢమైనవో, పరిశోధనా ఫలితము లెంత శాశ్వతమైనవో పరిశీలించవలయునను సంకల్పము కొంతమంది బుద్ధిమంతులగు పాశ్చాత్యపండితులయం దుదయించెను.

రాజకీయము - పారిశ్రామికము - సామాజికము - ఆధ్యాత్మికము అను మానవజీవిత విభజనలు, వ్యావహారికదృష్టితో, భౌతికాభివృద్ధికొరకై చేయ బడినవి. పై జీవితవిభజనలు జీవితగమ్యమును పూర్ణముగ జూపుటలేదు.

కావుననే ఆధునిక జీవితప్రమాణము సమగ్ర జీవిత సమస్యాపరిష్కారదృష్టిని గాక, సామాన్య రాజకీయదృష్టినే ప్రధానముగా కలిగియున్నది. శాస్త్ర పరిశోధనల ఫలితముగ ప్రపంచాభివృద్ధి మహత్తరముగ జరుగుచున్నదని ప్రజలు భ్రమపడుచున్న కాలమిది. చెడు ఫలితములను ప్రతివారును అనుభవించుచున్నను, పదార్థ విజ్ఞానాభివృద్ధిని ప్రశంసించనివా రరుదు. అగ్రరాజ్య సమితులు, భద్రతా సంఘములు, శాంతిసభలు - విజ్ఞాన విహారములు మొదలగునవి నిర్విరామముగ పనిచేయుచున్నవి. గత 80 వత్సరములలో రెండు ప్రళయయుద్ధములకు కారణమై, మూడవ మహాయుద్ధమేఘములను ప్రపంచమునం దంతటా వ్యాపింపజేయుచున్నది రాజకీయ ప్రాబల్యమునకు లోనైన ఈనాటి పదార్థవిజ్ఞానమే. వైజ్ఞానికముగ మానవులందరు సమమనుభావము విశ్వవ్యాప్తమైననే కాని, ప్రపంచశాంతియేర్పడదు. నేటి నాగరికత ప్రపంచశాంతిని సమకూర్చగలదని విశ్వసించుట యెండమావులలో దాహముతీర్చుకొని ఆనందించుటతో సమమగుచున్నది. విషమును తినుచు, అమృతఫలములను పొందగోరుట వెర్రితనము.

ప్రపంచశాంతిని స్థాపించి, విశ్వైక్యతను సమకూర్చగలవిజ్ఞానము మతమునందు పొందపరచబడియున్నది. కావుననే "Religion is realisation" మతమనగా భగవదైక్యతను సమకూర్చు సమగ్రవిధానమని పెద్దలు నిర్వచించియున్నారు. ప్రజలకు మతమంటే యెంతో అభిమానము. మతమువలన జీవితము మహిమాన్వితమగునని ప్రజాభిప్రాయముకూడా. ఆత్మానుభవము లేని మతప్రచారకులు, బాహ్యాచార ప్రసక్తిని పెంచి, బాహ్యాచారముతే మతమనుభావమును ప్రజలయందు బలపరచుటయే, యీనాటి ప్రజలదుస్థితికి మూలకారణము. యావజ్జీవితవిధానమును భగవత్పరముగ, సమన్వయించు ప్రబోధ మీ కాలమున కత్యవసరము. ప్రపంచమునందలి మతగ్రంథములన్నియు, జీవితమును భగవత్పరముగ-లోకకల్యాణ ప్రదముగ-సంస్కరించుకొనుటయే, మానవుని కర్తవ్యమని హెచ్చరించుచున్నవి.

ప్రపంచ మత గ్రంథములలో భగవద్గీతకు అద్వితీయ స్థానము లభించినది. భగవద్గీత సర్వోపనిషత్సారము. ఉపనిషత్తులు వివిధ విజ్ఞానమాత్ర విరాజితములు. శ్రీకృష్ణపరమాత్మ యావదుపనిషత్సారమును గీత యందు యిమిడ్చి, అర్జునుని నిమిత్తమాత్రముగా నుంచుకొని లోక పునర్నిర్మాణము నిమిత్తమై, మానవజాతికి అందించియున్నారు. గీతయందు జీవిత

సమస్యలన్నియు సక్రమముగ పరిష్కరింపబడినవి. ప్రకృతియందనుక్షణము జరుగుచున్న తీవ్రపోరాటమును-మంచి చెడులకు-న్యాయాన్యాయములకు-ధర్మాధర్మములకు జరుగుచున్న దానిని నిరపాయకరముగ పరిష్కరించు విధానములను గీతయందు సుస్పష్టముగ జూపి, అర్జునునిచే "కరిష్యే వచనం తవ" అనిపించి, ధర్మయుద్ధమును జేయించియున్నారు. పదునెనిమిది అధ్యాయములుగా విభజించి, జీవిత సమస్యలను యోగదృష్టితో – లోక కల్యాణప్రదముగ పరిష్కరించు సక్రమమార్గములను గీతయందు జూపియున్నారు. ప్రత్యేకముగ యే కొలదిమందికో గాక, ప్రపంచములోని ప్రజలందరికిని – వారి యోగ్యతల ననుసరించి వుపయోగించుమార్గములు గీతయందు గలవు. అర్జునుడు మానవులందరికిని శాశ్వత ప్రతినిధి. గీతాతత్త్వమును గురించి, అందలి విజ్ఞాన సమన్వయమును గురించి – అట్టి సమన్వయప్రయోజనమును గురించి యిచట కొంత ముచ్చటింతుము.

అర్జునుడు మహావీరుడు. యుద్ధమును స్వప్రేరణతో చేయుచున్నాననియును, యుద్ధములో చంపబడువారి మరణమునకు తానే కారణమనియును, సమావేశమైన వారందరును తనస్వజనులనియును తలంచి, దుఃఖించి, యుద్ధము చేయజాలనని శ్రీకృష్ణునితో ననెను. అర్జునునికి మానవజీవిత నిర్మాణమునకు సంబంధించిన యథార్థ విజ్ఞానము లేనందువలననే దుఃఖించి, యుద్ధమును చేయనను చున్నాడని పరమాత్మ గ్రహించెను. యథార్థ విజ్ఞానము లేనివారు వ్యామోహాపూరితులు. కాననే శ్రీకృష్ణపరమాత్మ సృష్టి వైచిత్ర్యములను ఆతని కెరింగించి, మానవులు నిమిత్తమాత్రులనియును, లోకమంతయు భగవత్స్వరూపము కాన, లోకమున జరుగుపనులన్నియు భగవత్ప్రేరణవలననే జరుగుచున్నవని అనుభవపూర్వకముగ అర్జునునికి జూపెను.

మానవునియందు ప్రబలముగ పనిచేయు, "అహం-మమలు" పక్వమగు విధానమును తెలిపి, వ్యక్తిగతమగు 'అహము' విశ్వవ్యాపియగు విశ్వేశ్వరుని యందు లీనముచేయుట అవసరమని బోధించెను. మానవశక్తులు విశ్వేశ్వరునియందు విలీనమైననే కాని, అశాశ్వతమగు ప్రపంచమున మానవునికి శాశ్వత సుఖానందములు చేకూరవని స్పష్టపరచెను. కాన గీతాతత్త్వమును ఒక్క ముక్కలో చెప్పవలయునన్నచో "యోగీభవ" అనునది క్రమమగు సంక్షిప్త గీతావ్యాఖ్యానమని తెలియవలయును. సంపూర్ణమగు ఆత్మయోగియగుట కవసరమగు విధానములను యుక్తియుక్తముగ, సామాన్య ప్రజాసముదాయము

కావననే ఆధునిక జీవితప్రమాణము సమగ్ర జీవిత సమస్యాపరిష్కారదృష్టిని గాక, సామాన్య రాజకీయదృష్టినే ప్రధానముగా గలిగియున్నది. శాస్త్ర పరిశోధనల ఫలితముగ ప్రపంచాభివృద్ధి మహత్తరముగ జరుగుచున్నదని ప్రజలు భ్రమపడుచున్న కాలమిది. చెడు ఫలితములను ప్రతివారును అనుభవించుచున్నను, పదార్థ విజ్ఞానాభివృద్ధిని ప్రశంసించనివారరుదు. అగ్రరాజ్య సమితులు, భద్రతా సంఘములు, శాంతిసభలు – విజ్ఞాన విహారములు మొదలగునవి నిర్విరామముగ పనిచేయుచున్నవి. గత 30 వత్సరములలో రెండు ప్రళయయుద్ధములకు కారణమై, మూడవ మహాయుద్ధమేఘములను ప్రపంచమునందంతటా వ్యాపింపజేయుచున్నది రాజకీయ ప్రాబల్యమునకు లోనైన ఈనాటి పదార్థవిజ్ఞానమే. వైజ్ఞానికముగ మానవులందరు సమమనుభావము విశ్వవ్యాప్తమైననే కాని, ప్రపంచశాంతియేర్పడదు. నేటి నాగరికత ప్రపంచశాంతిని సమకూర్పగలదని విశ్వసించుట ఎండమావులలో దాహముతీర్చుకొని ఆనందించుటతో సమమగుచున్నది. విషమును తినుచు, అమృతఫలములను పొందగోరుట వెర్రితనము.

ప్రపంచశాంతినిస్థాపించి, విశ్వైక్యతను సమకూర్పగలవిజ్ఞానము మతమునందు పొందుపరచబడియున్నది. కావననే "Religion is realisation" మతమనగా భగవదైక్యతను సమకూర్చు సమగ్రవిధానమని పెద్దలు నిర్వచించియున్నారు. ప్రజలకు మతమంటే యెంతో అభిమానము. మతమువలన జీవితము మహిమాన్వితమగునని ప్రజాభిప్రాయముకూడా. ఆత్మానుభవము లేని మతప్రచారకులు, బాహ్యాచార ప్రసక్తిని పెంచి, బాహ్యాచారముతే మతమనుభావమును ప్రజలయందు బలపరుచుటయే, యీనాటి ప్రజలదుస్థితికి మూలకారణము. యావజ్జీవితవిధానమును భగవత్పరముగ, సమన్వయించు ప్రబోధ మీ కాలమున కత్యవసరము. ప్రపంచమునందలి మతగ్రంథములన్నియు, జీవితమును భగవత్పరముగ-లోకకల్యాణప్రదముగ-సంస్కరించుకొనుటయే, మానవుని కర్తవ్యమని హెచ్చరించుచున్నవి.

ప్రపంచ మత గ్రంథములలో భగవద్గీతకు అద్వితీయ స్థానము లభించినది. భగవద్గీత సర్వోపనిషత్సారము. ఉపనిషత్తులు వివిధ విజ్ఞానసూత్ర విరాజితములు. శ్రీకృష్ణపరమాత్మ యావదుపనిషత్సారమును గీత యందు యిమిడ్చి, అర్జునుని నిమిత్తమాత్రముగా నుంచుకొని లోక పునర్నిర్మాణము నిమిత్తమై, మానవజాతికి అందించియున్నారు. గీతయందు జీవిత

సమస్యలన్నియు సక్రమముగ పరిష్కరింపబడినవి. ప్రకృతియందనుక్షణము జరుగుచున్న తీవ్రపోరాటమును-మంచి చెడుగులకు-న్యాయాన్యాయములకు-ధర్మాధర్మములకు జరుగుచున్న దానిని నిరపాయకరముగ పరిష్కరించు విధానములను గీతయందు సుస్పష్టముగజూపి, అర్జునునిచే "కరిష్యే వచనం తవ" అనిపించి, ధర్మయుద్ధమును జేయించియున్నారు. పదునెనిమిది అధ్యాయములుగా విభజించి, జీవిత సమస్యలను యోగదృష్టితో - లోక కల్యాణప్రదముగ పరిష్కరించు సక్రమమార్గములను గీతయందు జూపియున్నారు. ప్రత్యేకముగ యే కొలదిమందికో గాక, ప్రపంచములోని ప్రజలందరికిని - వారి యోగ్యతల ననుసరించి వుపయోగించుమార్గములు గీతయందు గలవు. అర్జునుడు మానవులందరికిని శాశ్వత ప్రతినిధి. గీతాతత్త్వమును గురించి, అందలి విజ్ఞాన సమన్వయమును గురించి - అట్టి సమన్వయప్రయోజనమును గురించి యిచట కొంత ముచ్చటింతుము.

అర్జునుడు మహావీరుడు. యుద్ధమును స్వప్రేరణతో చేయుచున్నాననియును, యుద్ధములో చంపబడువారి మరణమునకు తానే కారణమనియును, సమావేశమైన వారందరును తనస్వజనులనియును తలంచి, దుఃఖించి, యుద్ధము చేయజాలనని శ్రీకృష్ణునితో ననెను. అర్జునునికి మానవజీవిత నిర్మాణమునకు సంబంధించిన యథార్థ విజ్ఞానము లేనందువలననే దుఃఖించి, యుద్ధమును చేయనను చున్నాడని పరమాత్మ గ్రహించెను. యథార్థ విజ్ఞానము లేనివారు వ్యామోహపూరితులు. కాననే శ్రీకృష్ణపరమాత్మ సృష్టి వైచిత్ర్యములను అతని కెరింగించి, మానవులు నిమిత్తమాత్రులనియును, లోకమంతయు భగవత్స్వరూపము కాన, లోకమున జరుగుపనులన్నియు భగవత్ప్రేరణవలననే జరుగుచున్నవని అనుభవపూర్వకముగ అర్జునునికిజూపెను.

మానవునియందు ప్రబలముగ పనిచేయు, "అహం-మమలు" పక్వమగు విధానమును తెలిపి, వ్యక్తిగతమగు 'అహము' విశ్వవ్యాపియగు విశ్వేశ్వరుని యందు లీనముచేయుట అవసరమని బోధించెను. మానవశక్తులు విశ్వేశ్వరునియందు విలీనమైననే కాని, అశాశ్వతమగు ప్రపంచమున మానవునికి శాశ్వత సుఖానందములు చేకూరవని స్పష్టపరచెను. కాన గీతాతత్త్వమును ఒక్కముక్కలో చెప్పవలయునన్నచో "యోగీభవ" అనునది క్రమమగు సంక్షిప్త గీతావ్యాఖ్యానమని తెలియవలయును. సంపూర్ణమగు ఆత్మయోగియగుటకవసరమగు విధానములను యుక్తియుక్తముగ, సామాన్య ప్రజాసముదాయము

నకుగూడ చక్రాగ అర్థమగునట్లు-ఆ స్థానమునం దుంచుకొనుట కనువగు నట్లు-భగవద్గీతయందు సువ్యక్తము చేసియున్నారు.

విశ్వరూప సందర్శనమున ప్రపంచమంతయు తనయం దెట్లు "సూత్రే మణిగణాయివ" అను సిద్ధాంతప్రకారము, కేంద్రీకృతమైయున్నదో స్పష్టముగ అర్జునునికి జూపెను. సృష్టిలోని యావద్వ్యక్తములు భగవదంశలై యున్నప్పుడు యుద్ధముచేయుటకై సమావేశమైనవారుకూడ భగవదంశాసంభూతులెందుకు కారు? అట్లగుచో వారు అధర్మప్రేరితులగుటకు కారణమేమి? వారు కూడ భగవదంశసంభూతులే కాని బహుజన్మల ఫలితముగ వారిని యున్న ప్రకృతిలక్షణము లావరించియున్నవి. ప్రకృతి దైవాసుర సంపదలతో కూడినది. కాన, అందరియందును దైవాసుర - ప్రకృతులు పరిపరి విధముల ప్రకటిత మగుచుండును. జీవసముదాయము భగవత్సహాయము నర్థించుచో, వారిని సంరక్షించుటకు భగవంతుడు సర్వకాల సర్వావస్థలయందును, సంసిద్ధుడై యున్నాడు. కావుననే మానవులు భగవత్సహాయముతో, భగవన్నిర్మిత ధర్మములను క్రమముగ అనుష్టించి, మానవులందరు దైవాంశ సంభూతులను ఏకైక సూత్రబద్ధులై యుండవలెనని, పరమాత్మ హెచ్చరించియున్నారు. గుణకర్మల ననుసరించి మానవవర్గమును నాలుగువిధములుగ విభజించి, నాలుగు వర్ణములవారును విశ్వేశ్వరానుగ్రహమును బడయుటకు, సహజముగ తోడ్పడు ధర్మములను - జీవిత విధానములను స్పష్టపరచియున్నారు. మానవులే కార్యములను జేయుచున్నను, మూలము పరమేశ్వరుడే కాన, పరమేశ్వరునికి హితకరముగనే ఆయా కార్యములను నిర్వహించవలెనని కూడా యుక్తియుక్తముగ తెలిపియున్నారు "యత్కరోషి యదశ్నాసి" అను సిద్ధాంతమును నిర్వచించి, మానవుడు చేయు యావత్కార్యములను భగవదర్పితముగ (భగవదైక్యత నిమిత్తమై) చేయుచున్నామని విశ్వసించవలెనని యున్నారు. ఆయనయే లోకైక ప్రభువు కాన, ఆయనకు ప్రీతికరముగా చేయు కార్యములన్నియు శ్రేయోదాయకములని మరువకూడదు.

ప్రయోజనమునుబట్టి ప్రాధాన్యత కలుగుట సహజము. భగవద్గీత లోక కల్యాణప్రదమగు గ్రంథములలో అత్యంత ప్రధానమైనదని వాక్రుచ్చి యున్నాము. గీతాప్రయోజనమును, సమగ్రముగ యోచించి తెలుసుకొనుట అత్యంత ప్రయోజనకరము. గీత అద్వైతమును ప్రతిపాదించుచున్నదా? ద్వైతమును ప్రతిపాదించుచున్నదా? లేక విశిష్టాద్వైతమును ప్రతిపాదించుచున్నదా?

గీతలలో ప్రధానమైనది కర్మయోగమా? భక్తియోగమా? ధ్యానయోగమా? లేక జ్ఞానయోగమా? - అని యోచించువారికి గీతయొక్క సమగ్రతత్త్వము అనుభవములోనికి వచ్చుట దుర్లభము. గీత నుపదేశించిన వానియందు ప్రత్యేకముగ యే యొక్క విధానమునో కాక, అన్ని విధానములను ప్రతిపాదించినది. అంతే కాక, ప్రపంచ మతములయందు ప్రతిపాదింపబడిన విధానముల నన్నిటినికూడా సమయానుకూలముగ గీత వ్యక్తపరచియున్నది. గీత విజ్ఞాన సర్వస్వమని ప్రశంసించుటలోగల విశేషమును గుర్తింతుముగాక! మానవుడు భగవదంశా సంభూతుడను విషయమును స్వానుభవమునకు తెచ్చుకొని, సర్వభూతహితకరమగు దృష్టితో, సమ్పూర్ణశరణాగతుడై స్వధర్మమును నిర్వహించమనుటయే గీతాసారము.

మానవులందరు భగవదైక్యమును సాధించుటకై గీత నుపయోగించుకొనుచున్నారని తలంచుటకు వీలులేదు. వివిధ దృక్పథములతో, ప్రజలు గీత నుపయోగించుకొనుచున్నారు. అందు నాలుగు దృక్పథముల నిట వివరింతుము. (1) గీతయే భగవంతుడని భావించి, గీతాగ్రంథమునకు అర్చనాదులను సల్పువారు కొందరు. గీతయందెట్టి ధర్మములు నిర్వచింపబడినవో తెలుసుకొనుటకై యీ వర్గమువారు ప్రయత్నించరు. భగవద్విగ్రహమును పూజించునట్లు వీరు గీతకు షోడశోపచారములను గావించి తృప్తులగుచున్నారు. (2) గీతలలోని శ్లోకములందు బీజాక్షర సంయుతమైయున్న మంత్రరాజములెన్నో యున్నవని విశ్వసించి, అంగన్యాసకరన్యాసములతో కొన్ని శ్లోకములను పారాయణ మొనరించి తృప్తిపడువారు మరికొందరు. వారు కూడ అందలి విజ్ఞాన విశేషములను గుర్తించక, శ్లోకపఠనముతోనే తృప్తి గాంచెదరు. (3) మరికొందరు బుద్ధిబలముగలవారు, లోకమున నూతన మతశాఖలను వ్యాపింపజేయుటకై గీత నుపయోగించుకొందురు. నూతన సిద్ధాంతముల కవసరమగు సూత్రములను ముందుంచుకొని, గీత మొత్తమును ఆ సిద్ధాంతముల కనువుగ వ్యాఖ్యానించుచు, తమ శాఖను బలపరుచుకొనుటకై యత్నింతురు. (4) గీతలయందు స్పష్టము చేయబడిన సూత్రములను, ఆ సూత్రప్రయోజనములను గుర్తించి, అందలి విశేషమును స్వానుభవములోనికి తెచ్చుకొని, లోపములను సవరణ గావించుకొని, అందలి సత్య విధానములననుసరించి జీవిత నిర్మాణమును గావించుకొనువారు కొందరు. ఈవర్గమువారి దృష్టి అభ్యుదయ ప్రేరితమైయున్నది. ఇట్టి దృక్పథ మీ కాలమునకెంతో అవసరము. గీతాప్రచా

రమువలన సాధించగోరుచున్నది ప్రజాసామాన్యమునం దిట్టి దృష్టిపథమును కలిగించుటయే.

ఇం దేవరివాద మెంతవరకు గీతాహృదయమును వెలిబుచ్చునో బుద్ధిమంతులుమాత్రమే తెలుసుకొనగలరు. గీతయందు తెల్పిన యావద్విషయములను విని, అర్జును డేమిచేసెనో గుర్తించుచో, గీతాహృదయమువనకు చాల వరకర్థమగును. వివిధ విధానములను పరమాత్మ అర్జునని కెరిగించెనేకాని, అ దేయొక్క విధానమును అవలంబించమని ఆతనిని హెచ్చరింపలేదు. పరమాత్మ దృష్టిలో యావద్విధానములు ప్రధానములైనవే. "యథేచ్ఛసి తథాకురు" అని పరమాత్మ సలహా నిచ్చియున్నారు.

అర్జునుడు శ్లో॥ "నష్టో మోహః స్మృతిర్లబ్ధా, త్వత్ప్రసాదాన్మయాచ్యుత, స్థితోస్మి గతసందేహః కరిష్యే వచనం తవ"+ అని తెలియజేసి కురుపాండవ యుద్ధమందు పాల్గొని ధర్మస్థాపనకు నిమిత్తకారణమాయెను.

ఇట్టి భగవద్గీతా ప్రచారము విరివిగా కొనసాగించవలసిన ఆవశ్యకత శ్రీ శ్రీ నరేంద్ర ఆనంద సరస్వతీస్వాములవంటి వారియందే తెలియయున్నది. శ్రీవారు యిదివరకే ఆంగ్లమున కొన్ని వైజ్ఞానిక గ్రంథములను రచించి ప్రకటించియున్నారు. ఆంధ్రసోదరులయందు నిర్మాణాత్మక జీవిత విధానమును, భగవద్గీత నాధారముగావించుకొని, ప్రబోధించు అవసరమును గుర్తించి "గీతామృత సారమను" యీ గ్రంథమును ప్రచురించియున్నారు. విజ్ఞానసమితి సభ్యులును, యితర విజ్ఞానాభిమానులు - మతప్రచారాసక్తిగల వారును, శ్రీస్వామివారికి తోడ్పడి, శ్రీవారి యుద్యమము సక్రమవ్యాప్తిని గాంచునట్లు ఆర్థికముగను, తదితర విధముగను తోడ్పడునట్లు, సర్వాంతర్యామియగు, శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహించుగాక !

హరిః - ఓమ్ - తత్సత్.

—సుకృతానందస్వామి.

# ముఖవచనము

శ్రీమత్పరమహంసాది బిరుదాంకితులగు శ్రీ శ్రీ నరేంద్ర ఆనంద సరస్వతీస్వాములవారు రచించిన గీతాసార సంగ్రహమును ప్రత్యక్షర పరిశీలన పద్ధతితో నేను పరికించితిని. గ్రంథ శైలియు, రచనా పద్ధతియు శ్రీస్వాములవారి ప్రవీణతను, భగవద్గీతానుభవమును ప్రకటించుచున్నవి. ఈ గ్రంథమునందలి నూతన భావము లాధునికులకు హృదయంగమములగుచు, శ్రీ భగవద్గీతను పఠించుకోర్కెను గలిగించుచున్నవి. గీతయందలి సన్న్యాస, కర్మయోగ శబ్దముల యర్థము నిర్ణయించుటలో నూతన వ్యాఖ్యాతలు ప్రకటించిన వివిధాభిప్రాయములను ప్రదర్శించి, శ్రీ స్వాములవారు స్వానుభవ పూర్వకముగ శ్రీకృష్ణహృదయ గతార్థ మిట్టిదియే యని వ్రేలు పెట్టి చూపిరని పాఠకమహాశయులకు దోపకపోదు. "సన్న్యాసః కర్మయోగశ్చ, నిశ్శ్రేయస కరావుభౌ" అను శ్లోకమునగల సన్న్యాస, కర్మయోగ శబ్దములు వేఱువేఱర్థములను బోధించునట్లు కనబడుచున్నది. "నిశ్శ్రేయస కరావుభౌ" అను పాదమునందు పై రెండు నొకేఫలమును కలిగించునవిగ శ్రీకృష్ణ భగవానుడు నుడువుటను బట్టి, నొకే యర్థమును బోధించు నవియైయున్నవని శ్రీ స్వాములవారు చక్కగ ప్రతిపాదించిరి

సన్న్యాస శబ్దమునకు సర్వకర్మలను వదలుట యర్థమనియు, కర్మయోగశబ్దమునకు కర్మములనాచరించుట యర్థమనియు, సామాన్యదృష్టికి దోచుచున్నను "నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్" అనుటవలన నట్టి యర్థము బాధితమగుచున్నది. ఏలయన, "నహి కశ్చిత్" అనుటచే ప్రతి వ్యక్తియు సర్వదా కర్మమును చేయుచునే జీవించుచున్నట్లర్థమగుటచే, సన్న్యాసులకుకూడ కర్మ వదలుకొన వీలుగానిదని తెలియుచున్నది. అగుచో సన్న్యాసికిని, కర్మయోగికిని భేదము లేకపోవలసివచ్చును. శ్రీకృష్ణ భగవానుడు "నిశ్శ్రేయసకరావుభౌ" అను నెడ, సన్న్యాసకర్మయోగము లొకే ఫలము నిచ్చునట్టి వనుటచే నొకే యర్థము ప్రతిపాదించునవి యని సెలవిచ్చినట్లయ్యెగదా! అట్టిచో సన్న్యాసికిని, కర్మయోగికినిగల భేదమును బాగుగ గ్రహింపదలచి యజ్ఞుడను—

శ్లో॥ సన్న్యాసస్య మహాబాహో ! తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన (18-అ-1)

అని ప్రశ్నింపగా ద్వితీయ శ్లోకమున—

శ్లో॥ కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః।
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః॥ (18-అ—2)

సన్న్యాసమనగా కామ్య కర్మాచరణ వదులుకొనుట యనియు, త్యాగమనగా సర్వకర్మఫలమును వదులుకొనుట యనియు, సన్న్యాస త్యాగశబ్దముల యర్థమును బోధించిరి. దీనిచే యేమని తెలియబడుచున్నదనగా — లోకమున సన్న్యాసులుగ పేర్కొనబడు యతులును, కర్మయోగులుగ పేర్కొనబడు గృహస్థులును యోగులని, త్యాగులని పేర్కొనబడతగినవారే. అయిన నిక నుభయులకు భేదమేమనినచో జ్ఞానయోగులు, సాంఖ్యులనగు సనకాది సన్న్యాసుల సన్న్యాసము కామ్యకర్మ త్యాగరూపమనియు, కర్మయోగులగు జనకాది గృహస్థుల కర్మయోగము, కర్మఫల త్యాగరూపమనియు, నెఱిగించినారు. శ్రీ స్వాములవారీలాటి విషయముల ననుభవపురస్కారముగ సూక్ష్మపద్ధతిని తెన్నుగ విమర్శించి, యీ గీతాసార సంగ్రహమును సులభముగ బోధపడునట్లు రచించిరి. ఏకేని సుతఫలను నర్థించి కర్మ నాచరించు మనుజుడు కర్మయోగి కాజాలడనియు, కామ్యకర్మలనాచరించు యతి సన్న్యాసి కాజాలడనియు దీని సారాంశము.

శ్రీకృష్ణ గీతార్థబోధక గ్రంథములు లోకమున పెక్కుగలవు. కాని యిట్టి గ్రంథములే లోకోపకారములు కాగలవని నా అభిప్రాయము.

గుంటూరు,
సర్వజిత్తు సం॥ర
భాద్రపద శు-౧౨.

(సం.) కాశీ కృష్ణాచార్యులు,
(అవధాన శిరోమణి, మహామహోపాధ్యాయ)




H. H. Swami Narendra Ananda Saraswati, Author.

FOUNDER : PRESIDENT

SRI BHASKARA ANANDA ASRAMAM

NANDIGAMA — Krishna Dt.



శ్రీ భాస్కర ఆనంద ఆశ్రమము, నందిగామ - కృష్ణాజిల్లా. (స్థాపన 1928)

# గ్రంథ ప్రశంస

"గీతామృత సార సంగ్రహము"న కుపక్రమించిన శ్రీ నరేంద్ర ఆనంద సరస్వతి స్వామివారి నెరుంగని వారెవరును ఆంధ్రమండలములో లేరని ఘంటాపథముగా చెప్పవచ్చును. అయినను సాంప్రదాయానుసారముగా, నీ యుద్గ్రంథ విశిష్టతను గురించియు, నే తత్ గ్రంథకర్త మేధాసంపత్తిని గురించియు, ఒకించుక ప్రస్తావన సమంజసమే. శ్రీ స్వామివారు ఉభయ భాషాప్రవీణులేగాక, ఉభయ వేదాంత విశారదులు కూడ. పాశ్చాత్య విజ్ఞానమునందును, ఆర్ష విజ్ఞానమునందును, సమానమైన ప్రవేశము, ప్రావీణ్యము కలవారు. తొలుత భారతభూమి అన్ని కళలకు పుట్టినిల్లయినను, క్రమశః శాస్త్ర అనుభవములేని పండితులకు ఆటపట్టయిన విషయము అందరకును విదితమే.

(2) ఇట్టి తరుణములో మనధర్మము మన మనుష్ఠించుట ప్రశస్తము. మన సాంప్రదాయము పాశ్చాత్య సాంప్రదాయములకన్న అనేక విధముల శ్రేష్ఠము. మన విజ్ఞాన విశిష్టత నవలోకించుట క్లిష్టముకాదు. మన ఋషులుచేసిన హెచ్చరిక యీనాడు మనము గమనించిన యెడల, వ్యక్తిగతమైన ఆత్మవికాసము కలుగుటయేగాక, లోక కల్యాణముసహా చేకూరును. శ్రీస్వామివారు సహజపాండిత్యముతో, సుమధుర శైలితో, సర్వజన సుబోధకముగా, ప్రమాణవిరుద్ధము కాకుండునట్లు, విశేషశ్రమకోర్చి యీ గ్రంథరాజమును ఆంధ్ర

లోకమునకు ప్రసాదించుట, ఆస్తిక్యబుద్ధిగల ప్రతివిజ్ఞాని హర్షించవలసి యున్నది.

(3) సామాన్యముగా యితర మతస్థులందరు వారి సిద్ధాంతములను సంపూర్ణముగ తెలుసుకొనలేకపోయినను, యించుమించుగా గ్రహించుకొనుచునే యున్నారు. మన మతమును తెలుసుకొనుట కట్టి సౌలభ్యము లేకుండుట శోచనీయమే. క్రైస్తవులు బైబిలును నమ్ముచున్నారు. ముసల్మానులు కొరానుమీద నాధారపడుచున్నారు. బౌద్ధులు త్రిపీటకములను ప్రమాణముగా నెంచుచున్నారు. అట్టి సౌలభ్యముతో యేదో ఒకశాస్త్రము మన కాధారమని చెప్పలేక యున్నాము.

(4) ఇట్టి పరిస్థితిలో మనకు గీత పరమప్రమాణమని, అందలి సిద్ధాంతములు యెంత మాత్రము పరస్పర విరుద్ధములు కావని, అవి సర్వజన సమాదరణీయమని, శ్రీస్వామి వారు యీ గీతామృత సార సంగ్రహములో విశేషముగ సమర్థించిరి. కర్మ, భక్తి, జ్ఞానములు–వీటికిగల సంబంధ విశేషములు, వీటి నిర్వచనము, భగవత్పరముగ వీటి అవినాభావము, మొదలైన అంశములు అనన్యసామాన్య ప్రతిభతో యిందు విశదీకరించిరి.

(5) హైందవ విజ్ఞానము సనాతన ధర్మావలంబన ఫలము. దానికి ఆధారము ప్రస్థానత్రయము – గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు. దీనికి అధికారి సాధన చతుష్టయ సంపన్నుడు. దీని ఫలము దుఃఖనివృత్తి, నిరతిశయానంద ప్రాప్తి. వ్యక్తిగత భేదము సృష్టి విశేషము. కావున యెవరి

ధర్మము వారు అవలంబించుట వారికి శ్రేయస్సు. అన్యధర్మావలంబన వినాశకారణము. "స్వధర్మే నిధనం శ్రేయః"—యిదియే గీతాహృదయము. ఐనను గీత కర్మను బోధించుచున్నదా? జ్ఞానమును బోధించుచున్నదా? భక్తిని ప్రబోధించుచున్నదా? అని కొందరు జిజ్ఞాసులు పృచ్ఛ చేయుచున్నారు. అట్టి పృచ్ఛ అజ్ఞాన జనితమని, "గీతామృత సార సంగ్రహము" ఘంటాపథముగ చెప్పుచున్నది. కురుక్షేత్రమునందు, శత్రుసైన్యమధ్యమున క్షత్రియుడైన పాండవ మధ్యముని ధర్మము—

"హతోవా ప్రాప్స్యసే స్వర్గం, జిత్వావా భోక్ష్యసే మహీం
తస్మాత్ ఉత్తిష్ఠ కౌంతేయ, యుద్ధాయ కృతనిశ్చయః".

మనము అందరము శత్రుసైన్య మధ్యమున లేముకదా. అట్టిచో క్షత్రియునకు రణభూమిలో నిర్దేశింపబడిన ధర్మము అందరికి అన్ని అవస్థలలోను, పరమధర్మమని యెంచి, గీత కర్మనే ప్రతిపాదించుచున్నదని చెప్పుట అసమంజసము. జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు గీత జ్ఞానమునే ప్రతిపాదించుచున్నదని, లోకమాన్య తిలక్ అది కర్మను బోధించుచున్నదని, భిన్న అభిప్రాయములను సూచించుటకు అధికార తారతమ్యత నవలోకించకుండుటే కారణము.

(7) నిజస్థితిలో శ్రీశంకరాచార్యులవారు ప్రతిపాదించిన సిద్ధాంతము, బాలగంగాధర తిలక్ ప్రతిపాదించిన సిద్ధాంతము—రెండూ సహేతుకమే. రణరంగములో శత్రుసైన్యమధ్యమునందున్న క్షత్రియుని ధర్మము కర్మ—కర్మ—కర్మ—అని ముమ్మాటికి చెప్పవచ్చును. తద్భిన్నమైనప్పుడు అనగా ప్రాతిపదిక మరి

రొకటి అయినప్పుడు యింకొక ధర్మము చెప్పకయే చెప్పబడు చున్నది.

(8) మేధాసంపన్నులు సూచించిన సూత్రములన్నియు సమాదరణీయమే. వీటి నన్నిటిని బుద్ధి కుశలతతో శ్రీస్వామి వారు సమన్వయముచేసి ఆంధ్ర ఆస్తిక్యలోకమునకు ఆత్మ జ్యోతినిజూపి, అందరి కృతజ్ఞతకు పాత్రులైరి. భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యములు ప్రసాదించుగాక! వారు యిట్టి గ్రంథములు మరి కొన్నింటిని వ్రాయుటకు ఉపక్రమించి, మన సాంప్రదాయమునకు నూతన మర్యాద చేకూర్చ గలుగు దురుగాక !

ఒంగోలు,
26-9-51.

భీమరాజు శ్రీనివాసరావు,
యం. ఎ., బి. యల్., జిల్లాకోర్టు వకీలు.

# విజ్ఞాపన

ఓమ్-శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీవరేంద్రానంద సరస్వతీ స్వామివారాంధ్రమున రచించిన గీతామృతసార మను గ్రంథమును నేను పఠించి మిగుల నానందించితిని. పండితులకే కాక ఆబాలగోపాలురకు, స్త్రీలకు సైతము సుబోధకమగునట్లు గీతాశాస్త్రములోని క్లిష్టభాగములు గూడ మిగుల సులభశైలిని రచించి శ్రీస్వామివారు లోకసంగ్రహార్థము ప్రకటించుచుండిరని నా నిశ్చితాభిప్రాయము.

మతవిషయిక బోధలేకను, పాశ్చాత్యసంపర్కమువలనను ఈ కాలపు బాలురు మనదేశీయ సాంప్రదాయములను బొత్తుగా విడనాడి, అన్యసాంప్రదాయములయినను క్రమముగా గ్రహించలేక అధోగతిపాలై ఉభయభ్రష్టులై చెడిపోవుచున్నారు. వీరిని సంస్కరించి మంచిస్థితిలోనికి దెచ్చుట అందఱకును ముఖ్యకర్తవ్యము.

ఉపనిషత్సమ మయినదియు, యోగశాస్త్రమని ప్రసిద్ధిగాంచినదియు, స్వదేశ పరదేశములం దెల్లెడల మిక్కిలి గౌరవమును వడసినదియునగు, 'భగవద్గీత'యను గీతాశాస్త్రమును ఇప్పటి బాలుర కుపదేశించి నాస్తికత నుండియు, వితండ వాదావలంబనము నుండియు, వారల బుద్ధి మరలించి, సత్సంప్రదాయమార్గమున బోనపనిచో మనజాతీయ, దేశీయ, సాంప్రదాయములు, మర్యాదలు, కొలదికాలములోనే పూర్తిగ నశించుననుటకు సందియము లేదు. కావున పాఠశాలలయందు భగవద్గీత నొక పఠనీయగ్రంథముగ నియమించి, నిత్యకృత్యముగ బాలురచే చదివించుట అత్యావసరము.

అసలు భగవద్గీత (గీతామాతృక) సంస్కృతభాషలో నుండుటచే దాని తాత్పర్యసిద్ధాంతములు బాలురందఱకు నందుబాటులో లేవు. సమస్తజనులకు బోధయగునట్లు 'గీతామృత సార' మనుపేర శ్రీస్వామివారు దీని సారాంశమును ఆంధ్రమునగూడ రచించి ప్రకటించియున్నారు. ఇది ప్రతి ఆంధ్రుడు చదివి వేదాంతశాస్త్రము యొక్క ముఖ్యాభిప్రాయమును తెలుసుకొనదగినది. మఱియును ఈ గ్రంథమును ఆంధ్రదేశమందన్ని పాఠశాలలలోను పాఠకగ్రంథముగ బెట్టి, ప్రథమ తరగతినుండియు చదివించిన పూర్వసిద్ధాంతములందు హేళనబుద్ధి నశించి, సత్సంప్రదాయములయెడల నభిరుచి యేర్పడి జాతీయ నాగరకతయందు గౌరవము పునరుజ్జీవితమగుటకు కారణమగును.

శ్రీ వారీగ్రంథమందు సామాన్యదృష్టికి పరస్పర విరోధములుగదోచు కర్మ, సన్న్యాస, కర్మసన్న్యాసాది యోగముల క్రోడీకరించి సమన్వయపఱచి, శ్రీకృష్ణపరమాత్మ బోధించిన పరమసిద్ధాంతమును కరతలామలకముగ జూపెట్టియున్నారు. వీరి భక్తియోగ వివరణ మప్రతిమానము.

సర్వజిత్-ఆశ్వయుజ శు ౧౦,
శుక్రవారము 24-10-1947.

ఏకా లక్ష్మీనరసింహం, B.A., B.L.
అరండల్ పేట, గుంటూరు.

# ధ్యాన శ్లోకములు

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే॥

యస్యద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః, పరశ్శతమ్,
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనంతమాశ్రయే॥

ఓం, పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతమ్,
అద్వైతామృత వర్షిణీం భగవతీ మష్టాదశాధ్యాయినీ
మంబ! త్వామను సందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్॥ ౧

నమోఽస్తుతే వ్యాస! విశాలబుద్ధే!
ఫుల్లారవిందాయత పత్రనేత్ర!
యేనత్వయా భారతతైల పూర్ణః,
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥ ౨

ప్రపన్న పారిజాతాయ తోత్రవేత్రైక పాణయే,
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృత దుహేనమః॥ ౩

వాచకః ప్రణవోయస్య క్రీడావ స్త్వఖిలం జగత్,
శ్రుతిరాజ్ఞా వపుర్జ్ఞానం తంవందే దేవకీసుతమ్॥ ౪

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః,
పార్థోవత్స స్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥ ౫

వసుదేవసుతం దేవం కంస చాణూర మర్దనమ్,
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్॥ ౬

వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్,
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్॥ ౭

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే,
నమోవై బ్రహ్మనిధయే వాశిష్ఠాయ నమోనమః॥ ౮

మునిం స్నిగ్ధాంబుదాభాసం వేదవ్యాస మకల్మషమ్,
వేదవ్యాసం సరస్వత్యావాసం వ్యాసం నమామ్యహమ్॥ ౯

అ చతుర్వదనో బ్రహ్మా ద్విబాహు రపరోహరిః,
అఫాలలోచన శ్శంభు ర్భగవాన్ బాదరాయణః॥ ౧౦

కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్,
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్॥ ౧౧

గీతాశాస్త్ర మిదం పుణ్యం యఃపఠేత్ ప్రయతఃపుమాన్
విష్ణోః పదమవాప్నోతి భయశోకాది వర్జితః॥ ౧౨

యంబ్రహ్మా వరుణేంద్ర రుద్ర మరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః,
వేదైః సాంగపద క్రమోపనిషదైః గాయంతి యం సామగాః,
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినో,
యస్యాంతం నవిదు స్సురాసురగణాః దేవాయ తస్మై నమః॥ ౧౩

శ్రీలక్ష్మీ హయగ్రీవో విజయతేతరామ్

శ్రీమత్పార్థసారథయే నమః

# గీతామృత సార సంగ్రహము

## ప్రథమాధ్యాయము

### అర్జున విషాద యోగము

గీతయందుగల అధ్యాయములు పదునెనిమిదింటిలో మొదటి ఆరు కర్మకాండ మనబడును. ఏడవ యధ్యాయము మొదలు పండ్రెండవ యధ్యాయాంతము భక్తి లేక ఉపాసనా కాండ మనబడును. అధ్యాయము పదమూడు మొదలు అధ్యాయము పదునెనిమిది వరకు జ్ఞానకాండ మనబడును.

రెండవ కాండలో తెల్పిన భక్తి, మొదటి కాండలో ప్రతిపాదించిన కర్మకు, మూడవ కాండలో ప్రతిపాదించబడిన జ్ఞానమునకు, రెంటికి నవసరము. కర్మ జ్ఞానములు భక్తిలేనిచో నిష్ప్రయోజనములు. మొదటి అధ్యాయములోని మొదటి 47 శ్లోకములు, రెండవ అధ్యాయములోని మొదటి 10 శ్లోకములు, కలసి మొత్తము 57 శ్లోకములు గీతా శాస్త్రమునకు పూర్వ పీఠిక. గీతారంభము 2 అధ్యాయము 11 శ్లోకముతో. దాని అంత్యము 18 వ అధ్యాయము 66 వ, "సర్వధర్మాన్పరిత్యజ్య" అనుచరమ శ్లోకముతో. శేషము– 18 అధ్యాయము 67–70 శ్లోకములు గీతాశాస్త్రమునకు ఉత్తరపీఠిక యనబడును. గీత యందలి 18 అధ్యాయములు జీవ బ్రహ్మైక్యమును తెలుపు పదునెనిమిది మార్గములు :–

శ్లో॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సఞ్జయ.

పైశ్లోకమునందు యుద్ధ సన్నద్ధులై కురుక్షేత్రములో తన కుమారులు – పాండవులు సమావేశమయిన పిదప ధృతరాష్ట్రుడు సంజయుని ఏమిచేసిరి అని ప్రశ్నించినాడు. అట్టి ప్రశ్న అప్రస్తుతముగా కనపడవచ్చును. దాని భావమేమని ఆలోచించిన కురుక్షేత్రమున లెక్కలేని ధర్మకార్యములు జరిగియుండుటచే అచ్చట సమావేశ మయిన కౌరవులు, పాండవులు యుద్ధముచేయుటకు, సిద్ధముగానున్నను, ఆధ్యాత్మిక వాతావరణమువల్ల వారి యభిప్రాయములు మారినవా ? లేక పాపులై పోరాడ యత్నించు చున్నారా? అని ధృతరాష్ట్రుడు తెలుసుకొనగోరి సంజయుని ప్రశ్నించెను. మరియు యుద్ధభూమి యందు గొప్ప భక్తులయిన భీష్మాదులుండుటచే, వారల గాంచిన పిమ్మట సాధువుల దర్శనమువల్ల పాపములన్నియు పరిహార మగును గాన కౌరవాదుల మనసు మారియుండునని సందేహము కలిగి, సంజయుని ధృతరాష్ట్రుడు ప్రశ్నించెను అని తెలియు చున్నది.

మానవులు మూడు రకములు. సాత్వికులు, రాజసులు, తామసులు. ధృతరాష్ట్రుడు తామస జాతిలో చేరినవాడు– దీపము ఒకటిగా నున్నను, దాని తేజస్సు త్రివిధముగా తెలియుచున్నది. గ్లాసుతో మూయబడిన దీపము తేజస్సుగా కనిపించును. చిల్లులుగల తట్టతో మూయబడిన దీపపు వెలుతురు తగ్గిపోవును. కుండతో మూయబడినది తేజస్సు లేకుండా పోవును. పైన జెప్పినరీతిగా, సాత్వికులు గ్లాసుతో

కప్పిన దీపమునంటివారు. రాజసులు కొన్ని సమయముల యందు మాత్రము పరమాత్మ విచారణ చేసెదరు. వీరు వెలుతురు తగ్గబడిన తట్టవల్ల కప్పబడిన దీపమువంటివారు.

దేహాభిమానము వదలక శరీరమే ఆత్మగా భావించి అజ్ఞానాంధకారమున నిమగ్నులయి, శరీరమే శాశ్వత మను తలంపుగల తామసులు, కుండవల్ల కప్పబడిన దీపము వంటి వారు. అచ్చపు చీకటిలో పడి కొట్టుకొను అధములగు తామసులకు. ప్రతినిధి ధృతరాష్ట్రుడు. కామ క్రోధాదులను జయించిన మహానుభావుడు సంజయుడు. (సద్గురువు)

శరీర పాటవము తప్పిన వృద్ధుడు భీష్ముడని దుర్యోధనుడు శంకించి ద్రోణాచార్యుని సమీపించి "దుష్టద్యుమ్నుడు పాండవ సైన్యముల నెంత చక్కగా, జాగ్రత్తగా ఆయత్త పరచినాడో చూడుడు! జాగ్రత్తగా యుద్ధము జరిపి, జయము సమకూర్చుడు; లేనిచో శిష్యునివలన జయింపబడిన మీకు అప్రతిష్ఠవచ్చును" అని చెప్పి పురిగొల్పెను. అందుకు భీష్ముడు, దుర్యోధనుడు తనయం దనుమానము పడుచున్నాడని తెలిసి కొని, మాటలతో ప్రయోజనము లేదని యెంచి, శంఖమును పూరించి సింహానాదము చేసెను. యుద్ధమునందు కూడ నీతి కలదు. శత్రువులు యుద్ధమునకు సిద్ధముగా నున్నామని తెల్పినగాని బాణప్రయోగము చేయరాదు. ఇంతలో శ్రీకృష్ణ సారథ్యముతో తెల్లని గుఱ్ఱములు కట్టిన గొప్ప రథమందు అర్జునుడు యుద్ధమునకు సిద్ధముగా నున్నాడని తెలియవచ్చెను. మానవ శరీరము రథము. రథములో కూర్చున్న అర్జునుడు ఆత్మ, రథమునకు కట్టిన గుఱ్ఱములు ఇంద్రియములు, గుఱ్ఱ

ములకళ్ళెము మనస్సు, విషయములు—శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు బాటలు. పరమాత్మ కృష్ణుడు — గమ్యస్థానము. మహాస్యందనము — గొప్ప రథము మానవ శరీరము. తెల్లని గుఱ్ఱములు నాలుగును జ్ఞానమును తెల్పు నాలుగు వేదములు. వేదచోదితులగు వారలకు ఆత్మ పరమాత్మ స్వరూపము తెలియును.

శ్లో॥ ఇంద్రియాణిహయాన్యాహు ర్విషయాంస్తేషుగోచరాన్
రథస్థం వామనందృష్ట్వా పునర్జన్మ నవిద్యతే॥

అనగా రథమునందు వేంచేసియున్న పరమాత్మయగు శ్రీకృష్ణుని చూచినవారికి పునర్జన్మలేదు. రథోత్సవము యీ నీతి ఫలదాయకమగుటకు యేర్పరచబడినది. రథము అన్ని జాతులవారు లాగవచ్చును. రథోత్సవ సందర్భమందు స్పర్శదోషములేదు.

యీ చిన్నరథము (మానవ శరీరము)లో నున్న జీవుని తెలుసుకొనిన వానికి జన్మరాహిత్యమగును. మనలోనున్న జీవాత్మను దెలుసుకొనుటయే విజ్ఞానమునకు మూల బీజము. ఇందుకు ఆత్మావలోకనమే మానవుడు చేయతగిన కృషి. ప్రస్తుతమందు శ్రీకృష్ణుడు (పరమాత్మ) అర్జునుడు (జీవాత్మ.) యుద్ధము నిమిత్తం అంతయు సర్వసిద్ధమై యుండెను. అర్జునుడు ధనుష్టంకారము చేయవలసిన సమయములో, మూడు లోక ములు స్వాధీనపరచుకున్న పరమాత్మయగు శ్రీకృష్ణుడు భక్తులకు దాసుడుగాను, అర్జును నిమిత్తముగా నుంచుకొని, అతనికి యుద్ధము చేయవలసిన కాలమున విషాదమును కలిగించి, అతని చేత పెక్కుమార్లు అడిగించుకొని, ఉపనిషత్తుల సారమును మన

కెల్లరకు బోధించుచున్నాడు. వేదాంతము బోధ చేయువారికి జారత్వమును, చోరత్వమును ఉండరాదు. స్థూలదృష్టియే ప్రధానముగా గలవారు పై రెండు దోషములు పరమాత్మ యగు శ్రీకృష్ణుని యందున్నట్లు తలంచెదరు. అర్జునుడు శ్రీకృష్ణుని బావమరది. అతిపరిచయము చులకదనమునకు, అగౌరవతకు కారణ మగుచున్నది. అర్జునుని క్లిష్టస్థితిలో పెట్టి, అనగా అర్జునునికి యుద్ధభూమియందు విషాదము కల్పించి ఉపశమన నిమిత్తము శ్రీకృష్ణుడు ప్రయత్నించి, అర్జునునిద్వారా ప్రపంచమం దెల్లరకు ఆత్మ విచారణయే పరమావధియని బోధ పరచెను. పరమాత్మ అర్జునునికి విషాద నివారణ మును బోధ పరచుటలో ఆంతర్య మిది.

ఇట్లు పరమాత్మచే ప్రేరేపించ బడిన అర్జునుడు శ్రీకృష్ణు నితో ఏమనె ననగా – "ఉభయ పార్శ్వములవారు కానవచ్చు నట్లు యుద్ధభూమి యందు రథమును నిలువ బెట్టుము. ఎవరు ఏ ప్రక్కనున్నారో, బలాబలములుచూచి యుద్ధము చేయువల యును." దీని అంతరార్థము ఏమన పాప పుణ్యముల రెంటి స్వరూపము తెలిసికొని, పాపమును వదలి పుణ్యము నవలం బించుటకు వాచక, మానసిక వృత్తులను మధ్యరకముగ నుంచు కొనవలయునని తెల్పుటయే. భక్త పరాధీనుడగు శ్రీకృష్ణుడు అర్జునుడు కోరిన ప్రకారము రథమును యుద్ధభూమియందు మధ్య నిలుపగా, అర్జునుడు తన బంధువులను, గురువులను నిలచియుండగా చూచి అఖండ భూమండలము స్వాధీనము కానున్నను, వారలతో తాను యుద్ధము చేయనని చెప్పెను.

బ్రహ్మజ్ఞానము బడెయుటకు కొన్ని ముఖ్యలక్షణములు (సాధన సంపత్తి) ఉండవలయును. అవి యేవన :-

(1) శాశ్వత అశాశ్వత వస్తువు లెవ్వి? (నిత్యానిత్య వస్తువివేకము)

(2) ఐహి కాముష్మిక సుఖముల యందు మనస్సు నిలుపకుండుట, వానియందు అసహ్యముగా నుండుట – ఇహ మూత్ర ఫలభోగవిరాగము.

(3) ఇంద్రియములను మనస్సును తన స్వాధీనమందుంచు కొనుట, ఓర్పు, విశ్వాసము, సమాధానము కలిగి యుండుట– శమదమాది షట్కసంపద.

(4) ప్రపంచబంధములు వదలించుకొను అభిలాష [ముముక్షుత్వము–]

అర్జునుని పరమాత్మయగు శ్రీకృష్ణుడు వ్యాజముగా నుంచుకొని మన కెల్లరకు తత్వ జ్ఞానోపదేశము చేయు తలం పుతో గీతారహస్యమును బోధించెను.

అర్జునుడు, "హేకృష్ణా! నాకు జయము అక్కరలేదు. రాజ్యము అక్కరలేదు" అనెను. [శ్లో॥ 32–33] బ్రాహ్మణు లాధ్యాత్మిక విద్యవలనను, క్షత్రియులు పరాక్రమము వలనను, వైశ్యులు ధనమువలనను, శూద్రులు విధేయతవలనను తరించ వలయును. అట్టిచో అర్జునుని శ్రీకృష్ణుడు ప్రశ్నించుచున్నాడు. అర్జునా! నీకు రాజ్యము లేనందువలన సుఖము ఏమి? అందుల కర్జునుడు నాకు సుఖ మక్కరలేదనెను. సుఖములేనిచో జీవ యాత్ర గడచుట యెట్లనిన, జీవించియుండుటగూడ అవసరము

లేదని అర్జునుడు చెప్పెను. మానవుడు ఎక్కువగా ప్రేమించునది శరీరము. దానికిమిక్కిలి ప్రాణము, అట్టి ప్రాణము గూడా తన కవసరములేదని అర్జునుడుచెప్పెను. శరీరమునందు వ్యామోహ మున్నంతకాలము సంసార మనుగ్రహితముగా నుండును. అందువలన బంధనతప్పుకొనలేము. వ్యామోహము నశించుమార్గము నన్వేషించుట మానవునికి కర్తవ్యము. అప్పుడే మానవుడు విరాగియగును. పరమ ప్రీతికరమైన ప్రాణమునందు అర్జునునకు విరక్తికలిగెను. అందువల్ల అత డిట్లు శ్రీకృష్ణుని ప్రశ్నించుచున్నాడు. "ఓ అచ్యుతా, నేను యుద్ధమున రాజ్యము గెలిచిన ఏమి ప్రయోజనము? నాబంధువులు, గురువులపై నే నెట్లు బాణప్రయోగము చేయగలను? ప్రయోగించి రక్తపుకూడు కుడువనగునా?" వలదు అను సంకోచము అర్జునుని మనసునందు కలిగెను. రాజ్యము నాకేల? కౌరవులు నన్ను చంపినను నాకు సమ్మతమే. నేను యుద్ధము చేయననెను. అందులకు పరమాత్మయగుశ్రీకృష్ణుడు, "అర్జునా! కౌరవులు ధర్మముతప్పినవారు. సందేహించక వారల యుద్ధమునందు సంహరించుట నీకు కర్తవ్యము. అన్నిరకముల పాపములుచేసిన కౌరవాదులను నీ వేలచంపరాదు?" అని పరమాత్మ అర్జునుని ప్రశ్నించెను. అర్జునుడు "అహింసా పరమోధర్మః"అను వేరొండు ఉత్కృష్ట ధర్మముగలదు. కనుక కౌరవాదులు ఎన్ని పాపములు మాకు జేసినను, నేను వారితో యుద్ధముచేయను. అపకారికి ఉపకారము చేయుటయే మహాపురుషుల లక్షణము కదా! "హే కృష్ణా, నా గాండీవము చేతినుండి జారిపోవుచున్నది. శరీరము గగుర్పాటు చెందుచున్నది. చెడు శకునము

లనేకములు పొడకట్టుచున్నవి. నేను యుద్ధము చేయను" అని కృష్ణ పరమాత్మతో అర్జునుడు చెప్పెను. "రాజ్యమందలి పేరాశతో స్వబంధువులు, మహనీయులగు గురువులు, మొదలగు వారిమీద యుద్ధము చేయవలయునను ఘోర పాప కార్యమునకు సిద్ధుడనైతిని" అని అర్జునుడు దుఃఖపడుచు రథమునందు వెనుకకు నొరిగిలబడెనని సంజయుడు ధృతరాష్ట్రునకు తెల్పెను.

దేహాత్మల భేదమును చక్కగా పరిశీలించి జన్మసాఫల్య మొందుటకు మానవజన్మతప్ప వేరొండుమార్గములేదు. అట్టి మానవజాతికి మూడువిధములగు దుఃఖములు గలవు.

అవి [1] ఆధ్యాత్మిక-[2] ఆధిభౌతిక [3] ఆధి దైవిక ములు. మనస్సునకు కామక్రోధాదులవల్ల నేర్పడునది ఆధ్యాత్మిక దుఃఖము. ప్రమాదవశమునగలుగు దుఃఖము ఆధి భౌతికము. ఇతరమువల్ల గలుగు దుఃఖము, ఆధి దైవికము. ఇట్టి దుఃఖములు, ఆత్మానాత్మ వివేకముగలిగినగాని నివారించబడనేరవు.

ద్వైత. అద్వైత, విశిష్టాద్వైతము మొదలగు సిద్ధాంతము లన్నిటికిని ప్రస్థానత్రయము ప్రమాణ గ్రంథములు. ఇవి[1] భగవద్గీత [2] ఉపనిషత్తులు [3] బ్రహ్మసూత్రములు. వైదిక మతము లన్నిటికిని పైన తెల్పిన మూడు గ్రంథములు ప్రమాణములు. పైన తెల్పిన ప్రమాణరహితమైన మతము అవైదిక మత మనబడును. నాస్తికవాదము పూర్వపక్షము చేయబడినది. ఉపనయన సంస్కారాదులు లేనివారు పైన తెల్పిన గ్రంథములను ప్రవచనము చేయరాదు. ద్విజులు కానివారలు,

స్త్రీలు, తరించు నిమిత్తము, వేదవ్యాసులవారు పదునెనిమిది పురాణములు వ్రాసి, పంచమవేద మనబడు భారతమును వ్రాసిరి. భగవద్గీత భారతగ్రంథములో భీష్మపర్వమున శ్లోక రూపకముగా జెప్పబడియుండుటచే ద్విజులు కానివారలు, పర మోత్కృష్టమైన యీ గ్రంథము పఠనగ్రంథముగా నేర్పరచు కొని, ఐహికాముష్మిక సుఖములు పొందనగును. హిందూ దేశములోనేగాక దేశాంతరములందును, మతాంతరులచేగూడ పొగడ్తగాంచిన గీతాశాస్త్రమును పఠించిన మానవులు సంసార సముద్రమునుండి తరించి, మానవజన్మలోని కష్ట పరంపరలనుండి వెలువడి, అజ్ఞానమును బోగొట్టుకొని జ్ఞానముబడసి, చిత్తశాంతిని జీవిత జయమును, మోక్షమును పొందగలరు.

భగవద్గీతయందు 18 యోగములు వివరించబడినవి. యోగమనగా, పరమాత్మ సన్నిధానమును జేరుమార్గమును దెల్పునది. పరమాత్మ మానవుల జన్మస్థానము. అట్టి జన్మ స్థానమును జేరుటయే మానవుని గమ్యస్థానము. గీతా శాస్త్ర మందు సూచింపబడిన 18 అధ్యాయములు, పరమాత్మను మానవుడు చేరుటకు బదునెనిమిది మార్గములను సూచించు చున్నవి. జీవకారుణ్యము, భూతదయ, ముక్తికి ప్రథమమెట్లు. జీవులు అజ్ఞానదశలో చేసిన పాపకార్యములను వివర్శించుకొని పశ్చాత్తాప హృదయముతో పరమాత్మను బ్రార్థించి, మన్నించ మని కోరి, తిరిగి అట్టి పాపకార్యములు చేయకున్న పరమాత్మ యొక్క కటాక్షమునకు బాత్రులు కాగలరు.

గీతాశాస్త్రము ఉపనిషత్తులయొక్క సారాంశము. ఉపనిషత్తులు ఆవు వంటివి. కనుక అర్జునుడు ఆవుదూడకు

పోల్చబడెను. గోపాలకుడు ఆవుయొక్క పోషకుడుగా తెలియవలెను. అర్జునుడనే ఆవుదూడ గోవుగా పోల్చబడిన ఉపనిషత్తుల సారమును రుచిచూచిన పిదప, గోపాలకృష్ణుడనే పరమాత్మవల్ల గోరూపకమైన ఉపనిషత్తులసారము - పితుకబడి - లోక సంగ్రహార్థము-మానవుల కర్జునుని ద్వారా సుబోధకమాయెను. ఆవుపాలు దూడ కుడువకపూర్వము మానవుల కనారోగ్యము గనుక, అర్జునుడనే ఆవుదూడ ఉపనిషత్తులనే గోవుయొక్క - పాలు ప్రథమములో-త్రాగినపిదప మానవులు త్రాగుట విధికృతము. బుద్ధి పరిపక్వమైనవారికే గీతాశాస్త్రార్థము బోధపడగలదు. 108 - ఉపనిషత్తుల సారమును గోపాలకృష్ణుడనే పరమాత్మవల్ల పిండబడినపాలుగా తెలియవలెను. అట్టి పాలను - జీవులు - శ్రద్ధాభక్తులతో ననుభవించి యిహపర సౌఖ్యమును బడయుట ఆదర్శముగా దెలియవలెను. గీతామృత సారాంశమును ఆస్తికబుద్ధితో గ్రహించువారు సంసార సాగరమును దాటి జీవన్ముక్తి బడయగలరు.

అర్జునునికి విషాదయోగాధ్యాయము పూర్తిగా బోధించబడినను, అర్జునునకు యుద్ధము చేయ వలసి వచ్చినందున గలిగిన విషాదమెంత మాత్రము నంతరించలేదు. కాని యుద్ధమును జేయుటకు సిద్ధుడై కురుక్షేత్రమునందు ప్రవేశించెను. తదనంతరము - యుద్ధసన్నిధులను జూడగోరెను. యుద్ధ భూమియందుగల సర్వ సైన్యములను అర్జునుడు తిలకించిన తదుపరి యుద్ధము నారంభించు విషయమై ధర్మసందేహము కలిగి, తన రథసారధి యగు శ్రీకృష్ణ పరమాత్మతో విజయు డిటుల తర్కించెను.

యుద్ధ భూమియందు సమకూడిన సైన్యములలో యుద్ధ భటులగు బంధుమిత్రాదులను అర్జునుడు చూచి. తన కుల ధర్మమును విడచి – అన్య కుల ధర్మానుష్ఠానము చేయుట శ్రేయస్కర మని తలంచెను. "రాజ్య సుఖములు కోరెడు సర్వ జనులను యుద్ధమునందు చంపినపుడు, వీనిని కోరెడువారు మరణించినందున, యుద్ధమునకు – బీజమగు ప్రయోజనమే నశించుచున్నది. అట్టి ప్రయోజనము లేకపోగా – పాపము కూడ గలుగు చున్నది. ఈ కారణము వలన ధర్మము నశించి కుల ధర్మములు చెడిపోయి వర్ణసంకరమును, అట్టి కారణమున పాపమును, తన్మూలమున నరకమును గలుగుచున్నది. కామ క్రోధ మనస్కులైన వీరలకీ పాతకము తెలియక పోయినను, తెలిసిన నేనీ పాపమునుండి ఏల తప్పించుకొన కూడదో తెలియకున్నది. బాణ ప్రయోగము జేసి యుద్ధమున నన్ను దుర్యోధనాదులు చంపిన నాకు మిక్కిలి మంచిది".

అర్జును డీ రీతి శోక మోహ పరవశుండై చేతనున్న గాండీవమును విడిచిపెట్టి రథము మీద నిశ్చేష్టుడై కూర్చుండెను. కృష్ణపరమాత్మ అర్జునుని దుఃఖమును నివారించుటకు "శోక మోహములను, హృదయ దౌర్బల్యమునువదలి లెమ్ము"ని సర్వసామాన్య హితోపదేశముతో హెచ్చరించినను, ఎట్టి ప్రయోజనము గలుగలేదు. కాని – అర్జునునకు దుఃఖ మధికమై తుదకు "యుద్ధముచేయను" అని యూరకుండెను. అర్జునుని దుఃఖమును నివారించుటకు గీతా శాస్త్ర మంతయును కారణమైనది. గీతాశాస్త్రము ౧౮ వ అధ్యాయాంతమున గల

యోగ శాస్త్రమును (శ్లో 73) అర్జునుడు గ్రహించి తిరిగి యుద్ధప్రతిజ్ఞ జేయగలిగెను.

చిరకాలము పరివృత్తియందు యుద్ధము చేయుటకు సంకల్పించి, యుద్ధసంస్కారమును పొందిన దేహ, క్షేత్రాభిమానమును వహించి, యుద్ధము చేయుటకు నిరాకరించి నప్పుడు క్షేత్రమునకు నిశ్చేష్టత గలిగినది. బుద్ధియోగము క్షేత్రము నుండి క్షేత్రజ్ఞ పరమైనప్పు డాత్మయోగపూర్వకమయిన బ్రహ్మవిద్యయును, తన్మూలమున శత్రుసంహారమును సంభవము లయినవి. గీతా శాస్త్ర మీ పరమార్థమునే ప్రతిపాదించుచున్నది. బాహ్యశత్రువులవలెనే, అంత శ్శత్రువులను జయించుట ఆత్మయోగమునకు మూలము.

యుద్ధ ప్రవృత్తియం దర్జునునకు గలిగిన విషాదకరమైన సంశయాత్మత్వము వివిధ ప్రవృత్తు లందు మానవు లందరికిని గలుగుచున్నది. సంశయాత్మత్వము మానవ జీవితమును దుర్లభముచేసి ఆత్మ నాశనమును జేయుచున్నది. అర్జునుడు విషాదము వలన గాండీవమును విడిచినను, యోగేశ్వరుడగు శ్రీకృష్ణ పరమాత్మ ప్రసాదమున తిరిగి ధనుర్ధరుడై యుద్ధము జేసి విజయమును బడసిన విధమున, మానవులు విషాద పరవశులైనను ఆత్మ యోగ పరాయణత్వ రూప ధనుర్ధరులై, పరమ పురుషార్థమును బడయగలవిధానమును గీతాశాస్త్రము, ద్వితీయాధ్యాయము నందు బోధించబడినది.

ఆత్మవిజయము గీతాశాస్త్రమునకు పరమార్థమైన బ్రహ్మ విద్యా ప్రాప్తికిమూలబీజము. బ్రహ్మవిద్య, ఇహ పర

సుఖములను ప్రసాదించుచున్నది. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" భావము ఆత్మయోగపరమార్థమునే ప్రతిపాదించుచున్నది. శ్రీకృష్ణుని పరమార్థోపదేశము సంసార ప్రవృత్తియందుగల సకల జనులకును దుఃఖమునువిడిచి స్వాత్మకృత్యమును జేయుటకు సాధనములను దెలుపుచున్నది.

# ద్వితీయ అధ్యాయము

## సాంఖ్య యోగము

భగవద్గీతయందు ద్వితీయాధ్యాయము బ్రహ్మవిద్యా పరమైన యోగశాస్త్రమునకు హృదయము. అర్జునునకు కలిగిన విషాదయోగమును శ్రీకృష్ణపరమాత్మ తత్వమును, కర్తవ్యాకర్తవ్యములను, క్షాత్రధర్మమును, సంసారధర్మమును, మానవధర్మమును, కులధర్మమును, స్వధర్మమును బోధించి పోగొట్టుచున్నాడు. సుఖ దుఃఖపరమైన విషయభ్రాంతి పోయి స్వధర్మ నిర్వహణమును జేయుటకు జిజ్ఞాసువులు కర్మస్వభావమును, ధర్మస్వభావమును, బ్రహ్మస్వభావమును, ఆత్మస్వరూపమును తెలుసుకొనవలయును. నిత్యానిత్య వస్తువివేకమువలన శోకమోహములు తొలిగి, తత్వజ్ఞానముకల్గును. వేదములు, ఉపనిషత్తులు, దర్శనములు, శాస్త్రములు, పురాణములు, "తత్వమసి" అను మహావాక్యతత్వనిరూపణ చేయుచున్నవి. ప్రవృత్తి నివృత్తిమార్గములందు కర్మయోగ, సాంఖ్యయోగముల కవినాభావ సంబంధము గలదు. గీతాశాస్త్రమందలి సాంఖ్యయోగము, కర్మయోగమునకును, జ్ఞానయోగమునకునుగల యవినాభావ సంబంధమును యోగశాస్త్రరూపమున బోధించుచున్నది.

సాంఖ్యము, యోగము, న్యాయము, వైశేషికము, మీమాంస, వేదాంతము,—యీ ఆరును తత్వసందర్శనయోగములు. ఈయోగములు ప్రకృతి, పురుషుడు, భగవంతుడు, జ్ఞానము, జ్ఞాత, జ్ఞేయము, కర్మ, కర్త, కార్యమూలములైన

త్రిపుటిని భిన్నవిధముల నిరూపించుచు, పురుషార్థసిద్ధికి సాధన, సాధక, సాధ్యములందు బహువిధ యోగముల నుపదేశించు చున్నవి. అనంతములైన యుపదేశములను, నిర్దేశములను, సాధనములను, పూర్ణయోగశాస్త్రరూపమున గీతాశాస్త్రము సమన్వయము చేయుచున్నది.

పూర్ణయోగము పూర్ణమైన ఆత్మసంధానయోగమందు సాధ్యమగుచున్నది. సాంఖ్యయోగనామము కపిలకృతమైన సాంఖ్యసూత్రములవలన నేర్పడినది. సాంఖ్యము 25 తత్త్వము లను నిరూపించుచున్నది. ఈ తత్త్వముల కతీతమైన పరమాత్మను పూర్ణయోగము నిరూపించుచున్నది. కాని భగవద్గీతయందు సాంఖ్యయోగము జ్ఞానయోగమునకు పర్యాయపదముగ వాడ బడినది.

శ్లో॥ ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః,
న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవహ॥ 2అ. 9

పైన తెల్పిన శ్లోకముతో నర్జున విషాదయోగ మంత మొందుచున్నది. యీ క్రింద తెల్పిన శ్లోకము గీతాశాస్త్రము నకు, పూర్ణయోగ జ్ఞానమునకు బీజము.

శ్లో॥ అశోచ్యానన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే,
గతానూ నగతానూంశ్చ నానుశోచంతి పండితాః॥ 2అ.11

శ్రీకృష్ణపరమాత్మ విషాదావస్థయందున్న యర్జునునకు వినియోగించిన సంభాషణయే సంసారప్రవృత్తియందున్న జీవ కోటికంతకును వినియోగపడుచున్నది. నిరర్థకములైన స్వాభి మాన మమకారాహంకార సంజాతములైన శోకమోహాదులు, వాని వెంటనంటియుండు ప్రజ్ఞావాదము మానవులను, సంసార

ప్రవృత్తింపజేసి, స్వధర్మ, స్వకర్మవిముఖులను, విమూఢులను చేయుచున్నవి. శోకమోహములు పోవుటకు నిత్యానిత్య వస్తు వివేకసాధ్యమైన బ్రహ్మజ్ఞానము, ఆత్మజ్ఞానము, కర్మజ్ఞానము, ధర్మజ్ఞానము సాధనములు. ఆధ్యాత్మికపరమైన కర్మయోగము, నందు బ్రాహ్మీస్థితిని గురించి తెలుపబడినది. బ్రహ్మనిర్వాణము నకు సాధనముగాగల విధానమును గీతాశాస్త్రముయొక్క రెండవ అధ్యాయమునందు (సాంఖ్యయోగమున) తెలుప బడినది. పురుషార్థ సాధనములైన సకలకర్మలును అనంతమై, ఆత్మయోగపరములైనప్పుడు శాంతిని, అంతవంతములై విష యోపభోగపరమైనపుడు, విషాదశోకములను గలుగచేయగలవు.

అర్జునుడు క్షత్రియకులధర్మమును వదలి యుద్ధము చేయ నొల్లక, సన్న్యాసకృత్యమగు భిక్షాటనము తనకు దగునని భ్రాంతిపడెను. ఆ యవివేకము హరించు నిమిత్తము శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి గీతోపదేశము చేసియున్నాడు. ఈ అధ్యాయమందుగల అయిదవశ్లోకము సాంఖ్యయోగమునకు మూలబీజము.

శ్లో॥ గురూ నహత్వాహి మహానుభావాన్, శ్రేయోభోక్తుం భైక్షమపీహలోకే,
హత్వార్థకామాంస్తు గురూనిహైవ భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్॥ 2అ5.

ఓ కృష్ణా! శూరాగ్రేసరులైన గురువులను జంపి నెత్తురుకూడు తినుటకన్నను వారిని జంపకుండ భిక్షాటనచేసి జీవించుట మేలుగాదా ?.

అర్జునునిజూచి కృష్ణపరమాత్మ పరిహాసముచేయుచున్న వానివలె నిటుల పలికెను.

శ్లో॥ తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత
సేనయో రుభయోర్మధ్యే విషీదంత మిదం వచః॥ 2అ.10

పరమాత్మ బ్రహ్మవిద్యాపరమైన యోగశాస్త్రమును తనను శరణుపొందిన అర్జునున కుపదేశించి సందేహ నివృత్తి చేసి, యోగారూఢుని చేయుచున్నాడు.

కురుక్షేత్రమందు ధర్మసంగ్రామముచేయుటకు దృఢ సంకల్పుడై, ఉభయ సైన్యములనడుమ, స్వజనుల చావునకు శోకమోహపరవశుడై, అర్జునుడు యుద్ధముచేయ నిరాకరించెను. అర్జునుని యుద్ధ నిరాకరణమునకు కారణము స్వజనుల హింస గాని పరమార్థమైన అహింసాధర్మముకాదు. అర్జునుడు యీ సంకుచిత ధర్మమును ప్రజ్ఞావాదముతో సమర్థించెను. అర్జునుడు తన ప్రవర్తనమును ధర్మనామపరమైన తన ప్రజ్ఞావాదముతో సమర్థించి, కర్మసన్యాసము చేయ దలపెట్టెను. అంతవరకు కర్మయోగియైన అర్జునుడు బంధువులనుజూచి కర్మసన్యాసి కాజాలడు. మహానుభావుడైన అర్జునుడే ఇట్టివిషమావస్థ యందు సంశయాత్ముడై విషాదము పొందినపుడు సామాన్యుల విషయము చెప్పనవసరములేదు.

సంసారప్రవృత్తియందు అనవసరమైన శోకమోహములు ప్రజ్ఞావాదమునకు, సుఖదుఃఖములకు బీజములు. అజ్ఞానసంజాతమైన శోకమోహము లాత్మజ్ఞాన మూలమున నశించుచున్నవి. భగవద్గీతలు బ్రహ్మవిద్యాత్మకమైన ఆత్మజ్ఞానమును యోగశాస్త్రరూపమున నుపదేశించుచున్నవి. గీతాశాస్త్రమం దుద్దిష్టమైనయోగము పూర్ణయోగము. అర్జునునివలె సకల జనులును గీతాయోగామృతమును సాధించి కర్మయోగులై "నష్టో మోహః

స్మృతిర్లబ్ధా" అని ప్రతిజ్ఞచేయుట స్వకర్మ స్వధర్మ పరాయణమైన గీతార్థమునకు కీలకము. సంసారప్రవృత్తియందు ప్రాణికోటి యంతయు విషమదశపాలై స్వధర్మమును విడిచి, పరధర్మము నపేక్షించును. స్వధర్మాచరణమునయితము సామాన్యముగ ఫలాపేక్షతోగూడినదై యహం కారమమకార సమన్వితమై యుండును. ఈ స్థితి సంసారప్రవృత్తియందు సుఖదుఃఖ పరంపరలకు గారణం బగుచుండును. సర్వ కర్మఫల సన్యాసము ద్వంద్వవిరహితమై శోకమోహాములను బోగొట్టుచున్నది. సర్వకర్మఫల సన్న్యాసపూర్వకమైన ఆత్మజ్ఞానమువలన శోకమోహాములు నశించుచున్నవి. పరమాత్మ లోకహితార్థము అర్జునుని నిమిత్తమాత్రునిగ జేసి ఆధ్యాత్మవిద్య నుపదేశించెను.

శ్లో॥ "అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః॥ 2అ 11

పైగీతాశ్లోకము ప్రవృత్తియందు యోగసాధ్యమైన ఆత్మజ్ఞానమునకు బీజము

శ్లో॥ "మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినో ఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత॥ 2అ. 14

శరీరమున్నంతకాలము ఇంద్రియములకు విషయముల సంబంధము కలుగుచునే యుండును. ఆసంబంధము లొకప్పుడు చలిని, ఒకప్పుడు వేడిని, అటులనే సుఖదుఃఖములను కలుగ చేయుచుండును. అనిత్యములుగాన అవి వచ్చి పోవుచుండును. కావున వాటిని మానవులు సహింపవలెను.

పంచభూతములయొక్క సూక్ష్మావస్థలు తన్మాత్రలు. ఇంద్రియములకు విషయములతోగల సంబంధమును వాని

విషయములును మాత్రాస్పర్శలు. శబ్ద స్పర్శ రూప రస గంధముల నెడి విషయములును, విషయముల కాశ్రయములైన పంచభూతములును తన్మాత్రలచే గలుగుటవలన మాత్ర లన బడును. ఇంద్రియములు విషయములందు ప్రవర్తించునపుడు విషయభేదమువలన సుఖదుఃఖములు కలుగుచుండును. అనిత్యములైన సుఖదుఃఖములు దేహసంబంధములుగాని ఆత్మసంబంధములు గావు. మానవుడు తటస్థుడై వాని నన్నిటిని ఓర్చుకొనవలెను.

ఇష్టానిష్ట రూపమైన అభిమానము, సుఖదుఃఖములకు మూలము. విషయేంద్రియ సంయోగమువలన గలిగెడి యీ సుఖదుఃఖము లనిత్యములును వచ్చిపోయెడివియు నైయున్నవి. సమాధియందును, గాఢనిద్రావస్థయందును అవి లేకున్నవి. ఆత్మజ్ఞానముతో దేహభ్రాంతినివదలి, సుఖదుఃఖములను సహించుట సాధ్యమగుచున్నది. ద్వంద్వములను సమముగా జూచెడివాడు మృత్యుంజయుడై, స్వస్వరూపమును పొందును. దేహము మాత్రము లేకుండుట, ఉండుట కలదుగాని, ఆత్మ సర్వకాల సర్వావస్థలయందును కలదుగాని, లేకుండుట లేదు. ఆత్మకు కార్యకారణములు లేవు గనుక నిత్యము. కారణము వలన కలిగిన ద్వంద్వములు కల్పితములు కావున అనిత్యములు. ఆత్మానాత్మల యథార్థము (భావాభావములు) మానవులు తెలుసుకొని తత్వదర్శులు కాగలరు.

ఈ చరాచర ప్రపంచము దేనిచేత వ్యాపింపబడి యున్నదో, ఆపదార్థము నాశనములేనిదిగ తెలిసికొనవలయును. ఈ అవ్యయ పదార్థమును ఎవరును నాశనము చేయజాలరు.

ఈ సమస్త ప్రపంచమును వ్యాపింపచేయుచున్న బ్రహ్మమునకు (ఆత్మకు) నాశమును కలిగించుట కెవరికిని శక్యముగాదు.

శ్లో. అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్,
వినాశ మవ్యయస్యాస్య నకశ్చిత్ కర్తుమర్హతి. 2 అ 17

ఈపై శ్లోకము బ్రహ్మతత్త్వమును తెలుపుచున్నది. విశ్వమంతయు ఏ విధముగా నాశనము లేని బ్రహ్మముచే వ్యాప్తమైయున్నదో ఆ విధముగనే ఆత్మ పదార్థముచేత దేహమంతయు వ్యాప్తమైయున్నది. ఆత్మ అవ్యయమయినది. దానిని నాశన మెవరును చేయజాలరు. అర్జునా, దేహి (ఆత్మ) నిత్యుడు. నాశరహితుడు, అప్రమేయుడు. నశించునది దేహము గనుక మోహమును దుఃఖమును విడిచి యుద్ధము చేయుము. అద్దమునందు మన ప్రతిబింబము యే విధముగా ప్రకాశించునో, ఆవిధముగ ఈశ్వరుడు ఉపాధులద్వారా జీవరూపమున గోచరించుచున్నాడు. మనము చూచుకొను అద్దము మన యెదుట లేకపోయినను మనస్వరూపము నశించుటలేదు. కనుక దేహము నశించినను ఆత్మ నశించదు. ఆత్మ చచ్చునదిగాదు. చంపబడునదిగాదు. ఆత్మ చంపబడు దానినిగగాని చంపుదానినిగ గాని ఎవరు తలంచుచున్నారో అట్టివా రజ్ఞానులు. ఆత్మకు జరామరణాదులు లేవు. సర్వకాల సర్వావస్థలయందును ఆత్మ యుండును. జనన మరణములు దేహసంబంధములు గాని ఆత్మకులేవు.

(1) జాయతి (2) అస్తి, (3) వర్ధతి, (4) విపరిణతి, (5) అపక్షీయతి, (6) నశ్యతి- అనెడి షడ్వికారములు దేహమునకు గలవుగాని ఆత్మకులేవు. ఇట్టి ఆత్మను తాను చంపుచున్నా

నని తలంచి దుఃఖపడు మానవుడు జ్ఞాని కానేరడు. ధర్మయుద్ధ మందు దేహము విడుచు వారికి దివ్యశరీరము కలుగును. ఇట్టి దేహవికారమునకు మానవుడు దుఃఖించుట అజ్ఞానము.

అర్జునా! అట్లుగాక ఈయాత్మకు చావుపుట్టుకలు కలవని నీవు తలంచినను దుఃఖింపపనిలేదు. పుట్టినవాడు చచ్చుట, చచ్చినవాడు పుట్టుట అనివార్యము. ఇందునుగురించి శోకింపుట నీకు తగదు. పుట్టుట చచ్చుట దేహమునకు యెంత మాత్రము తప్పదు. అర్జునా! ప్రాణుల స్థితి పుట్టుకకు పూర్వ మెట్టిదో తెలియదు. మరణాంతర మేమగునోకూడా తెలియదు. మధ్యమాత్రము కొంత తెలియుచున్నది. తెరమీదనాడు బొమ్మలవలె మానవులు పుట్టుచు, చచ్చుచు నుందురు. ఈ మార్పు కర్మవలన కల్గు శరీరమునకు తప్పదు. అందువిషయమై నీవంటిజ్ఞాని శోకించతగదు. ఆత్మతత్వమును అజ్ఞానము నశించు వరకు తెలిసికొనుట దుర్లభము. సమస్త ప్రాణులందున్న ఆత్మవస్తువ యెప్పుడును దేనివల్లను చంపబడదు. కాబట్టి ప్రాణుల విషయమై నీవుశోకించజనదు. క్షత్రియునకు ధర్మయుతమయిన యుద్ధముకన్నను శ్రేయస్కరమయిన అన్యవిషయములేదు. కులధర్మము నుల్లంఘించుట కేవలము పాపకార్యము. కనుక యుద్ధము చేయుటకు నీవు సందేహించ తగదు. ఇది దైవవిధి గనుక తప్పక నెరవేర్చవలెను. పుణ్యాత్ము లయిన క్షత్రియులకే యిట్టి యుద్ధము ప్రాప్తమగును. ఇది అప్ర యత్నముగ స్వర్గమును పొందించు సాధనము. కనుక నీవు నీ ధర్మము ననుసరించి చేయవలసిన యుద్ధమును మానితివేని విహితధర్మమును విడిచి నీకీర్తిని చెడగొట్టుకొని ఐహికాముష్మి

కములు కోల్పోవుదువు. సుఖములు బడయనేరవు. లోకములో అపకీర్తికంటె చావుమేలు. అర్జునా! యుద్ధమునందుచనిపోయెద వేని స్వర్గసుఖమును పొందగలవు. గెలుపొందెదవేని రాజ్య భోగములను పొందగలవు. యుద్ధమునుచేయుటకు సిద్ధుడవు కమ్ము. జయాపజయములు లాభనష్టములు దైవప్రేరితములు. మానవుడు నిమిత్తమాత్రుడు. ఈ అధ్యాయమున ఆత్మ తత్వాత్మకమైన సాంఖ్యయోగము తెలుపబడినది. లౌకిక, న్యాయసూత్రములు నిష్కామకర్మయోగసాధనములు. గీతా శాస్త్ర హృదయమైన ఆత్మయోగము, చరమ అధ్యాయమందలి 66 వ శ్లోకమునగల పరమార్థము దీనియందుగలదు.

శ్లో॥ "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః 18 అ. 66.

ఆత్మతత్వ విజ్ఞానము సాంఖ్యయోగము. సాంఖ్యబుద్ధి యనగా నాత్మతత్వజ్ఞానము. ఇదియే పరమార్థము. ఆత్మజ్ఞా నము సంసార హేతువులగు దుఃఖమును, అజ్ఞానమును నివర్తింప చేయును. యోగమనగా జ్ఞానమును గలుగజేసెడి కర్మ యోగము. ఇదిఫలరహితమైన ఈశ్వరారాధనమునకైన కర్మా చరణము. ఇందువలన సిద్ధించెడి జ్ఞానమువలన పుణ్యాపాప బంధముపోవును. కర్మయోగము సాంఖ్యయోగసాధనము. సాంఖ్యయోగము కర్మయోగమునకు ప్రధానస్థాన మొసంగు చున్నది. ద్వితీయాధ్యాయమునందలి యీ క్రింద తెల్పిన శ్లోకములు కర్మయోగమునకర్థమును తెల్పుచున్నవి. సమ త్వము, కర్మకౌశలము, సమాధియందు నిశ్చలబుద్ధి, బుద్ధి యోగము, సాంఖ్యము, యోగము—యోగశబ్దమునకు వేర్వేరు

నిర్వచనములు. గీతాశాస్త్రము ఆత్మయోగ పరమైన పూర్ణ యోగమును ప్రతిపాదించుచున్నది. అష్టాదశ యోగములును పూర్ణయోగమున కుపాంగములు. పూర్ణయోగము పూర్ణమైన ఆత్మయోగమునందు సిద్ధించుచున్నది.

శ్లో॥ "యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥ 2 అ (40)

శ్లో॥ బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్॥ 2అ(50)

శ్లో॥ శ్రుతి విప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా,
సమాధా వచలాబుద్ధి స్తదా యోగమవాప్స్యసి॥ (2అ53)

కర్మయోగమును ప్రారంభించుటకు కాలపరిమితి లేదు. ప్రారంభించి విడిచినను దోషము లేదు. ఈ ధర్మాచరణము స్వల్పమైనను సంసారభయమునుండి కాపాడును. మోక్షసాధన మగు కర్మయోగము – ఈశ్వరారాధన పరమగు కర్మయోగము – అధ్యాత్మికమైన కర్మయోగము స్వల్పమైనను ఫలత్యాగమువలన అభయము నొసంగుచున్నది.

శ్లో॥ శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే,
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగాచ్ఛాన్తి రనంతరమ్॥-12 అ. (12)

కర్మయోగపరాయణులు గానివారి తలంపులు నిలకడగా నుండనేరవు. బహువిధములుగా చలించును.

ఓ అర్జునా! వేదములలోని ఫలమును తెలిపెడి అర్థ వాదములందు ప్రీతిగలవారును, కామములందు మనసుగల నవివేకులు, భోగైశ్వర్యములను బొందుటకై యనేక కర్మ భేదములను జెప్పునవియు, జన్మకర్మఫలముల నిచ్చునవియు,

ఫలింపని పుష్పములనంటివియు నగు మాటలచే నపహరింపబడిన హృదయముగలవారగుదురు. భోగైశ్వర్యములం దాశగలవారికి నిశ్చయాత్మకమగు బుద్ధి లభించదు. వారిబుద్ధి సమాధియందు ప్రవేశింపదు. (సమాధి జీవాత్మ పరమాత్మలకు సమానావస్థ. పురుషోపభోగమునకు సమాధియందు సర్వమును నిలుపబడును.) ఆత్మజ్ఞానమును గలిగించెడి స్థితి ఏకాగ్రచిత్తమువలన కలుగును. కామ్యకర్మ పరాయణుడై విషయాసక్తుడైనవాడు. ఆత్మవ్యవసాయ పరాణమైన సమాధియందు నిలువజాలడు, నీరు కావలసినవారికి నిండిన చెరువుండగా, నూతివలన ప్రయోజనము లేదు. బ్రహ్మజ్ఞానికి వేదములవలన నంతియే ప్రయోజన ముండును. సర్వమును బ్రహ్మముగా తెలుసుకొన్న బ్రహ్మజ్ఞానికి సర్వవేదములందును ప్రయోజనము మిక్కిలి స్వల్పము.

కర్మలయందు అధికారముండవలయును. కాని వాని ఫలమం దెప్పుడును అధికారముండరాదు. కర్మఫలముల నెప్పుడు కోరవలదు. కర్మలను ఫలాపేక్ష లేకుండ చేయుటయందు ఆసక్తి కలిగియుండవలెను. ఫలములను ఈశ్వరార్పితము చేయవలెను. కాని ముముక్షువు వానిని కోరగూడదు. కర్మకు కర్తృత్వమును, ఫలమునకు కోరికయును వుండకూడదు. కర్మలను ఉల్లంఘించిన ప్రత్యవాయముకలదు. ఫలము కోరకున్న ప్రత్యవాయము లేదు. కనుక ఫలము గోరక కర్మలను నిరంతరము భగవదార్పితముగా చేయుము. యోగమునందుండి సంగమును విడిచి సిద్ధికలిగినను కలుగకున్నను సముడవై కర్మలను చేయవలెను. సమత్వబుద్ధి యోగమనబడును.

ఓ ధనుంజయా! ఆత్మయోగ కర్మకన్నను భిన్నమైన

కర్మ నీచమయినది. నిష్కామ కర్మయందే శరణుపొందుము. ఫలహేతువయిన కర్మచేయు వారు కృపణులు. బుద్ధియోగముతో కూడినవారు, లోకములో పుణ్యాపాపములను రెంటిని విడుచుచున్నారు. అందువలన అట్టి యోగమునకై సిద్ధపడవలయును. కర్మలయందు కుశలత్వము, యోగము, బుద్ధి, ఆత్మ యోగ పరమైనపుడు పాపపుణ్యములు పోయి, ఆత్మ సాక్షాత్కారము కలుగుచున్నది. ఆత్మయోగమునందు, నిష్కామ కర్మయోగము, కర్మలకు కుశలత్వమును కలుగజేయుచున్నవి. కర్మ కౌశలము ఆత్మయోగమూలము. ఆత్మయందే బుద్ధిగల యోగులను కర్మఫలము విడిచిపోవును. ఆత్మయోగులు జరామరణావస్థలేక శాశ్వతానందమును పొందుదురు.

మానవునిబుద్ధి మోహామువలన కలిగిన అవివేకమును విడిచి యెప్పుడు పరిశుద్ధమగునో అప్పుడు వినవలసినదానిని గురించియు, వినినదానిని గురించియు నిర్వేదము పొందును. కలతపెట్టబడిన బుద్ధి ఎప్పుడు స్థిరముగా నిలుచునో అప్పుడు జ్ఞానము సిద్ధించును.

మనుజుడు యెప్పుడు తన మనసునందు కలిగెడు కోరికలన్నిటిని విడిచి ఆత్మానందము పొందునో అప్పుడు స్థితప్రజ్ఞుడగును. స్థితప్రజ్ఞుడు ద్వంద్వములయందు సమత్వ బుద్ధి గలిగి మునివలె నుదాసీనుడై యుండవలెను. మునులు అనగా ఆత్మమనన శీలురు. ప్రపంచ విషయములందు తటస్థులుగా నుండువారు. ఎవనిబుద్ధి మంచివచ్చినప్పుడు సంతోషమును, చెడుగు వచ్చినప్పుడు శోకమును చూపదో వానిబుద్ధి స్థిరబుద్ధి యని తెలియవలెను. ఎవడు యింద్రియ విషయములనుండి ఇంద్రి

యములను మరల్చుకొనగలడో అట్టివానిబుద్ధి ప్రతిష్ఠితమగును. శబ్దాదివిషయములను మానినంతమాత్రమున, విషయగ్రహణము నివర్తించును. వాని విషయములందు కోరిక నశించదు. పర మాత్మ సందర్శనమువలన రాగమునయితము నివర్తింపగలదు. అట్టిరాగమును విడిచినవారే స్థితప్రజ్ఞులు. స్వస్వరూపజ్ఞానము గలిగిన, విషయవాసనలు వెంటనే నశింపగలవు. అనగా ఆత్మ సాక్షాత్కారమువలన ఇంద్రియవాసనలను జయించి పరమా త్మను కొలుచువాడు ప్రజ్ఞను, ప్రతిష్ఠను బడయుదురు. అట్టి వారికి ఆత్మయోగము సిద్ధించును. తన వశమందున్న ఇంద్రి యములు విషయములందు ప్రవర్తించుచున్నను నిష్కామకర్మ యోగి యగువాడు రాగద్వేషదూరుడై ఈశ్వరానుగ్రహమును పొందగలడు. ఆత్మప్రసాదముకలిగిన జ్ఞానికి దుఃఖములు నశించి, బుద్ధి శీఘ్రముగ సర్వగతమగును. స్థితిప్రజ్ఞుడుగాని నిష్కామ కర్మయోగి కాని వానికి నిశ్చయాత్మకజ్ఞానము యెంతమాత్రము కలుగదు. ఆత్మభావనయును గలుగదు. ఆత్మభావన లేనివారికి చిత్తశాంతి లేదు.

చిత్తశాంతి లేనివానికేసుఖము గలుగదు. గాలి నీటి లోని ఓడను పెడత్రోవన బట్టించులాగున, మనసు విషయాసక్త మైన యెడల, మానవుని వివేకమును హరించును. ఎవని బుద్ధి విషయములనుండి మరలి స్థిరముగ నుండగలదో వానిబుద్ధి యోగస్థమై యుండును. సముద్రము నిండియున్నను, తనయందు చేరునదుల నీటిని ఏవిధముగా గ్రహించునో, జ్ఞానియందు విషయ వాసనలు చేరినను, శాంతిని పొందుచున్నాడు. విషయవాసనలు కామించువాడు మాత్రము యెంతమాత్రము శాంతిని పొంద

చాలదు. స్థితప్రజ్ఞుడు కామకర్మల నాచరించినను వాని మనస్సునందలి శాంతికి యెప్పుడు భంగముకలుగదు. అనగా కర్మయోగులు, కర్మ సన్న్యాసయోగులు, కర్మను ఆచరించు విధముగ ఆచరించినచో శాంతికి భంగముకలుగదు. భగవద్గీత యందలి చరమశ్లోకమందు సకలధర్మములను వదలి పరమాత్మను శరణుపొందినవారికి ముక్తి తప్పకగలుగునని చెప్పబడియున్నది. సర్వధర్మ పరిత్యాగమునకు దేశకాల నియమములులేవు. అటులే బ్రాహ్మీస్థితికిని దేశకాల ప్రమాణములను విధించుట అసంగతము. ఒక క్షణకాలమైన, మరణావస్థయందైనను సమోహామును పరిత్యజించి బ్రాహ్మీస్థితిని పొందినవారికి, బ్రహ్మ నిర్వాణము గలుగుట యోగశాస్త్రమునకు తగియున్నది. ఇది అద్వైత మతసిద్ధాంతము.

సారాంశము

ఈ అధ్యాయమునందు భగవద్గీతా శాస్త్రమునకు పరమార్థమైన బ్రహ్మవిద్యాప్రాప్తికి, ఆత్మయోగ తత్వసాధన విధానము సంక్షిప్తముగ నుపదేశింపబడినది. అహం, త్వం, పదార్థములు నాశరహితములు. దేహము లంతవంతములు. నిత్యానిత్య వస్తువివేకముగల స్థితప్రజ్ఞులు నిత్యమైన ఆత్మవిషయమునను, అనిత్యమైన దేహవిషయమునను శోకమోహములను పొందరు. స్వధర్మారాధనమువలన నర్థకామములు లభించుచున్నవి. మోహమునుబూని స్వధర్మపరిత్యాగమును చేయుట వలన నపకీర్తియును, నపకీర్తివలన దుఃఖమును గలుగుచున్నవి. శోకమోహములవలన స్వధర్మపరిత్యాగమును చేయుట యవివేకము. ఈ యవివేకము పోవుటకు జ్ఞానసిష్ఠను, కర్మనిష్ఠను,

యోగనిష్ఠను సంక్షేపముగ సాంఖ్యబుద్ధి, కర్మబుద్ధి, యోగబుద్ధి రూపమున యీ అధ్యాయము తెలుపుచున్నది.

కర్మనిష్ఠయందును, జ్ఞాననిష్ఠయందును సమబుద్ధిగల యోగి బ్రాహ్మీస్థితిని పొందగలవిధము వివరింపబడినది. బుద్ధియోగముకన్న ఇతరకర్మములు మిగులహేయములు. సాంఖ్యయోగాధ్యాయమునందలి ౪౯ శ్లోకమునం దీ పరమార్థము విస్పష్టము చేయబడినది.

శ్లో॥ దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః॥ 2 అ 49

ఈ పరమార్థమునకు సాధనము స్థితప్రజ్ఞుని లక్షణములం దింద్రియ నిగ్రహపరమైన ఆత్మయోగరూపమున వివరింపబడినది. ప్రవృత్తియందు విషయము లింద్రియముల నాకర్షించుచున్నవి. విషయాసక్తములైన ఇంద్రియములు సమ్మోహమునుపొంది బుద్ధియోగమును, తత్పరమైన ఆత్మయోగమును పొందజాలకున్నవి. బుద్ధియోగపరములైన ఇంద్రియములు విషయములందు చరించుచున్నను ఆత్మయోగారూఢములై శాంతిని పొందుచున్నవి. ఆత్మయోగారూఢమైనశాంతి బ్రాహ్మీస్థితిని గలుగజేయుచున్నది. యోగసంసిద్ధికి కర్మయోగము రాజమార్గము. సకలకర్మలును జ్ఞానమునందు పరిసమాప్తిని పొందుచున్నటుల సకలవిజ్ఞానమును కర్మయోగమునందు పరిసమాప్తిని పొందుచున్నది. సాధకునియందు యోగము స్థిరపడుటకు మూడవ అధ్యాయము కర్మయోగముతో ప్రారంభమగుచున్నది.

# తృతీయాధ్యాయము

## కర్మ యోగము

పురుషార్థమునకు జ్ఞాన కర్మలలో నేది యుత్తమమని సంశయ నివారణార్థ మర్జునుడు కృష్ణపరమాత్మని ప్రశ్నించు చున్నాడు. కర్మయోగము, జ్ఞానయోగప్రశంసను, కర్మ జ్ఞాన యోగములకు గల అవినాభావ సంబంధమును తెల్పు చున్నది! కర్మయోగహృదయమును గ్రహించుటకు మూడు, నాల్గు అధ్యాయములలోని కర్మ యజ్ఞ పదముల యర్థ గ్రహణ మత్యవసరము. జగచ్చక్రమునందు కర్మము బ్రహ్మోద్భవముగ నిరూపింపబడినది. అక్షర పరబ్రహ్మ యోగమునందు "భూత భావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః" (౮-౩) అనిచెప్పబడినది. నిర్వికల్పము బ్రహ్మమునకు, సవికల్పము కర్మమునకు మూలము. సకలభూతములయొక్క భావమును,ఉద్భవమునైన విసర్గము కర్మ పరిణామమును బొందుచున్నది. కర్మ బ్రహ్మోద్భవము. ఆత్మ బుద్ధియోగమువలన కర్మచక్రమునందు ప్రవేశింప జేయబడు చున్నది. బ్రహ్మమయమైన జగత్తు కర్మమయము. కర్మమయ మైన జగత్తునందు బ్రాహ్మీస్థితిని బడయుటకు, కర్మస్వభావ మును సమగ్రముగ తెలిసికొనవలయును. కర్మసంబంధమైన సందేహమును నివృత్తిచేసికొనుటకు, కర్మయోగ బుద్ధి యోగములయందేయోగము శ్రేయస్కరమో నిశ్చయించి చెప్పవలయునని అర్జునుడు పార్థసారథిని ప్రశ్నించుచున్నాడు. సాంఖ్యయోగాధ్యాయమునందు కృష్ణపరమాత్మ బుద్ధియోగ

మును సూచించినపుడు, నిష్కామకర్మయోగమునే సూచించి నను, అర్జునుడు భేదములేని విషయమునందు భేదబుద్ధిని బూని మరల ప్రశ్నను వేయుచున్నాడు. శ్రీకృష్ణుడు గహనతుల్యమైన కర్మగతిని బోధించి, పార్థుని కర్మప్రవర్తకునిగ జేయుచున్నాడు. గీతాశాస్త్రమందలి అన్ని అధ్యాయములందును, జగచ్చక్రమునకు సహజమైన కర్మప్రసంగము గలదు. కర్మ, అకర్మ, వికర్మ, యజ్ఞకర్మ, నిత్య కర్మాది విభాగములు కర్మ స్వరూపస్వభావములను దెలుపుచున్నవి. దేహము, కర్మక్షేత్రము, ధర్మక్షేత్రము, బ్రహ్మక్షేత్రము. అది కర్మ విసర్గముతో నారంభమగుచున్నది. దేశకాలములు కర్మసంభవములు. ప్రకృతిగుణ సంజాతములైన కర్మ ప్రవాహములను ధర్మసాధనమువలన బ్రహ్మత్వమునందు, ఆత్మయందు లయముచేయుట కర్మ యోగము. బ్రహ్మజ్ఞానమువలె బ్రహ్మోద్భవమైన కర్మజ్ఞానము గహనతుల్యము. సర్వగతమయిన బ్రహ్మము సర్వగతమైన కర్మయందు ప్రతిష్ఠితము. కర్మ జీవజాలమునకు సకలార్థ సాధనము. విశ్వ ప్రవృత్తియంతయును కర్మబద్ధము. సనాతన వైదిక ధర్మమీ పరమార్థమునకు దివ్యవ్యాఖ్యానము. విశాలమును నిరపేక్షితమును అయిన కర్మయోగము కాలాంతరమున సాపేక్షమై సంకుచితమైనది. షోడశకర్మలు కర్మపదమునం దధిష్ఠించినవి. సన్యాసము నిష్కామకర్మయోగమునకు లక్ష్యమైయున్నది. సన్యాసమునకు అంతర్లక్ష్యము క్షీణించి బాహ్యలక్ష్యము ప్రమాణమైనది. ఆత్మయోగసాధ్యమైన కర్మయోగస్థానమును, కాషాయాంబరములు, బాహ్యచిహ్నములు ఆక్రమించి, విశ్వవ్యాప్తమైన కర్మసంకుచిత మేర్పడినది.

గీతాశాస్త్రము నష్టమైన కర్మయోగశాస్త్రమును శ్రీకృష్ణార్జున సంవాదరూపమున పునరుద్ధరణము చేయబడినది. రెండవ అధ్యాయమునందు సాంఖ్యయోగవిషయమున జేసిన యుపదేశమునే మూడవ అధ్యాయము వివరించుచున్నది.

"తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలం"

కర్మ కౌశలమే యోగమనియును, యోగము నారాధించుట బ్రహ్మవిద్యకు సాధనమనియును గీతాశాస్త్రము ప్రతిపాదించుచున్నది. ప్రపంచ పరిణామమునందు అక్షరమునుండి బ్రహ్మమును. బ్రహ్మమునుండి కర్మయును ఉద్భవించిన విధమును సకల ప్రవృత్తియును విస్పష్టము చేయుచున్నది. కర్మయోగాభావమైన జ్ఞానయోగమును, జ్ఞానయోగాభావమైన కర్మయోగమును, అసంభవములు. పండిత పామరజనులకు సులభగ్రాహ్యమైన కర్మయోగము, కర్మ సన్యాసముకన్న విశేషమైనను, కర్మ సన్యాసము ప్రతిష్ఠను బడసినది. కర్మయోగమున మానవస్వాతంత్ర్య ధర్మపరిణామమునందు గల ప్రతిష్ఠ నుద్ధరించగల విధమును, కర్మయోగశాస్త్రము ముఖ్యముగ సువ్యక్తము చేయుచున్నది. మానవులు కర్మయోగ రహస్యమును గ్రహించుట బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనముగా గలదు. ప్రవృత్తియందు కర్మాచరణము పండితులకు కూడ సమ్మోహమును గలుగజేయుచున్నది. ఒక కర్మయే దేశకాల పాత్రావరణములందు బాహ్యలక్ష్యానుసారముగ విషాదానందములను గలుగచేయుచున్నది. పురుషార్థసిద్ధికి సకలకర్మలును సమానప్రయోజనములు. స్వభావసిద్ధమైన కర్మాచరణము నిశ్శ్రేయసకరము. యుద్ధకర్మవలె కర్షక కర్మయును శ్రేయో

దాయకము. యజ్ఞదానతపములు, నిత్య నైమిత్తికకర్మలు, వృత్తికర్మలు, శారీరక కర్మలు ప్రకృతి సిద్ధములు. ప్రకృతిసిద్ధమైన కర్మాచరణమునందు సమ్మోహము నిరర్థకము. కర్మాచరణమునందు విజయునకు గలిగిన సమ్మోహము, సకల జనులకును గలుగుచున్నది. అట్టి సమ్మోహమును పోగొట్టి సకల జనులను కర్మయోగపరాయణులను జేయుట గీతాశాస్త్రము యొక్క పరమార్థము. అర్జునుడు యోగశాస్త్రమును వినిన తరువాత కర్మయోగియైన విధమున, సకలజనులును కర్మయోగులగుట కర్మయోగాధ్యాయమునకు పరమార్థము.

శ్లో॥ నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ॥ 18 అ 73.

మానవునికి బలమైనశత్రువులు రెండు. అవి ఆశ, కోపము.

శ్లో॥ కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః
మహాశనో మహా పాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్॥ 3 అ 37.

శ్లో॥ ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ,
యథోల్బేనా వృతో గర్భ స్తథా తేనేద మావృతమ్॥ 3 అ 38.

శ్లో॥ ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ దుష్పూరేణా నలేన చ॥ 3 అ 39.

శ్లో॥ ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే,
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినమ్॥ 3 అ. 40.

ఆశ, కోపములు యీరెండును రజోగుణమువలనగలుగునవి. గొప్ప ఆహారమును గోరునవి.

ఎక్కువ పాపకార్యములను చేయునట్లుబలవంతపెట్టునవి. జీవునకు సంసారములో కామక్రోధములు గొప్పశత్రువులు.

నిప్పులో కట్టెలు నెయ్యి వేసినకొలది అగ్ని ప్రజ్వరిల్లునే కాని తగ్గదు. అట్లే ఆశకు కావలసిన పదార్థములు ఇచ్చుటవలన దానిని నిర్మూలింపజాలము. అది మరింత వృద్ధియగును. కామక్రోధములు సంసారములో చిక్కుబడినవారికి శత్రువులు. కామినీ కాంచనముల యందలి ఆసక్తియే ఆత్మసుఖములకు కారణభూతములైన పనులం జేయనివ్వదు. అయ్యది వర్ణాశ్రమధర్మముల ననుష్టించుటకు ప్రతిబంధక మగుచున్నది. కామమును రూపుమాపుటకు దానిని అనుభవించి తృప్తిపరచలేము. హోమగుండములో నెయ్యిపోసిన మంట మరింత యెక్కువగును. మంట ఆర్పవలయుననిన దానిపై నీరుపోయవలయును. అట్లే కామమును బీజము మొలకెత్తకముందే దానిని అణచివేయవలెను. ప్రాపంచిక విషయములను భోగమువలన జయించజాలము.

ఆశ పరమశత్రువు. ఆశ విఫలమైనచో ఆటంకపరచిన వారలపై క్రోధము జనించును. క్రోధము విచక్షణ జ్ఞానమును నశింపజేయును. కనుక పాపమునకు హేతుభూతమైన కోపము కూడ మానవునియందుండ జనదు. కామక్రోధములు జ్ఞానులకు, అజ్ఞానులకు పరమశత్రువులు. జ్ఞాని వాటిపరిణామమును గుర్తెరిగి సంచరించును. అజ్ఞాని మాయచే కప్పబడి, అంధకారమున మునిగి కామక్రోధములు శత్రువులని తెలిసికొనజాలడు.

కామక్రోధములు ఇంద్రియములద్వారా దేహములో ప్రవేశించి మనోబుద్ధులను పాడుచేసి జీవుని జ్ఞానమును నశింపచేయుచున్నవి.

కనుక, ఓ అర్జునా! ఆరంభములోనే నీవు ఇంద్రియము

లను జయించవలెను. అందువలన కామమును జయించగలవు. పరమాత్మదయలేనిది వాటినిజయించుట కష్టసాధ్యము. జీవుడు భగవదనుగ్రహములేనిది కామక్రోధములను జయించజాలడు. కావున భగవంతుని యెల్లరు నిశ్చలభక్తితో ఆరాధింపవలెను.

అజ్ఞానులు ఫలాపేక్షతో కర్మలు చేయునటుల జ్ఞానులు ఫలాపేక్షలేక లోక సంగ్రహార్థము కర్మలను చేయుదురు.

పంచభూతమయమైన విశ్వమునందు శబ్ద స్పర్శ రూప రస గంధములు, కర్మేంద్రియములయిన వాక్పాణి పాద పాయూపస్థలద్వారా. జ్ఞానేంద్రియములైన శ్రోత్ర త్వక్చక్షు ర్జిహ్వా ఘ్రాణేంద్రియములద్వారా, ఆత్మవికాసమునకు వినియోగపడుచున్నవి. ఇంద్రియ వ్యాపారమును విసర్జించుట జీవులకు సంభవముకాదు. జీవయాత్రయందు నియమిత కర్మానుష్ఠానమును చేయుచు కర్మేంద్రియములను జ్ఞానేంద్రియముల చేతను, జ్ఞానేంద్రియములను మనస్సుచేతను, మనస్సును బుద్ధి చేతను, బుద్ధిని ఆత్మచేతను నియమించిచేసిన నిష్కామ కర్మానుష్ఠానము యథార్థమైన కర్మయోగము.

## సారాంశము

కర్మయోగాభ్యాసమే జ్ఞానయోగసాధనము. ఎవరెట్టి కర్మలను చేయుదురో వారి కట్టి ఫలము గలుగుచున్నది. బ్రహ్మ యజ్ఞములను ప్రజలను సృజించి, సర్వమునకును, పురుషార్థ సాధనమును నిరూపించెను. యజ్ఞమన లోకహిత దృష్టితో పరమార్థపరముగ జేయు పని. ఎవరే రీతి పురుషార్థములను సేవించెదరో వారలకావిధమైన పురుషార్థఫలము కల్గు

చున్నది. ఇంద్రియ విషయారాధనము కామమును, దైవారాధనము పరమ శ్రేయస్సును గలుగజేయుచున్నవి. కర్మలను విడుచుట జీవికనాశ్యము. శరీర యాత్రకు కర్మనియతి యేర్పడినది. నియతికర్మానుష్ఠానము యజ్ఞార్థము చేయుటయే కర్మ యోగమును. కర్మమూలముననే జనకాదులు సిద్ధిని పొందిరి. స్వధర్మ నిర్వహణార్థము, లోక సంగ్రహణార్థము, ఆత్మార్థము నియతి కర్మారాధనమును చేయుట కర్మయోగము. కర్మప్రవర్తకులై ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని నిగ్రహించి ఆత్మయోగపరాయణులగుట కర్మయోగము. కర్మలను విడచుట యోగము కాదు. బుద్ధియోగమునకు పరమైన ఆత్మ యోగమును, ఆత్మవిజయమునకు మూలమైన విధమున జ్ఞాన యోగము విశదము చేయుచున్నది. జ్ఞానయోగ రహస్యమును తెలుసుకొనుటకు సామాన్యమైన యోగసాధనముల నభ్యసించుటయును ప్రయోజనకరము. ప్రకృతి సిద్ధములైన కర్మల నధ్యాత్మబుద్ధితో చేయుట యోగసాధనము. ఆత్మానాత్మ వివేకము జ్ఞాన కర్మయోగములకు పరమార్థము. అనిత్యములైన దేహేంద్రియ మనోబుద్ధివ్యాపారములు నిత్యమైన ఆత్మ యోగమునందు పరిసమాప్తిపొందినపుడు, జ్ఞానయోగము సాధ్యమగుచున్నది. ఆత్మనిరతుడు, ఆత్మసంతృప్తుడు, ఆత్మ స్థితుడు బాహ్యవిషయములందు ప్రవర్తించినను, అనాసక్తుడై పరమును పొందుచున్నాడు.

అజ్ఞానులు ఫలాపేక్షతో కర్మలను జేయునటుల జ్ఞానులు ఫలాపేక్ష లేక లోకసంగ్రహార్థము కర్మలను జేయుదురు.

పంచభూతమయమైన విశ్వమునందు శబ్ద, స్పర్శ,

రూప, రస, గంధములు, కర్మేంద్రియములైన వాక్పాణిపాద పాయూపస్థల ద్వారమునను, జ్ఞానేంద్రియములైన శ్రోత్ర త్వక్చక్షు ర్జిహ్వా ఘ్రాణేంద్రియములద్వారమునను ఆత్మ వికాసమునకు వినియోగపడుచున్నవి. ఇంద్రియవ్యాపారమును విసర్జించుట జీవులకు సంభవముకాదు. జీవయాత్రయందు నియత కర్మానుష్ఠానముచేయుచు, కర్మేంద్రియములను జ్ఞానేంద్రియములచేతను, జ్ఞానేంద్రియములను మనస్సుచేతను, మనస్సును బుద్ధిచేతను, బుద్ధిని ఆత్మచేతను నియమించి చేసిన నిష్కామ కర్మాచరణము, యథార్థమైన కర్మయోగము.

# చతుర్థోధ్యాయము

## జ్ఞాన యోగము

ఈయధ్యాయమునకు జ్ఞానయోగము నామకరణమైనను మూడవ అధ్యాయమందలి కర్మయోగప్రశంస ఈ యధ్యాయమునందును విశేషముగ గలదు. జ్ఞానయోగమునకును, కర్మయోగమునకునుగల యవ్యవహిత సంబంధమున కీ యధ్యాయము నిదర్శనము. ఈ యధ్యాయము కొన్ని ప్రతులందు జ్ఞానకర్మ-సన్న్యాస యోగమని పిలువబడుచున్నది. పిపీలికాది బ్రహ్మపర్యంతము వ్యాప్తమైన జీవజాలమునకు ధర్మసాధన నిమిత్తము, శరీరమాద్య సాధనము. అకర్ములకు శరీరయాత్రయును ప్రసిద్ధముగా జరుగదు. ప్రసిద్ధమైన దేహయాత్ర, ప్రసిద్ధమైన కర్మేంద్రియజ్ఞానేంద్రియయాత్రకును, ప్రసిద్ధమైన ఇంద్రియ ధర్మయాత్ర మానవధర్మ పరిపక్వమునకును, మానవధర్మ పరిపక్వము బుద్ధియోగమునకును, బుద్ధియోగము పరమాత్మయోగమునకును సాధనములు. సకల ప్రవృత్తియును సాపేక్షమైన గుణకర్మపరమైనను, సకలకర్మలకును నిరాపేక్షమైన జ్ఞానము ప్రయోజనము.

జ్ఞానము యోగసంసిద్ధమై నిరపేక్షమైన ఆత్మయోగ పరిణామమును పొందుచున్నది. ఆత్మేతరములైన దేహేంద్రియాదికర్మల నాత్మయోగపరములను జేయగలయోగసాధనములు జ్ఞానయోగమునందు వివరింపబడినవి.

నిరపేక్షమైన ఆత్మయోగసిద్ధికి, సాపేక్షములైనకర్మలు, యోగములు, యజ్ఞములు, సాధనములుగాగల విధమును జ్ఞాన యోగము వివరించుచున్నది.

చతుర్విధ పురుషార్థములకును యోగసంసిద్ధిసాధనము. బహువిధకర్తలు యజ్ఞార్థములైనపుడు యోగపరిణామమును పొందుచున్నవి. బహువిధయజ్ఞములు ఫలాపేక్షపరములై విషయాసక్తములైనపుడు సుఖసాధనములగుచున్నవి. మానవ ధర్మ పరిణామమునందు, ధర్మార్థకామములు బాహ్యవిషయా రాధనములుకాక, ఆత్మయోగపరములైనపుడు గీతాశాస్త్ర ప్రతిపాదితమైన యోగసంసిద్ధి సాధ్యమగుచున్నది. సంశయాత్ములకిహపరములు దుర్లభము. ఇంద్రియ నిగ్రహముగల శ్రద్ధావంతులు బ్రహ్మవిద్యాధికారు లగుచున్నారు. బ్రహ్మ విద్యాధికారులు - కర్మయోగులు, జ్ఞానయోగులు, ఆత్మ యోగులు.

సాపేక్షమైనకర్మలు నిరపేక్షమైన జ్ఞానయోగపరిణామ మున యజ్ఞరూపమును పొందుచున్నవి. బ్రహ్మోద్భవములైన యజ్ఞములన్నియును కర్మజములు. కర్మజములైన ద్రవ్యయజ్ఞ ములకన్నను జ్ఞానయోగము శ్రేయోదాయకము. సకలకర్మ ములను యజ్ఞపరిణామమునుబొంది బ్రహ్మవిద్యా సాధనము లగుచున్నవి. సకలకర్మలు ఆత్మయందును, భగవంతునియం దును ప్రణిపాతరూపమునను, జిజ్ఞాసరూపమునను, సేవారూప మునను సమర్పణముచేయు సుకృతమే యోగము.

బ్రహ్మవిచారమందు నిశ్చలమనసుగలవాడు సకలకర్మల నాచరించినవాడగును. భగవత్ప్రీతిగా జేయబడిన కర్మలకు

బంధకారణముచేసు. కావున నవి యకర్మలని చెప్పబడు
చున్నవి.

ఈ అధ్యాయమునందు భగవత్స్వరూప విశేషము, జ్ఞానిస్వరూపము, జ్ఞానముయొక్క యాధిక్యము, జ్ఞానసాధనము విస్పష్టముగా తెలుపబడుటచే, నీ యధ్యాయము జ్ఞాన యోగమని చెప్పబడినది-జ్ఞానాతిశయమును నిరూపించుటకు జ్ఞాన సాంప్రదాయము మొట్టమొదట విచారించబడినది. ఇందు వర్ణింపబడిన సాంప్రదాయము రాజర్షిసాంప్రదాయమని, పెద్దలచే తెల్పబడినది. పునర్జన్మ యీ క్రింద తెల్పిన గీతావాక్యముచే, జీవులకు దేహము నశించినపిదప లభించు మఱియొక జన్మ. అట్టి జన్మజ్ఞానము కలుగువఱకు జననమరణ, సంసారరూపమున జీవులకు అనేక జన్మలు కలుగుచున్నవని, శృతిన్యాయపూర్వకమగు యీ క్రింది సిద్ధాన్తము తెలుపుచున్నది.

శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున ॥ 4 అ 5

ఈ క్రింద తెల్పబడిన గీతాశాస్త్రన్యాయప్రకారం

శ్లో॥ "అజోఽపిస న్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపిసన్॥ 4 అ. 6

ఈశ్వరుడు సకల నియామకుడనియు నట్టి యీశ్వరుడే ప్రకృతమున శ్రీకృష్ణావతారరూపమున లోక సంగ్రహమునకై యవతరించెననియు తెలియవలెను. ఈశ్వరుడు జననమరణములు లేనివాడై భూతములకు నియామకుడైనను, అవతార స్వభావము, నాశ్రయించిమాయచేత జననమరణములను బడయుచున్నాడని పై శ్లోకార్థమువలన స్పష్టమగుచున్నది. ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియును, అధర్మమునకు వృద్ధియును కలుగుచున్నదో, ఆ యా సమయములందు ఈశ్వరుడు అవతా

రముదాల్చి అధర్మమును నిర్మూలించి, ధర్మస్థాపన చేయుచున్నాడు. శిష్టరక్షణార్థమును దుష్టసంహారణ నిమిత్తమును ధర్మము నుద్ధరించుటకును ప్రతియుగమునందును (అవసరమైనప్పుడెల్లను) భగవానుడు అవతరించుచున్నాడు.

భగవంతుని ఆశ్రయించుటవలన మరణానంతరము జీవునికి జన్మ కలుగక భగవంతుని జేరును. అనురాగమును భయక్రోధములను విడిచి తన్మయులై పరమాత్మను శరణుపొందిన యనేకులు జ్ఞానతపస్సుచేత పవిత్రులై ఈశ్వరభావమునుపొందిరి. నిష్కామకర్మానుష్ఠానము కర్మయోగము. కర్మయోగమే జ్ఞానయోగ సాధనము. నిష్కామకర్మయోగులు సర్వత్ర బ్రహ్మ సందర్శనమును జేయుచు బ్రహ్మత్వమును బొందుదురు - జీవులు చేయు కర్మానుసారముగ ఫలప్రదాతయగు నీశ్వరుడు వైషమ్య నైర్ఘృణ్యాది దోషప్రసక్తి కవకాశమివ్వక ఫలములనొసంగును. శ్రుతి స్మృత్యాదితాధికారముల ననుసరించి యేయే మనుజులేయే కర్మల నాచరింతురో వారలందరును పరమాత్మయొక్క మార్గమునే యనుసరించుచున్నారని గ్రహించవలయును. అనగా మోక్షమునకు ఫలమును తత్తదధికారానుగుణంబుగ నొసంగబడును. ఫలప్రదానమునకు వారివారి కర్మయు, వారివారి యభినివేశములును కారణంబులు-

శ్లో॥ కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజంతి ఇహదేవతాః
క్షిప్రంహి మానుషేలోకే సిద్ధిర్భవతి కర్మజా॥ 4 అ 12.

సామాన్యులు ఫలాభిలాషచేతను ఫలానుభవాహ్లాదము చేతను కర్మఫలాయత్త హృదయులగుటచే ముక్తికి దూరులై వారికోరికలకు తగు జన్మల బొందుచుందురని పైన తెల్పిన గీత

ముపదేశించుచున్నది. ఈ లోకమునందు కర్మఫలసిద్ధిని గోరు వారాయా దేవతల నారాధించుచున్నారు. మనుష్యలోకము నందు కర్మఫలము శీఘ్రముగా గలుగుచున్నది. ఫలసహితమైన కర్మయోగానుష్ఠానము సులభము. ఫలరహితమైన కర్మ యోగానుష్ఠానము ఫలరహితమైన కర్మానుష్ఠానమునకును, యోగమునకును, సాధనమగుచున్నది.

మనుష్యలోకమునకు వర్ణాశ్రమాది కర్మములు, ధర్మములు అత్యంత సహాయకరములు,

నాలుగువర్ణములవారును వారివారి గుణకర్మల ననుస రించి యనువగు యోనులందు ప్రవేశ పెట్టబడుదురు. ఆయా యోనిభేదములయందు ప్రవేశపెట్టబడుటవలన వైషమ్య నైర్ఘృణ్య దోషప్రసక్తి యెంతమాత్రము కలుగదనుటను ఈ క్రింది శ్లోకము వ్యక్తీకరించుచున్నది.

శ్లో॥ చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః
తస్య కర్తారమపిమాం విద్ధ్యకర్తార మవ్యయమ్॥ 4 అ. 3

గుణములన సత్త్వరజస్తమస్సులు; కర్మలన ఆ గుణ ములకనువగు జన్మలును, చేష్టలును. ఈ చాతుర్వర్ణ్య విభాగము దిఙ్మాత్రముగ ప్రదర్శింప నవసరమగుటవలన అయ్యది సంగ్రహముగ వివరించబడుచున్నది. శేషము గురుముఖతా తెలుసుకొనవలయును. ఇచ్చట కర్మయన "భూత భావో ద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః" భూతభావములనగా ప్రాణుల దేహములు. అట్టిదేహముల యుత్పత్తికి కారణభూతమగు విసర్గమునకు శుక్లశోణిత విభాగవ్యవస్థ యని అర్థము. దేహములయందలి భేదములకు సత్త్వ రజస్తమోగుణ

విభాగమును, శుక్లశోణిత విభాగమును కారణమగుచున్నవి. ఇట్టి విభాగాత్రితయమును తెలిసికొనుటకు మనము దేహ తత్త్వముల గమనించవలయును. దేహాకి వ్యవహారదశ యందు స్థూల సూక్ష్మ కారణంబులను మూడు దేహంబులు తెలియబడుచున్నవి. అందు సూక్ష్మ కారణంబులు గుణవిభాగంబు చేతను, స్థూలము కర్మవిభాగము చేతను ప్రవర్తిల్లుచున్నవి. సూక్ష్మ కారణంబులందలి భేద మదృష్టమగుటచే ననుభవ వేద్యము. స్థూలశరీరమన్నచో ప్రత్యక్షానుభవసిద్ధము. స్థూలశరీరము మాతాపితరులచే భుజింపబడిన యన్నరస వికారంబులగు శుక్లశోణిత సంయోగముచే గలుగుచున్నట్టుల యెల్లరకును తెలిసిన విషయమే. ఒకే మాతాపితరులకు జనించు స్త్రీ పురుషుల యందు, తత్త్వమునందు భేదమున్నట్టుల గుర్తెఱుంగుట అవసరము. ఋతుకాలమునందు సమావేశమునొందిన స్త్రీపురుషుల యొక్క, లోహిత శుక్లముల హెచ్చుతగ్గులచే స్త్రీపురుషజన్మలు కలుగుచున్నవి. శుక్లాధిక్యముచే పురుషుడును, లోహితాధిక్యముచే స్త్రీయును జనించునట్లు నిపుణులు తెలిసికొనియున్నారు. ఆతీరుననే మిశ్రమ బిందువునందలి,లోహిత శుక్ల తారతమ్యముచే పురుషులందుగాని స్త్రీలయందుగాని భేదముండుననుట యొక చిత్రముగాదు. స్త్రీ పురుషజన్మలకు కారణంబగు లోహిత శుక్లమిశ్రమ బిందు భేదముచే జాతివ్యవస్థ కలుగుచున్నది. అట్టులనిన దేహోత్పత్తికి కారణభూతంబులగు లోహితశుక్ల బిందువు యొక్క బరువు చాతుర్వర్ణ్యంబున తొమ్మిదిగా దలంపబడు చున్నది. ఇట్టి మిశ్రమ బిందువులకు బరువుచే భేదము లేక పోయినను, లోహిత శుక్లన్యాత్యాసముచేత నెనిమిదివిధముల

భేదము తెలియవచ్చుచున్నది. పైనుదహరింపబడిన పురుష బిందువులందును మొదటి నాల్గు పురుషబిందువులు. రెండవ నాల్గును స్త్రీ బిందువులు. ఇట్టి మిశ్రమబిందు విభాగమునకు కర్మవిభాగమని పేరు. ఇది శాస్త్రమందు విసర్గమని పిలువబడినది. విసర్గయనునది రెండు బిందువుల సమాహారము. వర్ణాశ్రమామ్నాయమందలి బిందు విసర్గమును గురించి అనుభవజ్ఞానమువలన దెలియనగును. ఈ బిందు విసర్గల తత్త్వము గురుముఖముగా తెలుసుకొనగలరు. బిందువులు బాహ్యమున కొకేతీరుగ గన్పట్టినను, వాస్తవముగ నొకబిందువు శుక్లమును, రెండవబిందువు లోహితమును సూచించును. అట్టి శుక్ల లోహిత తారతమ్యముచే స్త్రీపుంజాతి భేదము, చాతుర్వర్ణ్య భేదము కలుగుచున్నవి. ఋతుకాలమునందు సమావేశము చెందిన స్త్రీ పురుషులయొక్క లోహిత శుక్ల మిశ్రమముచే బుట్టిన స్థూలదేహము మరణపర్యంత మొకే విధమగు స్వభావమును గల్గియుండును. దానంజేసి యొకే జన్మయందు ఒకజాతినుండి మఱియొకజాతికి పరివర్తనము జెందుటకు సావకాశ మొంతమాత్రము కలుగదు.

పైన నుదహరింపబడిన నాల్గువిధములగు పుంబిందువులకును ప్రత్యేక ప్రత్యేకముగా నాల్గువిధములగు స్త్రీబిందువులతో సంసర్గము కల్గుటచే కలుగు మిశ్రమబిందువుల స్వరూపమునుబట్టి జాతి విభాగమేర్పడుచున్నది. సవర్ణ స్త్రీ పుంబిందు సంబంధముచే నుత్తమవర్ణములగు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులును, అసవర్ణ స్త్రీ పుంబిందు సంబంధముచే, ననులోమ విలోమాది జాతులును బుట్టుచున్నవి. స్త్రీ పుంబిందు సంబంధంబైన స్త్రీ పురుషుల సమావేశముచే బుట్టు లోహిత

సంక్రమించు సంకర్ణమనిదీని యభిప్రాయము. ఉత్తమవర్ణము లందును, అనులోమ విలోమ జాతులందును దెలియవచ్చెడి మిశ్రమబిందువుల స్వరూపము లొకేతీరున నుండక బహుభంగుల నొప్పుచుండును. దానంజేసి మానవకోటియందు కానవచ్చెడి దేహములు కరచరణాద్యవయవములచే సామాన్యముగ నొకే తీరున గన్పట్టుచున్నను, వారితత్త్వమున యెక్కువ వైషమ్యము గనిపించుచుండును. అట్టి వైషమ్యముచేతనే మానవజాతి యందలి, శ్రుతి స్మృతి సదాచారసిద్ధంబగు, జాతి విభాగము గలుగుచున్నది.

శ్లో॥ నమాం కర్మాణి లిమ్పన్తి నమే కర్మఫలేస్పృహా,
ఇతిమాం యోఽభిజానాతి కర్మభిర్నసబధ్యతే॥ (4 అ-14).

చాతుర్వర్ణ్య సృష్టికి తాను గర్తయైనప్పటికి, కర్తృత్వ భారము తనకు లేకుండుటకు, సృష్టియను కర్మయొక్క ఫలము నందు స్పృహలేకపోవుటయే కారణమని చెప్పబడుచున్నది. మహత్తరముగా దోచు నీ సృష్టికర్మను జేసినను ఆకర్మయొక్క గుణదోషములు పరమాత్మనంటనేరవని తెలియవచ్చుచున్నది. అందులకు కారణమేమన పరమాత్మయొక్క నిరంజన జ్ఞాన స్వరూపమేయని తెలియవలెను. పరమాత్మ నిట్టి నిరంజన జ్ఞానస్వరూపుడని తెలిసికొనినవాడుగూడ కర్మలచే బంధింపబడ డని చెప్పబడుచున్నది. ఎవ్వడైనను పరమాత్మయొక్క స్వరూ పము నిరంజన జ్ఞానస్వరూపమని తెలిసికొనినచో, వాడు కర్మ లచే బంధింపబడడు. శ్రీకృష్ణస్వరూపము తెలిసికొనినచో జీవునకు ప్రయోజన మెట్లు కలుగును? జీవస్వరూపమే శ్రీకృష్ణ స్వరూపమైనచో, కావలసినంత ప్రయోజనము కలిగితీరును.

శ్రీకృష్ణస్వరూపజ్ఞానముచే బ్రతివానికి బంధము తొలుగునని చెప్పబడుటచే బరమార్థమున బ్రతివాడును శ్రీకృష్ణుడేయై యుండవలయును. అట్టికారణమువల్ల పైన తెల్పిన గీతార్థమున జీవేశ్వర అభేదము నుపదేశింపబడినట్లు తెలియునది. కర్మలు పరమాత్మనంటవు. కర్మసిద్ధియందు పరమాత్మ కాసక్తిలేదు. ఈవిధముగా పరమాత్మను తెలిసికొనిన జ్ఞానిని కర్మఫలములు బంధించవు.

మోక్షాసక్తులగువారు సర్వకాలములందును కర్తృత్వాభిమానమును, ఫలాసక్తియును తమకులేవని యెఱిగి కర్మలు జేసిరి. కనుక పూర్వులు పరంపరగా కర్మలుచేసిన విధమున అందరు కర్మలు చేయవలయును.

ఆత్మజ్ఞానము లేనివారైనచో అంతఃకరణ శుద్ధికొరకును జ్ఞాని అయినచో లోక సంగ్రహము కొఱకును జనకాదుల వలె కర్మలను చేయవలయును.

శ్లో॥ కింకర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః,
తత్తేకర్మ ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్॥ (4 అ 16)

కర్మ యెట్టిది? అకర్మ యెట్టిది? కర్మల తారతమ్యతను గురించి బుద్ధిమంతులుకూడ సమ్మోహమును జెందిరి. కనుక కర్మతత్త్వమును పూర్తిగా విమర్శించుటమైనది.

కర్మాకర్మల విభాగమును తెలిసికొని శుభాశుభరూపమగు సంసారమునుండి విముక్తిజెందుమార్గమును తెలిసికొనవలయును.

శాస్త్ర చోదితములగు విహిత ప్రతిషిద్ధకర్మలను

నూర్చియు, నైష్కర్మ్యస్వరూపమగు అకర్మనుగూర్చియు, సందేహ నివృత్తియగునట్లు తెలిసికొనవలయును.

కర్మయనగా నామరూపాత్మకమగు సకల ప్రపంచము. అకర్మయనగా తద్భిన్నమును, నిర్వికారమును, జ్ఞానమాత్రమును అగు ఆత్మస్వరూపము. సూక్ష్మముగా తెల్పిన నీకర్మశబ్దముచే దేహేంద్రియ మనోబుద్ధులు గ్రాహ్యమగుచున్నవి. అందువలన కర్మశబ్దమునకు దేహేంద్రియ మనోబుద్ధులతో గూడిన నామ రూప ప్రపంచమంతయునని శాస్త్రదృష్టిచే గ్రాహ్యము. ఇట్టి కర్మలయం దకర్మయన, చిన్మాత్రమును నిర్వికారమును అగు ఆత్మను తెలిసికొనుట. అనగా కర్మ, అకర్మ నధిష్టానముగా గలిగి, రజ్జుసర్పభ్రాంతి రీతిగా మిథ్యారూపకమని గ్రహించ వల యును. అకర్మయందు కర్మను తెలిసికొనుట యవసరము. అకర్మయన నిర్వ్యాపారము. నిర్వ్యాపారముగూడ మనస్సు యొక్క అవస్థావిశేషమువలన వ్యాపారమగుచున్నది దేహేం ద్రియ మనోబుద్ధులయొక్క నిశ్చలరూపమగు అకర్మను స్వ స్వరూప వ్యతిరిక్తమగు కర్మగా తెలిసికొనుటయే కర్మయందు అకర్మను తెలిసికొనుటయని గ్రహించవలెను. తాను చలించు చున్నాననియు చలించుట లేదనియు అనుకొనుట అజ్ఞానవిలసి తమేయని గ్రహించుట, అకర్మయందు కర్మను గ్రహించుట యగును. దేహేంద్రియ మనోబుద్ధ్యాది ప్రపంచముయొక్క మిథ్యాత్వమును ఆత్మయొక్క స్వరూపమును తెలిసికొనిన విద్వాంసులే జ్ఞానులని తెలియవలెను. సకల భూతములకును నిద్రావస్థ, యోగికి జాగ్రదవస్థయు, సర్వభూతముల జాగ్రదవస్థ తత్త్వదర్శియైన జ్ఞానికి నిద్రావస్థయు నగుచున్నది.

ఎవని కర్మలు కామసంకల్ప ప్రేరితములు కాకుండునో, మరియు జ్ఞానాగ్ని చేత దహింపబడునో అట్టివానిని జ్ఞానిగా తెలియవలెను. ఎవరు నిత్య తృప్తులై నిరాశ్రయులై కర్మలను ఫలాసక్తి లేక ఆచరించెదరో, అట్టివారు కర్మలను చేసినను కర్మలను చేయుట లేదనియే గ్రహించవలెను.

దేహేంద్రియాదులను స్వాధీనమందుంచుకొని, యెట్టి ఆశలు లేనివారై దేహయాత్రకొఱకే కర్మలను జేసినను అట్టి వారు పాపమును పొందరు.

అహంభావముతో గూడిన కర్మ యెంత సాత్త్వికమైనను బంధహేతువగును. (ద్వంద్వములను జయించి సమత్వబుద్ధి గలవారు యెట్టి కర్మలను చేసినను బంధితులుగారు.)

మనస్సును ఆత్మజ్ఞానపరము జేసి నిస్సంగులై యజ్ఞము కొరకు ఆచరించు కర్మ బంధకరముగాక, పూర్ణముగ నశించుచున్నది. యజ్ఞము, హవిస్సు, హోమాగ్ని, అర్పణము, బ్రహ్మమే యని తెలియువాడు బ్రహ్మకర్మయను సమాధియందు నిలిచి బ్రహ్మమునే పొందగలడు. కర్మకాండయందు సూచితములైన ద్వాదశయజ్ఞములు, జ్ఞానకాండయందు ఆత్మయజ్ఞములో పరిసమాప్తి పొందుచున్నవని స్పష్టముగా తెలియవలెను. కనుక కర్మయజ్ఞములకన్న జ్ఞానయజ్ఞము శ్రేయోదాయకమని తెలియనగును. ఈ అధ్యాయమందు తెల్పిన వివిధ యజ్ఞముల ఫలితమును గుర్తెరిగినపిదప జ్ఞానదాయకమగు యజ్ఞము నాచరించుటయే మానవుని కర్తవ్యమని తెలియవచ్చుచున్నది. కొందఱు మానవులు ప్రాణాయామమునం దాసక్తిగలవారై సుషుమ్న నాడియందు ప్రాణాపానములను లయముచేయుచు

ప్రాణాయామయజ్ఞమును చేయుదురు. మఱికొందరు ఆహార నియమములుగలవారై ప్రాణమునాత్మచైతన్యమునందుహోమము చేయుదురు. ఇట్టివారందరును యజ్ఞధర్మము నెఱింగినవారై తత్కాలమున పాపరహితులగుచున్నారు.

యజ్ఞశేషమైన అమృతమును భుజించెడివారు బ్రహ్మమును బడయుదురు. యజ్ఞకర్మచేయని వారలకు ఇహపరములు లేవు.

పైనచెప్పినరీతిగా బ్రహ్మముఖమునుండి తెల్పబడిన పలువిధములైన యజ్ఞములు ఒకవిధమగు కర్మ సంబంధముకలిగి యున్నవి. కాన కర్మస్వభావమును తెలిసికొని మోక్షమును పొందగలరు. ప్రజాపతి ప్రజలనుయజ్ఞములతోకూడసృజించి వారికిట్లుచెప్పెను. "మీరు యజ్ఞములవలన వృద్ధిని బొందుడు. మీకవి కోరికలనిచ్చును." 3 అ 11.

యజ్ఞములు ఇంద్రియములను సంభావించునపుడు కామ్యములు సిద్ధించును, బంధము లేర్పడును. ఇంద్రియాధి దేవతలను సంభావించినపుడు ఆత్మపరములై మోక్షముగలుగును. 3అ.12

జగచ్చక్రమునందు బ్రహ్మోద్భవమైన యజ్ఞకర్మలు ఇహపరములకు సాధనములు. స్వోపభోగపరమైన కర్మలు దుఃఖహేతువులును, ఆత్మయోగపరములైన కర్మలు ముక్తికి హేతువులు నగుచున్నవి. యోగము కర్మయోగమై, కర్మయోగము నిష్కామకర్మయోగమై, ఆత్మయోగపరమైనపుడు పూర్ణయోగపరిణామమును బొందుచున్నది.

ఓ అర్జునా! ద్రవ్యసాధనముచే చేయబడెడు యజ్ఞములకంటె జ్ఞానయజ్ఞము శ్రేష్టమైనది. సమస్తకర్మమునకును జ్ఞానము

పరమార్థము. కర్మయోగమునకు పరమార్థము బ్రహ్మవిద్య. బ్రహ్మోద్భవమైన కర్మ బ్రహ్మమునందు (పూర్ణజ్ఞానమునందు) పరిసమాప్తిని పొందుచున్నది. ఆత్మజ్ఞానమును బ్రహ్మజ్ఞులైన వారలనుండి తెలిసికొనుము. ఆత్మపరత్వము, ఆత్మజిజ్ఞాస ఆత్మార్పణము జ్ఞానయోగసాధనములు. అభిమానాహంకారములను విడిచి శ్రద్ధావంతులై జ్ఞానులైన తత్త్వజ్ఞులవల్ల జ్ఞానోపదేశమును బడయవలయును. ఓ అర్జునా! ఏది మోహమును నిర్మూలించునో, దేనివలన సకల భూతములను నీయందును, సర్వాంతర్యామినగు నాయందును చూడగలవో అదియే జ్ఞానమని తెలియవలెను. పరమపాపులునైతము వారి పాపమునంతను జ్ఞానమనెడి నావచేత దాటగలరు. మండుచున్న అగ్ని కట్టెల నేరీతిగా భస్మము చేయునో ఆరీతిగా జ్ఞానమను అగ్ని, సమస్త కర్మలను సమిధలవలె భస్మముచేయును. జ్ఞానముతో సమానముగ పవిత్రమైనది వేఱొకటి ఈ లోకమునందు లేదు. ఆజ్ఞానమును స్వయముగ నాత్మయోగమువలన సిద్ధి పొందినవాడు, కాలక్రమమున పరమాత్మనైన నాయందు చేరుచున్నాడు.

శ్రద్ధగలవాడును జ్ఞానమునం దాసక్తిగలవాడును ఇంద్రియనిగ్రహముగలవాడును జ్ఞానమును పొందుచున్నాడు. జ్ఞానము గలిగినవెంటనే మోక్షమును బడయును. ఎవరు సంశయాత్ములై, జ్ఞానరహితులై, శ్రద్ధలేనివారై యుందురో అట్టి వారికి ఇహపరములేకాక సామాన్య సౌఖ్యముకూడ లేదు.

ఓ అర్జునా! యోగముచేత విడువబడిన కర్మలును, జ్ఞానముచేత విడువబడిన సంశయములను గల ఆత్మయోగిని

కర్మలు బంధింపవు. కావున నీ హృదయమునం దజ్ఞానమువలన గలిగిన సంశయమును జ్ఞానమనెడి కత్తితో తెగగొట్టి యోగ స్థితుడవై స్వధర్మమును నిర్వహింపుము.

## సారాంశము

వైదిక జ్ఞాన పరిణామమునందు వేదాంతవిజ్ఞానము పరిపూర్ణమై యలరారుచున్నది. కర్మపరమైన వైదికవిజ్ఞానము యజ్ఞరూపమున బ్రహ్మపరమై, జ్ఞానయోగ పరిణామమును పొందుచున్నది. అనంతములైన కర్మలనంతములైన యజ్ఞ పరిణామమును పొందుచున్నవి. దేహక్షేత్రములు ధర్మక్షేత్ర పరిణామమును పొందుట కనంతములైన యజ్ఞములు విధింపబడినవి. ధర్మార్థకామమోక్షములకు మూలాధారమైన దేహ రక్షణ, పోషణముల కనంతములైన బాహ్యయజ్ఞములు విధింపబడినవి. క్షేత్రాధారములైన పంచభూతములు, పంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, మనోబుద్ధి చిత్తాహంకారములు, ప్రకృతియందు వినిమయ విన్యాసరూపమున వైదిక మతమునం దనంతములైన, యజ్ఞపరిణామమును పొందుచున్నవి. నిత్యమైన ఆత్మతత్వ సిద్ధికి సకలకర్మలును, యజ్ఞ సంస్కారమును పొందవలెను. కర్మపరమైన ప్రవృత్తిమార్గము జ్ఞానపరమైన నివృత్తిమార్గమునందు యజ్ఞరూపమున పరిసమాప్తి పొందుచున్నది.

కర్మజములును, సాపేక్షములును, ప్రకృతిపరములైన స్థూలసూక్ష్మభూతయజ్ఞములు, శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణ యజ్ఞములు, కర్మేంద్రియయజ్ఞములు, ప్రాణాయామ స్వాధ్యాయ యజ్ఞములు, దేవయజ్ఞములు, నిరపేక్షమైన ఆత్మయోగ పర

నాశమును పొందుచున్నవి. దేహధారులకు అకర్మస్థితి అశక్యము. అకర్మ శరీరయాత్రకును అప్రసిద్ధము. అయజ్ఞునకిహలోకమే ప్రసిద్ధముగా నప్పుడు, పరలోక మసలే లేదు. అజ్ఞాన సంజాతమైన సంశయములుపోయి జ్ఞానయోగనిష్ఠగలుగుటకు యోగము కీలకము. యోగమనగా కర్మయోగము. కర్మయోగమాత్మజ్ఞానయోగము నందు పూర్ణయోగపరిణామమును పొందగలవిధమును కర్మసన్న్యాసయోగము ప్రతిపాదించుచున్నది.

శ్లో॥ తస్మాదజ్ఞాన సంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత॥ 4 అ. 42

# పంచమాధ్యాయము

## కర్మ సన్న్యాసయోగము

జ్ఞానయోగపరమైన నాల్గవ అధ్యాయము "యోగ మాతిష్ఠ ఉత్తిష్ఠ" అను ఆదేశములతో నంతమును పొందు చున్నది. గీతాప్రయోజనము బ్రహ్మ విద్యోపదేశము. ఈ యుపదేశము శ్రీకృష్ణార్జున సంవాదరూపమున పరి పరి విధముల పరిస్ఫుటము చేయుటయే గీతాశాస్త్రమునకు ప్రయోజనము. జ్ఞాన యోగాధ్యాయమునందు యోగిని. కర్మలు బంధింపవని తెలుపబడినది. భగవత్పరమగు కర్మచేయుటయే జ్ఞానసాధ నము, యోగసాధనము, పురుషార్థము, పరమార్థము.

జ్ఞాన యోగాధ్యాయము "సన్న్యాస యోగమును" "కర్మయోగమును" మోక్షసాధనములుగ నుపదేశించుచున్నది. ఆత్మనిష్ఠుల కీ రెండు యోగములందును భేదము కనబడక పోయినను సాధకులైన జిజ్ఞాసువులకు సంశయము కలుగును. ఆ సంశయమును నివారించుటకై కర్మ సన్న్యాస యోగా ధ్యాయమునందు పూర్ణయోగతత్త్వము తిరిగి బోధింపబడు చున్నది. సామాన్యబుద్ధిగల పార్థుడు కర్మసన్న్యాసయోగము యొక్క పరమార్థమును తెలిసికొననిచో మోహముపోదు. కర్మయోగాధ్యాయమునందు సకలభూతములును కర్మప్రవృత్తి యందు లగ్నమగుచున్న విధము తెలుపబడినది. దేహధారులకు కొంతవరకు సాధ్యమయినది ఫలత్యాగము. అసాధ్యమైనది కర్మత్యాగము. కామ్య కర్మలను విడుచుటయే సన్న్యాస

మనియును, పావనకరములయిన "యజ్ఞదాన తపః కర్మలను" విడువక చేయవలయుననియును ౧౮ వ అధ్యాయమునందు తెలుపబడినది. "ఆత్మ సంయమ యోగమునందు" ఫలాపేక్షను విడిచి నియత కర్మలను చేయు "సన్న్యాసమును" "యోగ"మనియును, అక్రియత్వమును, నిరగ్నిత్వమును యోగము గాదనియును తెలుపబడినది. దేహయాత్ర కొఱకును, ఆత్మశుద్ధికొఱకును యథార్థముగ సంగమును, ఫలమును విడిచి, కర్మలను జేయుటయే కర్మసన్న్యాసము. నిస్సంగులైన ఆత్మయోగులు దేహేంద్రియ మనోబుద్ధులచేత ఆత్మశుద్ధికొఱకు కర్మలను జేయుచున్నను బాధకరముకాదు. కర్మయోగదృష్టితో ధర్మక్షేత్రమైన దేహక్షేత్రమునందు లోకక్షేమకరమగు కర్మలు చేసి, జీవన్ముక్తులు కాగల విధ మీ యధ్యాయమునందు తెలుపబడుచున్నది.

దేహక్షేత్రమునందు.ఆజ్ఞాచక్రస్థానమైన భ్రూమధ్యప్రదేశము జ్ఞానస్థానము. ఈ జ్ఞానస్థానమునందు సూర్యచంద్రనాడులను, పురుష ప్రకృతులను, భావరూపములను, జ్ఞానకర్మలను సాంఖ్యయోగములను, పరమాత్మ ప్రత్యగాత్మలను,సుషుమ్నాముఖమున నియమించి యోగి, ద్వంద్వాతీతుడై, శాంతిని, పొందుచున్నాడు. ఈ స్థితియే పూర్ణయోగము. అభ్యాస వైరాగ్యములచేత సర్వసమత్వబుద్ధిగలిగి పూర్ణయోగమును పొందగలవిధ, మాత్మసంయమ యోగమునందు వివరింపబడినది.

కర్మయోగము సకలకర్మలు బ్రహ్మోద్భవమనియును, కర్మసన్న్యాసయోగము కర్మజములైన యజ్ఞములందు బ్రహ్మము ప్రతిష్ఠితమనియును, జ్ఞానయోగము సకలకర్మలును

జ్ఞానమునందు పరిసమాప్తిని పొందుననియును, జ్ఞానము స్వానుభవ లబ్ధమైన ఆత్మయందు గలుగుననియును ప్రతిపాదింపబడినది. ఆత్మ సంయమయోగము, అనేకములును, అనిత్యములును, సాపేక్షములును అయిన యజ్ఞములు, ఏకమును, నిత్యమును, నిరపేక్షమును అయిన ఆత్మయోగమునందు (బ్రహ్మమందు) పరిసమాప్తిని పొందుచున్న విధమును వివరించుచున్నది.

శ్లో "సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్రేయసకరావుభౌ,
తయోస్తు కర్మసన్న్యాసాత్కర్మయోగో విశిష్యతే॥5 అ. 2

కర్మసన్న్యాసముకన్న కర్మయోగమే శ్రేష్టమని శ్రీకృష్ణ పరమాత్మ బోధార్థమై యున్నది. పైనచెప్పబడిన శంకా, సమాధానములు రెండును నిస్సందేహముగను స్పష్టముగను యున్నవి. మొదటిపాదమునందున్న శ్రేయశ్శబ్దమునకు వ్యాకరణానుసారముగ అధికప్రశస్తము అనగా మిక్కిలి మంచియని అర్థము కాన, రెండు మార్గములందును గల తారతమ్యవిషయమై, అర్జునుడడిగిన ప్రశ్నకు "కర్మయోగో విశిష్యతే" కర్మయోగము గొప్పదని చెప్పబడినది. ఐనను యీ సిద్ధాంతము జ్ఞానముకలిగిన పిదప సర్వకర్మలను బొత్తిగ వదలివేయవలయునను సాంఖ్య మార్గమున, స్పష్టము కానందున, స్పష్టముగ దెలియుచున్న యీ ప్రశ్నోత్తరములకు అనేకులు అనేకార్థములుచెప్పి గందరగోళము చేసిరి. ఉద్దేశింపబడిన ప్రయోజనము కలుగకపోవుట వలన "విశిష్యతే" యోగ్యత, లేక మహాత్వము, విశేషము, అను పదముచే భగవంతుడు కర్మయోగమును స్తుతిచేసెను. కాన నది యథార్థ దృష్టిగ స్వీకరించవలెను.

జ్ఞానము కలిగిన పిదప కర్మలు అక్కరలేదని భగవంతుని యభిప్రాయమైనచో, ఈ రెంటిలో సన్న్యాసమే "శ్రేష్ఠమని" అర్జునకు భగవంతుడు చెప్పలేడా? కాని అట్లుచేయక "కర్మలు చేయుటయు. కర్మలను వదలివేయుటయు అను నీ రెండుమార్గములును మోక్షప్రదములే"యని చెప్పెను. పిదప 'తు' అనగా 'కాని' అను పదమును ప్రయోగించి, "తయోః" అనగా నీ రెండుమార్గములలో కర్మను వదలు మార్గముకంటె, కర్మ చేయుటయను నదే మిక్కిలి ప్రశస్తము. (శ్రేయము) అని భగవంతుడు నిస్సందేహముగ విధించెను. అట్లు విధించి యుండుటచే, సాధనావస్థయందు, జ్ఞాన ప్రాప్త్యర్థమై చేయదగిన నిష్కామకర్మలే, పిదప సిద్ధావస్థయందుసైతము, లోకసంగ్రహార్థమై, జ్ఞాని యామరణాంతము కర్తవ్యములను తలంపుతో నాచరించవలయునన్న మతమే భగవంతున కిష్టమని పూర్ణముగ స్థిరమగుచున్నది.

గీతయందలి మూడవ అధ్యాయమున నీ విషయమే చెప్పబడినది. (3-౭)అచ్చో సైతము 'విశిష్యతే' అను పదమే వుపయోగింపబడినది. తర్వాత శ్లోకమున (3-౮) "అకర్మకంటె కర్మయే శ్రేష్ఠ"మని మరల స్పష్టముగా చెప్పబడినది.

ఉపనిషత్తులలో ననేక స్థలములందు, (బృ౪-౪-౨౨) జ్ఞానులు, లోకేషణ, పుత్రైషణాదులకు, లోనుకాక భిక్షమెత్తుకొనుచు తిరుగుచున్నారని చెబ్బబడినదనుమాట నిజమే. కాని జ్ఞానము కలిగిన తర్వాత ఇదే మార్గమనియు, మఱియొక మార్గము లేదనియు ఉపనిషత్తులలో చెప్పబడలేదు. కనుక పైనచెప్పబడిన ఉపనిషద్వాక్యములతో మాత్రమే గీతల కేక.

వ్యాఖ్యాత చేయుట యుక్తము కాదు. ఉపనిషత్తులందు చెప్పబడిన సన్న్యాసమార్గము మోక్షప్రదము కాదని గీతలు చెప్పుట లేదు. కాని కర్మ సన్న్యాసములను నీ రెండుమార్గములును మోక్షప్రదములైనను (అనగా మోక్షదృష్టిచే రెండింటియొక్క ఫల మొక్కటియే యైనను) జగత్తుయొక్క వ్యవహారమును విచారించుచు, జ్ఞానము కలిగిన తర్వాత సైతము నిష్కామ బుద్ధితో కర్మలు చేయుచుండవలయునను మార్గమే మిక్కిలి ప్రశస్తమని తెలియచేయబడినది. గీతకు టీక వ్రాసిన వ్యాఖ్యాత లనేకులు ఈ పై వ్యాఖ్యానము నొప్పుకొనరు. వారి సిద్ధాంతములు కర్మయోగమును, గౌణముగా తెల్పుచున్నవి. కాని, వారి వ్యాఖ్యానము సరియయినదికాదని నా సిద్ధాంతము. ఆత్మవేత్తకు, జ్ఞాననిష్ఠ నుపదేశించు తలంపుతో కృష్ణపరమాత్మ సర్వకర్మసన్న్యాసమును చెప్పినాడు. ఈ యుపదేశము అర్జునకు కాదు. కావున కర్మానుష్ఠాన, కర్మసన్న్యాసములు భిన్నాధికారులవిషయమైయుండ ఆ రెంటిలో శ్రేష్ఠతర మేదియని అర్జునుడు వేసిన ప్రశ్న అసందర్భపు ప్రశ్నయని సన్న్యాసమార్గీయుల అభిప్రాయము. ఆత్మజ్ఞానము లేని అర్జునునకు కర్మయోగమును, ఆత్మజ్ఞానులైనవారికి సన్న్యాసమును సాధనమని సన్న్యాసమార్గీయుల అభిప్రాయము.

వైదికమత పరిణామమునందు వర్ణాశ్రమ ధర్మములు విచిత్ర ధర్మపరిణామములు. ఆశ్రమస్వీకారము త్యాగధర్మాధ్యాయమునందు మనోహరమైన ఘట్టము. జననమునుండియును దేహేంద్రియాదుల కభ్యాసమైన సంసారసౌఖ్యములను, భాగ్యభోగములను, విషయారాధనమును విసర్జించి సన్న్యాస

మును స్వీకరించుట యసాధ్యవిషయము. సర్వసంగపరిత్యాగము చేసిన వ్యాసుడు, శుకుడు, గౌతమబుద్ధుడు, శంకర, రామానుజాదులు మొదలయిన మహానుభావులు పూజాపీఠముల నధిష్ఠించి సన్న్యాసమునకు ప్రజాహృదయమునం దపారమైన గౌరవ ప్రతిష్ఠలను కలుగజేసిరి. సన్న్యాసము వర్తమానకాలమునందు సమ్మోహమును కలుగచేయుచున్నది. సన్న్యాసమునకు పరమార్థ మంతర్ధానమై. బాహ్యచిహ్నములు మాత్రము శేషించియున్నవి. సన్న్యాసము కామ్యకర్మల న్యాసమున కేర్పడినను, సంసారత్యాగము, ముండన కాషాయాంబరములు, భిక్షాటనము మాత్రము శేషించి యున్నవి.

భగవద్గీత "సన్న్యాస, యోగములకు" శ్రీకృష్ణార్జున సంవాదరూపమున యథార్థమైనస్థానమును నిరూపించుటకు ప్రయత్నించినది. యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు ధనుర్ధరుడైన పార్థుని, ఘోరమైన మహాభారతియుద్ధమునందు, గీతోపదేశ సాధనమువలన ప్రవర్తింపచేయుచున్నాడు.

హిందూ సమాజమునందు సన్న్యాసాశ్రమము పట్లగల గౌరవ మపారము. సన్న్యాసమార్గీయులు ప్రస్థానత్రయము మీదను - భగవద్గీతాశాస్త్రముమీదను వ్రాసిన వ్యాఖ్యానములు, సన్న్యాసగౌరవమును బలపరుచుటయేగాక, సన్న్యాసమునకు సంకుచితార్థమును ప్రతిపాదించినవి. భగవద్గీత "సన్న్యాసము, కర్మయోగములం" దేది శ్రేయస్కరమని ప్రతిపాదించినది, నిర్ణయించినది, తెలుసుకొనుట కీ శ్లోకము ప్రమాణముగ నున్నది.

శ్లో॥ సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరావుభౌ,
తయోస్తు కర్మ సన్న్యాసాత్, కర్మయోగో విశిష్యతే-5 అ 2

సన్న్యాసమార్గీయుల వ్యాఖ్యసంకుచితమని తెలుపుటకు, కర్మయోగపరముగ తిలక మహాశయుని వ్యాఖ్యానము, సవిస్తరముగ పైన నుదహరించబడినది. పాఠకులు కర్మయోగ సాంఖ్య యోగ పరమార్థములను గ్రహించి గీతా ప్రయోజనమును, జీవిత పరమార్థమును సాధింతురుగాత !

ప్రవృత్తి నివృత్తి మార్గములు, సాపేక్షములు. దేహధారులకు పూర్ణమైన ప్రవృత్తిస్థితియును, పూర్ణమైన నివృత్తిస్థితియును దుర్లభము. కర్మయోగ సంసిద్ధిలేక జ్ఞానయోగమును, జ్ఞానయోగసంసిద్ధిలేక కర్మయోగమును సాధించుట అసాధ్యము. సంసారమును పరిత్యజించి సన్న్యాసమును స్వీకరించినను, జీవయాత్రకు కర్మలవసరము. షోడశకర్మలను పరిత్యజించిన మాత్రమున కర్మసన్న్యాస సిద్ధిగలుగదు. ప్రాణమున్నంతవరకును అకర్మత్వ మసంభవము. కర్మ ఫలత్యాగము నందే సన్న్యాస సిద్ధిసాధ్యము. ఈస్థితి సన్న్యాసమునకును, కర్మయోగమునకును సమానము. కాని రెండు యోగములందును, కర్మయోగధర్మము సన్న్యాసులకుకూడ అవసరమనియు, విశేష వ్యాపకముగలదనియు, ప్రత్యవాయము లేనిదనియు, కాన విశేషమైయున్నదనియు తెల్పబడినది. భిన్నాధికారులకుభిన్నములైన రెండు ధర్మములు, నిరూపింపబడినవనుటకు గీతాశాస్త్రమునందాధారములులేవు. సాపేక్షములై అన్యోన్యాధారములైన రెండుయోగములు, నిరపేక్షమైన ఆత్మజ్ఞానమునందు సంసిద్ధిని పొందుచున్నవి.

శ్లో॥ జ్ఞేయస్సనిత్యసన్న్యాసీ యోనద్వేష్టి నకాంక్షతి
నిర్ద్వంద్వోహి మహాబాహో సుఖంబంధాత్ప్రముచ్యతే 5 అ. 3

ఎవడు సుఖదుఃఖములను తత్సాధనములను కోరడో, ఎవనిని ద్వేషింపడో, వాడు కర్మముల నాచరించుచున్నను, నిత్య సన్న్యాసియగును. రాగద్వేషాదిద్వంద్వములు లేనివాడు ద్వంద్వాజన్యమగు, సంసారమునుండి సులభముగా విడువబడును.

## సారాంశము

కర్మసన్న్యాస యోగాధ్యాయము సాంఖ్య కర్మ జ్ఞాన యోగాధ్యాయములలో వివరించినవిధమున కర్మయోగ విశేషమును "తయోస్తుకర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే" అని ప్రస్తుతించినది. కర్మయోగియైన అర్జునకు కర్మ యోగవిషయమున కలిగిన సంశయము పోవుట కాత్మజ్ఞాన మవసరమగుచున్నది. ఆత్మజ్ఞానమునకు యోగము పరమార్థ సాధనము. రెండవ అధ్యాయము సాంఖ్యయోగాధ్యాయము. దేహ మనిత్యమనియును, దేహినిత్యుడనియును, అనిత్యమైన దేహనాశనమునకు దుఃఖించుట నిరర్థకమనియును, నిత్యమైన ఆత్మజ్ఞానమునకు యోగముసాధనమనియును బోధించినది. మూడవయధ్యాయము కర్మ యోగాధ్యాయము. నిత్యమైన ఆత్మజ్ఞానమునకువలె దేహధారణమునకును కర్మయోగావసరము యిందు వివరించబడినది. నాల్గవఅధ్యాయము జ్ఞాన యోగాధ్యాయము. బ్రహ్మవిద్యకుహృదయమైన ఆత్మజ్ఞానము స్వానుభవసిద్ధమైన యోగసంసిద్ధికి సాధనమని ప్రతిపాదించబడినది. ఐదవ అధ్యాయము, కర్మ సన్న్యాసయోగము కర్మఫలమును, కామ్యకర్మలను విడుచుట కర్మసన్న్యాసమని

యును, బ్రహ్మనిర్వాణమునకు ఆదిసాధనమనియును, కర్మలను విడుచుట అందుకు సాధనముగాదనియును, ప్రస్తుతించినది.

ఆత్మను బాహ్యవిషయారాధనమునుండి అంతర్ముఖము చేయుట యోగము. ఆత్మయోగము సకల పదార్థములందును, ఆత్మసందర్శనమునకు సాధనముగనున్నది. సర్వత్ర ఆత్మను, సర్వమును ఆత్మయందును సందర్శించుట ఆత్మయోగము. ఆత్మయోగి యజ్ఞదాన తపఃఫలములకు భోక్తయై, బ్రహ్మవిద్యాధికారియై, శాంతిని పొందగలవిధమును కర్మసన్న్యాస యోగాధ్యాయము వివరించుచున్నది.

వైదిక విజ్ఞానమునకు పరమార్థము బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యకు పరమార్థ మాత్మయోగము. ఆత్మయోగము "తత్త్వమసి" అను మహావాక్యమునందు పరిపూర్ణతను బొందుచున్నది. పూర్ణయోగము "సర్వంఖల్విదంబ్రహ్మ" "సోఽహంబ్రహ్మాస్మి" అను పరమార్థము నాత్మయోగ సాధనవలన నిరూపించుచున్నది. మొదటి ఐదు అధ్యాయములును ప్రతిపాదించిన కర్మయోగము నాత్మసంయమ యోగాధ్యాయము తిరిగి వివరించుచున్నది.

# షష్ఠోధ్యాయము

## ఆత్మసంయమయోగము

ఈ అధ్యాయముతో గీతాశాస్త్రమందు ప్రథమకాండ, ఒకవిధముగ నంతమగుచున్నది. గతించిన అయిదు అధ్యాయములందు జ్ఞానయోగము, కర్మయోగము మోక్షసాధనములని తెలుపబడినది. వైదికమతానుగుణ్యముగ సన్న్యాసము జ్ఞానయోగమునకు సాధనమని ప్రతిపాదించబడినది. వేదచోదితమైన సన్న్యాసము జ్ఞానయోగమునకు లక్ష్యముగ బరిణమించినది. ఈ క్లిష్ట సన్న్యాసమును విస్పష్టముచేయుట గీతాశాస్త్రమునకు ప్రయోజనము. ఈ అధ్యాయము మొదటి శ్లోకమందే సన్న్యాస లక్ష్య ప్రయోజనము విశదీకరించబడినది. యోగి అనగా, కర్మఫలము నాశ్రయింపక నియతకర్మానుష్ఠానము చేయువాడు. అగ్నిహోత్రమును, కర్మలను విడిచినవాడు మాత్రమే సన్న్యాసికాడు–ఈ పరమార్థమునే యీ అధ్యాయమున వివరింపబడిన ఆత్మసంయమ యోగము విస్పష్టము చేయుచున్నది. ఆత్మతత్త్వమును గ్రహించుట గీతాశాస్త్రరహస్యమును గ్రహించుటకు సాధనమని తెలియవలెను.

మన దేహేంద్రియములకును అంతఃకరణమునకును పరమాత్మకును, ఆత్మపద ముపయోగింపబడుచున్నది. దేహాత్మ భేదమును తెలుసుకొని ఆత్మజ్ఞానము నారాధము చేయుట, బ్రహ్మవిద్యావ్యాప్తికిని గీతాశాస్త్రమునకును ప్రయోజనము. బ్రహ్మ

విద్యాపరమగు ఆత్మయోగమును పూర్ణయోగ రూపమున గీతాశాస్త్రము బోధించుచున్నది. సాధకుల సంశయములను నివారించుటకు ఆత్మసంయమ యోగరూపమున పూర్ణయోగ స్వభావమును గీతాశాస్త్రము దెలుపుచున్నది. ఆత్మసంయమ యోగాధ్యాయము ఆత్మధ్యానయోగమని తెలుసుకొన బడుచున్నది. ఈ అధ్యాయమున ఆత్మధ్యానము జేసెడి విధములుగూడ గలవు.

అహంకృతీయ ప్రతీయ మానత్వమువలన అర్జునుడు, రణ రంగమున౽దు స్వకర్మానుష్ఠానమును విసర్జించి అకర్మత్వమును బూని కర్మసన్యాసమును జేసినటుల తలంచెను.

గీతాశాస్త్రము మొదటి ఆరు అధ్యాయములందును, సర్వవ్యాపకమైన "నేను" నిత్యమైన ఆత్మపదార్థమనియును, నిత్యమైన ఆత్మకు హాని వృద్ధులు, సుఖదుఃఖములు, జయాపజయ ములు, చావుచంపుటలు, లేనివిధమును సాంఖ్య, కర్మ, జ్ఞాన, సన్న్యాసయోగములు స్పష్టపరచినవి. ధర్మార్థకామమోక్షము లకు ఆత్మజ్ఞానము మూలబీజము. గీతాశాస్త్రమునందు గల మొదటి 6 అధ్యాయములు కర్మషట్కమనియును, రెండవ 6 అధ్యాయములు ఉపాసనషట్కమనియును, శేషించిన 6 అధ్యా యములు మోక్షషట్కమనియును నిర్ధారణగ తెలుసుకొన గలరు. ఈ అధ్యాయముతో కర్మషట్కము ముగియుచున్నది. ఈ ఆరు అధ్యాయములు "త్వం" పదార్థమును తెలుపుచున్నవి. "నేను" పదార్థ మనిత్యములైన, ఇంద్రియాదులును, కర్మలును కావనియును, అవి నిత్యమైన ఆత్మయనియును, అట్టి ఆత్మయే బ్రహ్మమనియును గీతాశాస్త్రము మొదటి 6 అధ్యాయము

లంబును వివరింపబడినవి. ఆత్మసంయమ యోగాధ్యాయ మాత్మజ్ఞాన సాధనమును తెలిపి ప్రతిపాదించుచున్నది.

శ్లో॥ అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః,
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః॥ (6 అ 1)

తాను చేయవలసినకర్మలు ఫలాసక్తిలేక యెవడు చేయునో యాతడే సన్న్యాసియును, యోగియును అగుచున్నాడు. అగ్నిహోత్రాదులను విడిచినంతమాత్రమున సన్న్యాసియును, కర్మలను చేయనంతమాత్రమున యోగియును గాడు.

వైదిక కర్మాంగములైన అగ్నులను, తపోదానాది కర్మలను విడుచువాడు మాత్రమే సన్న్యాసియు, యోగియు కాడు. ఫలాపేక్షలేక నిత్యనైమిత్తిక కర్మల నాచరించువారు యోగులుగాను, సన్న్యాసులుగాను తెలియవలెను. నిజమైన సన్న్యాసి కర్మలనుగాక, వానిఫలములనువిడుచుచున్నాడు. కర్మయోగి నిష్కామబుద్ధితో కర్మలను చేయుచున్నాడు. ఉభయయోగములకును ఆత్మయందు సమబుద్ధియే లక్ష్యముగాన, రెండును నొకటే యగుచున్నవి. సన్న్యాసి ఆత్మానుసంధానము చేయుచున్నాడు. కర్మయోగి దేహేంద్రియాదులం దాత్మ సంకల్పమును విడుచుచున్నాడు. అందువలన జ్ఞానయోగమే కర్మయోగమనియు, కామసంకల్పాదులను పరిత్యజించినవాడు యోగియనియు, సన్న్యాసికూడ కామ్యకర్మలను విడుచుచున్నాడనియు, తెలియవలెను. సన్న్యాసము యోగమునం దంతర్భూతమగుచున్నది. కర్మయోగమునకు నిష్కామబుద్ధితో కర్మలనుచేయుట లక్ష్యము. సన్న్యాసమునకు సంకల్పమును

విడచి కర్మచేయుట లక్ష్యము. సంకల్పత్యాగము, ఫలత్యాగము కర్మయోగమునందు సమత్వమును పొందుచున్నవి. కాన సన్న్యాసముకూడా యోగమే యగుచున్నది.

శ్లో॥ యంలబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాఽధికం తతః,
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే॥ (6 అ 22)

శ్లో॥ తం విద్యా ద్దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞితమ్,
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణ చేతసా॥ (6 అ 23)

ప్రాప్తమయిన లాభముకంటె నితరములైన లాభములను హెచ్చుగా కోరక, యెంతటి గొప్పదుఃఖముచేతను చలింపక, జ్ఞానము కలుగలేదని మనస్సున నిరాశ, విసుకుచెందక నిశ్చయబుద్ధితో యోగమును సాధించుటకూడా యోగాభ్యాస లక్షణమని తెలియవలెను. కనుక సంకల్పమువలన కలిగెడి కోరికల నన్నిటిని పూర్తిగా విడిచి, ఇంద్రియములను మనస్సును స్వాధీనములోనికి తెచ్చుకొని, ధృతిచేత నిగ్రహింపబడిన బుద్ధిచేత మెల్లమెల్లగా నుపరమింపవలయును. మనస్సును ఆత్మయందు సంధానముచేసి ఇతరములను చింతింపజనదు.

శ్లో॥ యంసన్న్యాస మితి ప్రాహు ర్యోగం తంవిద్ధిపాండవ
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీభవతి కశ్చన॥ 6 అ. 2

శ్లో॥ ఆరురుక్షో ర్మునేర్యోగం కర్మ కారణ ముచ్యతే,
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే॥ 6 అ. 3

యోగమని దేనిని అనెదరో అదే సన్న్యాసము. పరమాత్మకు సంతోషమును కలిగించునదేకర్మ. అదియే మోక్షదాయకము. "పరమాత్మను తెల్పునదియే" నిజమగు విద్య. ధ్యానయోగులు రెండురకములుగా నుందురు.

(1) ఆరురుక్షులు (2) ఆరూఢులు. వీరిలో మొదటి తరగతిలోనివారు నిష్కామదృష్టితో కర్మ చేయవలెను. రెండవతరగతివారికి కర్మ అవసరము లేదు.

ఇంద్రియార్థములగు శబ్దాదివిషయములందును, కర్మల యందును మనస్సును విడగొట్టి సర్వసంకల్పములను త్యజించిన వాడు యోగారూఢుడు (సన్న్యాసి)గా తెలిసికొనవలెను.

ఆత్మకు, ఆత్మబంధువు. జీవునకు, పరమాత్మ బంధువు. మొదటి ఆత్మజీవుడు. రెండవది పరమాత్మ గనుక, నీకు నీవే బంధువు. నీకు నీవే శత్రువు. మనసుయొక్క చలనమే బంధువును, శత్రువును అగుచున్నది.

విషయములతో సంబంధము మనస్సునకు కలిగినప్పుడు అది శత్రువగువును. నిర్విషయమైన మనస్సు బంధువగును. మానవులందరు భగవత్ స్వరూపముగ తెలుసుకొనిన జ్ఞాని అపకారికికూడ ప్రత్యపకారము చేయడు. జీవకారుణ్యము, భూతదయ, పశ్చాత్తాపము, జ్ఞానులయం దెక్కువగనుండును.

ప్రపంచముయావత్తు పరమాత్మస్వరూపముగ తెలిసి కొనినవాడే యథార్థజ్ఞాని. ఏకాగ్రతతోను, ధ్యానముతోను, కూడిన నిష్కామ కర్మయోగమే, భగవంతుని తెలుసుకొను మార్గము. అదియే కర్మానుష్ఠానసిద్ధి.

ధ్యానయోగముతోగూడిన కర్మయోగమునకు యీ క్రింద తెల్పిన అంశములు పూర్వాంగములు. (1) స్థలము. (2) స్థిరమగు ఆసనము. ఆసనమనగా కర చరణాదులను నియ మించుట యని ఒక యర్థము. దర్భాసనమును, దానిపైన గృహస్థులైన జింకచర్మమును, సన్న్యాసులైన వ్యాఘ్రచర్మ

మును, దానిపైన వస్త్రమును, మూడునుకలసి, యేర్పడినది కూడ ఆసనముగా తెలుసుకొనవలెను.

అట్లు ఆసీనులై ప్రాణవాయువులను నియమించుకొన వలయును. అందువలన, మనస్సునకు నిలకడ కలుగును. మనస్సు నిలకడయైన పిదప అట్టి మనస్సును, విషయములందు చారనీయక, భగవంతునియందు ఐక్యము చేయవలయును.

ధ్యానయోగమునకు ఉపాంగములుకూడ గలవు. (1) ఆహారనియమము. (2) మితనిద్ర. యోగాభ్యాసపరునకి ఆహార నిద్రావిహారములు మితముగా నుండవలెను.

మనస్సు పరమాత్మయందు లీనముచేయుటకై తీవ్ర ప్రయత్నము చేయవలెను. ఆనందములలో కెల్ల యెక్కువైన ఆనందము, భగవత్పరము గావింపబడిన, పరిశుద్ధమైన మనస్సుచే గ్రహింపతగినది. దుఃఖయోగ వియోగములు లేనిది అట్టి యానందము. కాన ఆత్మానాత్మ వివేకముతో ఈ ప్రాపంచక దుఃఖమంతయు శరీరగతమని, ఆత్మగతము కాదని గ్రహించి, దుఃఖముకలిగినప్పుడు నిర్వికారముగ నుండుటయే నిజమైన యోగము.

## కామములు రెండువిధములు

(1) స్పర్శజములు, (2) సంకల్పజములు. ధ్యానయోగమునందు ప్రత్యేక వాంఛ లుండకూడదు. విషయాపేక్షనుండి మనస్సును త్రిప్పి, భగవంతునియందు నిలుపవలయును. ప్రాపంచిక విషయములు దోషభూయిష్టములని గమనించిననేకాని, పరమాత్మను ఫలాపేక్షలేక సేవించజాలము. పరమాత్మ మనలను అప్పుడే అన్నివిధముల కాపాడును. సంకల్పజ కామములను పూర్తిగా

విడిచి, క్రమానుసారముగ మనస్సును విషయములనుండి త్రిప్పి, ధైర్యముతో పరమాత్మదాపునకు దానిని చేర్చవలెను. ఇందు వలన యోగులగువారు మనశ్శాంతిని క్రమేపి పొంది, రజోగుణమును జయించి, పాపపుణ్యములను దాటి, బ్రహ్మానందమును పొందుదురు. ఈ విధముగ నభ్యసించు యోగులు ప్రప్రథమనుండు సృష్టికిలోనున్న యావత్తు చరాచరప్రపంచమందు, సమత్వబుద్ధి కలిగియుండవలెను.

ఎట్టి జీవియందును, రాగద్వేషముల నుంచరాదు. తన ప్రాణసమముగా అన్నిప్రాణులను జూచుకొనవలెను. సిద్ధయోగులు, యితరుల సుఖమును, కష్టమును తమదిగా భావింతురు.

జీవుడనేక జన్మలెత్తి, ఆయా జన్మలయందలి, అనుభములవలన కప్పబడియున్నాడు. మనస్సును స్వాధీనమందుంచుకొనమని ఉపదేశించుట సులభమేగాని, అట్లుంచుకొనుట మహాకష్టము.

శ్లో॥ అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్,
అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణచ గృహ్యతే॥ 6 అ. 35
శ్లో॥ అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మేమతిః,
వశ్యాత్మనాతు యతతా శక్యోఽవాప్తు ముపాయతః। 6 అ. 36

అర్జునునిచేత ప్రశ్నింపబడి పరమాత్మ సమాధానమిచ్చుచున్నాడు. అర్జునా! మనస్సును నిగ్రహించుట కష్టమే-అది చంచల మనుట నిస్సందేహము. వైరాగ్యముచేతను, అభ్యాసముచేతను, మనస్సును నిగ్రహింపవచ్చును. అభ్యాస వైరాగ్యములచేత మనస్సును నిల్పలేనివారికి యోగము సిద్ధించదు.

అర్జునా ! సుఖమయినను, దుఃఖమయినను నఖిలభూతములందు నొకే భంగి, సమహితత్వంబున తనయందువలె బరగువానికి యోగము అలవడుటయేగాక, యోగసిద్ధికూడ గల్గును. అంతట అర్జునుడు ధ్యానయోగము పూర్తిగాకమునుపే చని పోవునట్టి యోగభ్రష్టునిగతి యేమని పరమాత్మను ప్రశ్నించెను.

శ్లో॥ కచ్చిన్నోభయ విభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ నశ్యతి,
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి॥ 6 అ. 38

శ్లో॥ ఏతన్మే సంశయంకృష్ణ ఛేత్తు మర్హ స్యశేషతః,
త్వదన్య స్సంశయస్యాస్య ఛేత్తాన హ్యుపపద్యతే॥ 6 అ 39

పరమాత్మ యీ క్రిందతెల్పిన గీతార్థములద్వారా, అర్జునుని సంశయనివారణ చేసినాడు.

యోగభ్రష్టులకు ఇహపరలోకములందు వినాశము వాటిల్లదు. శుభకర్మలు చేయువాడెన్నడును దుర్గతిని పొందడు. యోగసిద్ధి పొందజాలక మరణించువారు, యజ్ఞయాగాది క్రతువులం జేసినవారివలె పుణ్యలోకములపొంది, అనేక సంవత్సరము లచ్చట నివసించి, తదుపరి సదాచారసంపన్నులైన ధనికుల యిండ్లలో, మర్త్యలోకమునందు జన్మించెదరు. అట్లు జన్మించి తమ సర్వస్వమును పరోపకారార్థమై వినియోగించి తరించెదరు. అట్లు కానిచో బుద్ధిశాలురైన యోగుల యిండ్ల యందు జన్మించి, ధనధాన్యసంపదలు లేకున్నను, భక్తియోగా భ్యాస విధానములను, అలవరుచుకొని, తప్పక ముక్తి నొందెదరు.

ఈ జన్మమందు సగముకంటె తక్కువ యోగముచేసి, భ్రష్టులైనవారు మొదటితరగతి ధనికుల యిండ్లయందును,సగము

కంటె యెక్కువ యోగముచేసి భ్రష్టులైనవారు, రెండవతరగతి బీదలైనట్టి యోగుల యిండ్లయందును బుట్టెదరు. అట్టివారు పూర్వజన్మ సువాసనలవలన మంచిపనులు చేయుదురు.

జీవుడు తరించవలయుననిన అనేక జన్మలు కావలయును. ధ్యాన యోగము, కర్మ, తపో, భక్తి, జ్ఞానయోగములకంటె యెక్కువ ప్రబలమైనది. ఇట్టి ధ్యానయోగము చేయువాడు త్తముడు.

ధ్యానయోగమునకు యెట్టిపరికరములు అవసరములేదు. జాతి భేదములేక ప్రతివారును చేయవచ్చును. అందువలన ధ్యానయోగులు చాలా యుత్తమమైన వారని పరమాత్మ తెల్పియున్నాడు.

(1) 1—6 అధ్యాయములతో కర్మషట్కము సంపూర్ణము.

(2) రెండవ షట్కము : భక్తి లేక ఉపాసనషట్కము: 7—12 అధ్యాయములతో సంపూర్ణము.

(3) మూడవ షట్కము : జ్ఞాన షట్కము. 13—18 అధ్యాయములతో సంపూర్ణము. రెండవషట్కమున భక్తిని గురించి చెప్పుటలో, కర్మజ్ఞానములు రెంటికి భక్తి అవసరమను అభిప్రాయము తెల్పబడినది. భక్తిలేని కర్మజ్ఞానములు నిష్ప్రయోజనములు.

శ్లో॥ యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా,
శ్రద్ధావాన్ భజతేయోమాం సమేయుక్తతమో మతః (6 అ 47)

## సారాంశము

బ్రహ్మవిద్యా ప్రాప్తికి త్వంపదార్థజ్ఞానమును, ఆజ్ఞానమునకు కర్మయోగసాధనమును గీతాశాస్త్రమందలి మొదటి ఆరు అధ్యాయములందును శ్రీకృష్ణపరమాత్మ అర్జునున కుపదేశించెను. కర్మ జ్ఞానమునకుగల తారతమ్యమును మొదటి ఆరు అధ్యాయములును విస్పష్టము చేసినవి. రెండవ షట్కమునందు పరమాత్మను భక్తిజ్ఞానమార్గములద్వారా ఉపాసనచేయగల విధము తెలుపబడినది. ప్రకృతిసిద్ధమగు దృష్టాంతముల మూలమున ఆత్మానాత్మ భేదమును, ఆత్మయోగోపాసన చేయగల విధమును యీ అధ్యాయమునందు వివరింపబడియున్నది. ఈ అధ్యాయములు పరతత్త్వ షట్కమనియును, భక్తిషట్కమనియును పిలువబడుచున్నవి. తత్ పదార్థమునకును, త్వంపదార్థమునకును గల యవ్యవహితత్వము, ద్వితీయషట్కమునందు వ్యక్తము చేయబడినది. క్షేత్ర, యజ్ఞ, పరమేశ్వరుల యభేదమును, విజ్ఞానయోగము, విశ్వరూప సందర్శనయోగము మొదలగు యోగసాధన అధ్యాయములందు తెలుపబడినది. త్వం పదార్థము తత్పదార్థజ్ఞానమును బడయుటకు ద్వితీయ షట్కము విజ్ఞానయోగాధ్యాయముతో ప్రారంభమగుచున్నది. విజ్ఞానమన యోగసంసిద్ధమైన ఆత్మజ్ఞానము.

# సప్తమోధ్యాయము

## విజ్ఞానయోగము

మొదటి ఆరు అధ్యాయములందును కర్మయోగ స్వరూప స్వభావములు నిరూపించబడినవి. కర్మయోగమునకు పరమార్థము, బ్రహ్మజ్ఞానపరమైన ఆత్మజ్ఞానమని యుక్తియుక్తముగ తెల్పబడినది. కర్మలు విష్ణూరాధన పరాయణములుగాక, యజ్ఞార్థములైనపుడు ఆత్మజ్ఞానమునకు సాధనములు. కర్మేంద్రియ జ్ఞానేంద్రియ బుద్ధ్యతీతమైన జ్ఞానమునకు విజ్ఞానమని పేరు. ఆ విజ్ఞానము ప్రకృతిదృష్టాంతరూపమున విజ్ఞానయోగమున వివిధవిధముల విశదము చేయబడినది. ఓంకారముతో నారంభమైన సృష్టి పరిణామమునందు, సర్వమును బ్రహ్మమనియు, బ్రహ్మాంతర్గతమనియు, బ్రహ్మవిద్యా సాధ్యమైనసర్వాత్మత్వ ప్రత్యభిజ్ఞానమని విజ్ఞానయోగము తెల్పుచున్నది.

ధ్యానమునకు మూలసూత్రము ప్రేమ. ఒక వస్తువు వలన నష్టముకంటె లాభమెక్కువ యున్నదని తెలిసినప్పుడు దానియందు మనకు ప్రేమకలుగును. పరమాత్మకు జీవునకుగల సంబంధము తెలిసినయెడల, పరమాత్మ కనపడక పోయినను, పరమాత్మను ధ్యానించెదము. అట్టిధ్యానమునం దంతర్గతమై యున్న భక్తినిగురించి రెండవషట్కములో చెప్పబడినది. అందు మొదటి అధ్యాయము విజ్ఞానయోగము.

పరమాత్మను పూర్తిగ తెలుసుకొనినచో మానవజన్మ సఫలమగును. పరమాత్మవిషయ మెంత తెలిసికొనిన యింకను తెలియబడవలసిన విషయములుండును.

జ్ఞానమను చెట్టునకు విజ్ఞానము వేరువంటిది. జ్ఞాని దానిని గట్టిగా పట్టుకొనవలయును. బ్రహ్మజ్ఞానముగలవారు పండితులు గాకున్నను, సర్వజ్ఞులని తెలియవలెను. బ్రహ్మ జ్ఞానము జ్ఞానమున కంతకును కేంద్రస్థానము. ప్రాణస్థానము.

భక్తి, జ్ఞానము, తపస్సు, అను సోపానత్రయము ద్వారా బ్రహ్మ సాక్షాత్కారము గలుగును. జన్మ పరంపరలవల్లగాని మానవునకు భగవద్ధ్యాననిష్ఠ కుదురదు.

ప్రపంచమున గోచరించు ప్రతివస్తువునకు మూడు ముఖ్య ఆధారములుగలవు. (1) ఉపాదానకారణము. (2) నిమిత్త కారణము. (3) ఈశ్వరానుగ్రహము. ప్రకృతులు ద్వివిధము: (1) జడప్రకృతి. (2) చేతన ప్రకృతి. జడప్రకృతి ఎనిమిదివిధము లుగ నుండును. (1) భూమి, (2) ఉదకము, (3) అగ్ని, (4) వాయువు, (5) ఆకాశము, యివి పంచభూతములు. (6) అహంకారము (7) మనస్సు, (8) బుద్ధి మొత్తము ఎనిమిది. పంచభూతములయిదు జడ ప్రకృతిలక్షణములు. ఇవి స్థూలశరీరమునకు కారణములు. మిగతా మూడును సూక్ష్మశరీరమునకు ముఖ్యకారణములు.

(1) అహంకారము:- నేను అనుచు వ్యవహరించుటయే అహంకారముయొక్క మొదటి స్వరూపము.

(2) మనస్సు:- సంకల్ప వికల్పములతో కూడినది. (Doubting nature)

(కి) బుద్ధి:- స్థిరత్వమును కలిగించునది. దీనికి చిత్త మను పేరుగూడ గలదు.

(Determinative factor)

2. చేతన ప్రకృతి:— జడప్రకృతిని ప్రేరేపించి పనులు చేయించునట్టి శక్తిగలది. జీవత్వముచేతన ప్రకృతి.

ఒకదారమందు అనేక పూసలు గ్రుచ్చబడిన విధముగ ప్రపంచమందలి అన్నివస్తువులకు పరమాత్మ సూత్రధారిగా నున్నాడు. కనుక పరమాత్మను ప్రపంచమందలి అన్నివస్తువు లకు సంధానకర్తగా గుర్తెరుగవలెను.

భక్తి పరిపక్వమైన మానవులకు మంచి చెడుగుల రెంటి యందును పరమాత్మ కానవచ్చుచుండును. ప్రపంచమందలి వస్తు సముదాయమంతయు మంచి చెడుగుల మిశ్రమము. విచక్షణలేక సూర్యకాంతి లోకమంతటా ప్రసరించుట విదితమైనవిషయము. అటులే పరమాత్మ మంచి చెడు అను భేదభావములేక, సమస్త వస్తుజాలమందును ఆవిర్భవించి యున్నాడని తెలియగలరు. ప్రకృతి (మాయ) మానవులను కప్పియున్నందున పరమాత్మను దెలుసుకొన లేకున్నారు. అతీతశక్తిగల మాయకూడా (ప్రకృతి) పరమాత్మకులోబడి యుండును. కనుక మానవులు మృత్యు సంసార సముద్రమును దాటుటకు పరమాత్మను భజించ వలెను. అపుడుమాయను పూర్తిగా జయించి సంసార సముద్ర మును దాటగలరు.

జ్ఞానియందు పక్వ అహంకారము నిలిచియుండును. ఆయనయందుగల జ్ఞానవిశేషమువల్ల పరమాత్మను తెలుసు కొని ముక్తిని బడయగలనని తలంచుట జ్ఞానియొక్క యహం

భావ స్వభావమైయున్నది. భక్తునికి యెంతమాత్రము అహం భావముండదు. పరమాత్మను నిశ్చల భక్తిశ్రద్ధలతో భజించి పరమాత్మకంటె అన్యములేదని గట్టినమ్మకము గలవాడై అట్టి పరమాత్మను సర్వకాల సర్వావస్థలయందు పూజించి తరించుటయే అతని ప్రయత్నము. కనుక జ్ఞానముకన్న భక్తియే ముఖ్యమైనదని, సులభసాధ్యమని అనేకుల అభిప్రాయము.

జ్ఞానమార్గము : "మర్కట కిశోరన్యాయము" అనునొక న్యాయము లోకప్రసిద్ధము. అనగా కోతిపిల్ల తన తల్లి కడుపును యెంతజాగ్రత్తగా పట్టుకొనగలదో, అది అంత క్షేమముగా నుండును. తల్లి కోతి తనపిల్ల, క్షేమమునిమిత్తము తనపై ఆధారపడియున్నదని యెంతమాత్రము తలంచదు. ఆవిధముగా జ్ఞానికాగోరువాడు జ్ఞానము కల్గునిమిత్తము, తరించు నిమిత్తము స్వకృషిమీదనే ఆధారపడును. కాని పరమాత్మపై యెంత మాత్రము ఆధారపడడు.

భక్తిమార్గము : "మార్జాల కిశోరన్యాయము" అనునది మరొకన్యాయము. పిల్లి తనపిల్లను యెంతజాగ్రత్తగా పోషించి కాపాడునో, ఆవిధముగానే భక్తులయొక్క యోగ, క్షేమములకు పరమాత్మ పూచీపడును. పరమాత్మ భక్తులయొక్క బాధ్యతవహించి యెల్లప్పుడు కాపాడుచుండునని తెలియవలెను.

ప్రకృతి : (మాయ) రెండువిధములు. (1) శుద్ధప్రకృతి, (2) అశుద్ధ ప్రకృతి. శుద్ధమాయ, జ్ఞానులను భక్తులను కాపాడును. జ్ఞానులు, భక్తులు– వీరిద్దరిలో భక్తులకే అగ్రస్థానము యివ్వబడినది. జ్ఞాని తనకుగల జ్ఞానమువలన భగవంతుని అన్వేషించుచు కాలము గడుపుచుండును. భక్తుడు భక్తితో

పరమాత్మను త్రికరణశుద్ధిగా నమ్మిపూజించును. ఎట్టిప్రమాదములేక భక్తుడు పరమాత్మను త్వరలో చేరగలడు.

ప్రపంచము అశాశ్వతమనియు, ప్రపంచమందు శాశ్వత సుఖములేదనియు దృఢముగా దెలుసుకొని మాయాప్రపంచమును దాటుటకు పరమౌషధము, పరమాత్మయందు నిశ్చలమైన భక్తిగలిగియుండుటయే యని తెలియవలెను.

భగవంతుని భజించుటకు, జాతి మతభేదములు, ఆటంకములుకావు. అన్ని జాతులవారు, ధూమ శకటములు, మొదలగు వాటిమీద ప్రయాణముచేసి తమ గమ్యస్థానమును జేరులాగున భగవత్ సాన్నిధ్యమను గమ్యస్థానము జేరుటకు, మానవులు, పరమాత్మను వారి మతాచారప్రకారము భజించుటకు అవకాశము గలదు. భగవంతుని యెప్పుడును, భజించని జనులుందురు. వారిలో కొందరు మహాపాపులు, మరికొందరు అచ్చపు చీకటియను అజ్ఞానమునకులోనైన మూఢులు, పాపభీతిలేక జీవించువారు. అహిత కృత్యములుచేయువారు నరరూపముం దాల్చిన రాక్షసాధములు.

భగవంతుని పూజించువారు, నాల్గురకములుగా నుందురు. (1) ఆర్తులు– (2) జిజ్ఞాసువులు– (3) అర్థార్థులు– (4) జ్ఞానులు– వీరి నలుగురిలో జ్ఞాని మిగుల శ్రేష్టుడు. మిగతా ముగ్గురు కామబీజముతో భగవంతుని ఆరాధింతురు. వారి సంకల్పము నెరవేరినంతనే వారికిగల భగవద్భక్తి నశించును. ఫలాపేక్షతో– భగవంతుని భజించువారికి సాధనముకన్న సాధ్యమెక్కువ. అనగా భగవంతునిచేరవలెనను కోరిక యెక్కువ. జ్ఞానికి, సాధనము, సాధ్యము వేరుకాదు. ఫలాపేక్షలేక– జ్ఞాని

భగవంతునిని భజించును. కనుక జ్ఞానులు పరమాత్మను ఆత్మ సమానులు. మిగతామనుష్యులు భగవంతునికి శరీరసమానులు. జ్ఞానియగువాడు, చరాచర ప్రపంచమంతయు పరమాత్మ స్వరూపమని రూఢిగా తెలుసుకొనును. మానవునకు జన్మ పరంపరవల్ల గాని విజ్ఞానము కలుగదు. ప్రారబ్ధానుసారముగ మానవులు వారివారి యిష్టప్రకారం అన్యదేవతలను కొల్చెదరు. ప్రత్యేక దేవతారాధనవలన మానవుల కోరికలు నెరవేరగలవు. అన్యదేవతలందరు పరమాత్మయొక్క అవయవములు. పరమాత్మయొక్క అనంతశక్తులు ఒక్కొక్క దేవతగా మానవులచే ఆరాధింపబడుచున్నవి. అట్టి పూజలు సల్పు భక్తులకు ఆయా పూజల కనుగుణ్యమైన ఫలము లభించుచున్నది. అన్యదేవతలను పరమాత్మకన్న వేరుగా భావించి, మానవులు, పూజలు సల్పినయెడల అట్టి భగవత్ పూజలు, నిష్ఫలములని తెలియవలెను.

ప్రస్తుతకాలమందు దినక్రమేణా మానవులయందు భగవత్ భక్తి క్షీణించి, నాస్తికవాదము పెరుగుచున్నది. ఇందువల్ల కలుగు అనర్థములను మానవులు గుర్తించుటలేదు. మానవునికి అనర్థములు రెండు. (1) ముసలితనము (2) మరణము. ఇట్టి లక్షణములకు లోనైన పాంచభౌతికశరీరముమీద భ్రాంతి వదలి, పరమాత్మను భజించి ముక్తిబడయుటయే మానవుని కర్తవ్యము. దేహధారియైన మానవునకు పైన తెల్పిన అనర్థములు తప్పవు. కనుక దేహప్రాప్తిలేకుండుటకు మానవుడు (1) బ్రహ్మ (2) కర్మ (3) అధిభూతము (4) అధియజ్ఞము (5) అధ్యాత్మము (6) అధిదైవము (7) ప్రయాణ

సమయమందు భగవంతుని స్మరించుట – యీ 7 విషయములను బాగుగ పరిశీలించి భగవత్పరముగ తెలిసికొనవలెను. అంత వనుక శరీర అభిమాన రాహిత్యము మానవునకు కలుగ నేరదు. ఈ పై విషయములు– ఎనిమిదవ అధ్యాయమందు పూర్తిగ వివరించబడినవి.

## సారాంశము

శ్లో॥ చతుర్విధా భజంతేమాం జనాఃసుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ॥ 7 అ. 16

అహంపదార్థతత్వ విచారము, జిజ్ఞాసకు బీజము. అష్ట ప్రకృతులు "నేను, నాది" అను సమ్మోహమును ప్రవృత్తియందు నిరంతరము కలుగజేయుచున్నవి. అష్టప్రకృతుల కతీతమైన పరాప్రకృతి, జిజ్ఞాసకు కీలకము. సర్వాధారమైన పరాప్రకృతి జగత్తునకు మూలాధారము. పరాప్రకృతి జలమునందు రసము, చంద్రసూర్యులందు కాంతి, వేదములందు ప్రణవము, పురుషులందు పౌరుషము, మొదలగు రూపములలో అంతర్లీనమై యున్నది. అహం పదార్థము పరా పర ప్రకృతులను తెలుసుకొనుటకు మూలాధారము. సుకృతులైన ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు, ఆత్మజ్ఞాన పరాయణులై యుందురు. ఆత్మజ్ఞానసాధకులయందు జ్ఞాని ఉత్తమ సాధకుడు. బ్రహ్మాత్మలైన జ్ఞాన విజ్ఞానుల తత్త్వ జిజ్ఞాస, ప్రకృతి విలసితమైన తత్త్వమును, తత్త్వమూలమైన రసమును, తదాధారమైన పరాశక్తిని స్మరింపజేయుచున్నది. "నేను పదార్థ"మైన ఆత్మానాత్మ వివేకము, విజ్ఞానము, ఈ అధ్యాయమునందు విశదీకరించబడినది.

# అష్టమాధ్యాయము

## అక్షర పరబ్రహ్మయోగము

ఏడవ యధ్యాయమునందు యోగమునకు సాధనభూతమైన ఆత్మతత్త్వ ముపదేశింపబడినది. ఆత్మయోగము బ్రహ్మవిద్యామూలముననే సాధ్యమగుచున్నది. విజ్ఞానయోగమునందు బ్రహ్మజ్ఞానము బ్రహ్మప్రాప్తికి సాధనముగ నుపయోగింపబడినది. ఏడవ యధ్యాయాంతమందు దెలుపబడిన అధ్యాత్మము, అధిభూతము, అధిదైవము, అధియజ్ఞము, బ్రహ్మము, కర్మము మొదలగు బ్రహ్మవిద్యా సాధనము లీయధ్యాయమునందు గలవు. అట్టి సాధనములు విశేషరూపమున బోధింపబడుచున్నవి. అర్జునునికి బ్రహ్మవిద్యాంగము లన్నియును నిశ్చయాత్మక జ్ఞానమును కలుగచేయుటకును, సమ్మోహమును పోగొట్టుటకును వినియోగపడుచున్నవి.

పరమాత్మ అర్జునునకు నిశ్చయాత్మకమైన బ్రహ్మజ్ఞానమును అక్షర పరబ్రహ్మ యోగరూపమున నీయధ్యాయమునందు తెలుపుచున్నాడు. భగవద్గీతా సిద్ధాంతములకు జరామరణములు కీలకము. జనన మరణరూపమయిన సంసారమున కాద్యంతములు కనుపడవు. "క్రియా శరీరోద్భవహేతురాదృతా"—కర్మము జన్మమునకు మూలకారణము. కర్మత్యాగము మోక్షమునకు సాధనము. నిరంతరము కర్మనిమగ్నుడైన జీవునకు కర్మత్యాగ మెటులసాధ్యమో తెలుసుకొనుటదుష్కరము.

సుప్రసిద్ధ గీతావ్యాఖ్యాతలందరును యేదోవిధముగ

వారి సిద్ధాంతముల కనుగుణ్యముగ నీ విషయములను సమన్వయించిరి.

ఏడవయధ్యాయాంతమందు "ప్రయాణకాలేఽపిచ మాం తేవిదు ర్యుక్త చేతసః" అని గీతాశాస్త్రము బోధించుచున్నది.

ఆజన్మాంతము కర్మలంపటులైనవారు మరణకాలమందు ఆత్మయోగులై మోక్షమును పొందుటసాధ్యమా యను సందేహము పండితులను సైతము బాధించుచుండును. కర్మబంధము నశించుటకు కొంతకాలము కావలసియున్నది. యోగి, ఆత్మయోగి అగునప్పుడే కర్మబంధము నశించిపోవుచున్నది. ఆత్మయోగలక్షణము ఈ అధ్యాయమునందు పూర్తిగా తెలియగలదు.

బ్రహ్మము, అధ్యాత్మము, కర్మము, అధిభూతము, అధిదైవము అనగా నేమో యీ దిగువ విశదీకరించబడినది.

(1) బ్రహ్మము : నిరతిశయమును నాశరహితమైనదియును అగు సత్పదార్థము.

(2) అధ్యాత్మము : బ్రహ్మముయొక్క ప్రత్యగాత్మ (జీవ)భావము అధ్యాత్మ మనబడుచున్నది.

(3) కర్మము : భూతముల స్వభావ స్వరూపములను గలిగించు విసర్గము కర్మమనబడుచున్నది. అక్షరం అనగా నాశరహితమైనది. పరమాత్మయొక్క స్వభావము ప్రతిశరీరము నందును ప్రత్యగాత్మగా ప్రకటితమగునని తెలియవలెను. ప్రకృతి బంధముగలదిగా తెలియవలెను. విసర్గ, భూతముల పుట్టుకకు కారణమగునదిగా తెలియవలెను.

(4) అధిభూతము : నశించెడి స్వభావముగల దేహము.

(5) అధిదైవము : ఇంద్రియములకు శక్తిని కలుగజేయు హిరణ్యగర్భుడు.

(6) అధియజ్ఞము : యజ్ఞపురుషుడగు శ్రీమన్మహావిష్ణువు. ఈయననే అధిదైవముగాను, పరమాత్మ స్వరూపముగాను తెలియవలెను.

ఎట్టి పాపములకులోనైన మానవుడైనను ప్రాణ ప్రయాణకాలమందు పరమాత్మను స్మరించుచో అతడు నిస్సందేహముగా పరమాత్మభావమును పొందును. అంత్యకాలమందు మానవుడు యేభావముతో శరీరమును విడుచునో సర్వదా తలంచిన ఆభావమునే అతడు పొందును.

అవసాన కాలమునందు జీవితమున కభ్యస్తమైన కోరికయే మానవులకు స్మరణకు వచ్చుట ప్రకృతిధర్మము. బ్రహ్మవిద్యోపాసనమును జీవితమునం దెల్లప్పుడు చేసినవానికే, అంత్యకాలమునందు పరమాత్మ స్మరణ సాధ్యమగును.

మానవుడు సర్వకాల సర్వావస్థలయందును పరమాత్మ స్మరణ విడువక చేయుచుండిన అంత్యకాలమునగూడ పరమాత్మ స్మరణ తప్పక చేయగలడు. కనుక మానవుడు మనస్సును విషయలంపటయందు చొరనీయక పరమాత్మయందే నిల్పి పరమాత్మయొక్క గుణగణములను గమనించి వైరాగ్యము, భక్తి శ్రద్ధలను బడయవలయును. ఎప్పుడు పరమాత్మయందు మానవుని మనస్సు లగ్నమగునో, అప్పుడు ప్రాపంచిక విషయములందు విరక్తి కలుగును. పరమాత్మయందు భక్తి ప్రపంచమందు విరక్తి – ఇదియే వేదాంతసారము.

"కర్త రాజ్ఞయా, ప్రాప్యతేఫలం, కర్మకింపరం, కర్మ తజ్జడం" జడస్వరూపమగు కర్మ ఫలమును స్వతంత్రముగ నొసంగజాలదు. కర్మసాక్షియగు పరమాత్మ కర్మానుగుణ్యముగ మానవులకు ఫలములనిచ్చును.

పరమాత్మ అచ్యుతుడను నామధేయముగలవాడు. కాన తనను చేరి భజించు భక్తులను సంసారబంధమునుండి తప్పించును. అన్యదేవతలందరు కాలమునకు వశీకృతులై యున్నారు. పరమాత్మను కాలాతీతునిగా నెఱుగవలయును.

అహంకార మమకారముల వదలిపెట్టిన మానవులు ఉత్తరాయణకాలమందు ఉత్క్రమణగతిని పొందుదురు. తదితరులు దక్షిణాయణకాలమందు ఉత్క్రాంతిని పొందుదురు. ఫలాపేక్షతో కర్మల నాచరించు మానవులు, దక్షిణాయణమునందు కృష్ణపక్షమున మరణించి చంద్రమండల ప్రాప్తిని పొంది, తిరిగి భూలోకమునందు కర్మానుసారముగ మాతృగర్భమున ప్రవేశించి జన్మించెదరు. శుక్లగతియందు ఉత్తరాయణమున మృతినొందిన వారికి మాతృగర్భ ప్రవేశములేదు.

భగవంతునియందు నిశ్చల భక్తి లేకుండ మానవుడు చేయు యజ్ఞ, యాగాదిక్రతువులుగాని, వేదాధ్యయనముగాని, తపస్సుగాని, నిష్ఫలము. పరమాత్మయందలి నిశ్చల భక్తి మానవుని తరింపజేయును. మానవునకు మంచిగుణము లున్నను, పరమాత్మయందు భక్తిలేనివాడైనచో తరించడు. సత్ప్రవర్తన, భక్తి మానవునకు ముఖ్యముగా నుండవలసిన లక్షణములని తెలియవలెను. భక్తిగలిగి మానవుడు కర్మానుష్ఠానము చేసినయెడల మోక్షసామ్రాజ్యమును పొందగలడు.

ఇట్టి భక్తిమార్గమును పరమాత్మ అర్జునునకు ఈ అధ్యాయము నందు సుబోధము జేసియున్నాడు.

సారాంశము

ఈ అధ్యాయమునందు అక్షర పరబ్రహ్మవిషయము తెలుపబడినది. విద్యలయందు బ్రహ్మవిద్య ఉత్తమము. అట్టి యుత్తమవిద్యయే గీతాశాస్త్రమునకు ప్రాప్యవిషయము. దానిని యోగశాస్త్రసాధనములవలన పొందగలవిధమీ యధ్యాయమునందు తిరిగి తెలుపబడినది. బ్రహ్మవిద్యయే రాజవిద్య.

దేహమునందలి సహస్రారమునందు ప్రణవసాధనము ద్వారా ఆత్మయోగ మభ్యసించవలసిన విధము యిందు తెలుప బడినది. విషయాంగములైన అధ్యాత్మము, కర్మ, అధిభూతము, అధియజ్ఞము, మోక్షమార్గము మొదలగునవికూడా తెలుప బడినవి.

ప్రధాన విషయమైన బ్రహ్మవిద్యాప్రాప్తికిగాను అక్షర పరబ్రహ్మయోగము వేదాంత విజ్ఞానమునందు అతిముఖ్యమైన యోగము. అక్షరము, శబ్దరూపమున సమస్త ప్రపంచమును సువ్యక్తము చేయుచున్నది. పూర్వమీమాంసకులు శబ్దప్రమా ణులు. వేద వేదాంగములందుగల ప్రమాణముల ననుసరించి సకలకర్మలను ఆచరించెడివారు. కాని కాలక్రమమున అనంత మైన శబ్దబ్రహ్మమును అతిక్రమించి, వారు అక్షర పరబ్రహ్మ యోగాభ్యాసమును చేయుట కుపక్రమించిరి.

# నవమోధ్యాయము

## రాజవిద్యా రాజగుహ్యాయోగము

ఆత్మజ్ఞానమును తిరిగి ఉపదేశించు నిమిత్తం రాజవిద్యా రాజగుహ్యా యోగము ప్రారంభించబడ్డమైనది. ఈ అధ్యాయము ప్రత్యక్షముగనున్న ప్రకృతి ఉపమానములచేత ఆత్మజ్ఞానము నుపదేశించుచున్నది. చరాచరప్రపంచమున వ్యాపకమైన వాయువు ఆకాశమునందు నిలిచియున్నటుల, విశ్వమంతయును భగవదధీనమునందు నిలిచియున్నది. సర్వభూతములును కల్పాదిని బుట్టుచు, కల్పాంతమందు నశించుచున్నవి. భగవంతుడు మాత్రము నిత్యుడు. భగవత్ జ్ఞానమునకుగాను, యజ్ఞయాగాది రూపమునను, భక్తి జ్ఞాన వైరాగ్యరూపమునను మానవులు పరమాత్మ నారాధించుచున్నారు. అట్టి భక్తులకు కర్మానుభవ రూపమైన ఫలము కల్గుచున్నది. జాతి వివక్షతలేక భక్తులు మోక్షమును పొందుచున్నారు. అనిత్యములైన దేహేంద్రియ విషయారాధనలను ఆత్మజ్ఞానులు విసర్జించి నిత్యమైన ఆత్మ యోగమునందు నిమగ్నులై మోక్షమును పొందుచున్నారు.

అర్జునుడు శ్రీకృష్ణుని ఆత్మజ్ఞాన వివరములను అడుగక పూర్వమే కృష్ణపరమాత్మ అర్జునునిమీద కటాక్షముచేత, ఆత్మ జ్ఞానమును తిరిగి యీ అధ్యాయమున బోధించుచున్నాడు. మానవులందు ఓర్వలేనితనము (అసూయ) ముఖ్యముగా నుండ కూడదు. అట్టివారు వేదాంతోపదేశమును బడయుటకుతగరు. ఎన్ని మంచిగుణములు మానవునియందున్నను ఒక్క అసూయ

గుణమున్నచో మంచిగుణములన్నియు నశించిపోవును. ఈశ్వర సేవ, గురు శుశ్రూష, ఓర్పు లేనివారికి గీతోపదేశము చేయ కూడదని పరమాత్మ సెలవిచ్చియున్నాడు.

పరిశుద్ధమైన ఆత్మ, అనిత్యమైన పాంచభౌతిక శరీరము నందు ప్రవేశించుటయే గొప్పనష్టము. ఆత్మకుశరీర సంధానము లేకుండ చేయుటకు, జ్ఞాన విజ్ఞానములు – మానవునికత్యంత అవసరము.

వేదాంతవిద్య రాజవిద్యయని తెలియవలెను. రాజు మానవులలో శ్రేష్టుడు. అట్లే అన్నివిద్యలలోను వేదాంత విద్య శ్రేష్టమైనది. రాజగుహ్యం అనగా రహస్యములలో మిక్కిలి రహస్యమైనది. రహస్యమనగా ముఖ్యముగం తెలుసుకో వలసినది. పవిత్రమైనది. అందరిని పరిశుద్ధులను చేయునది వేదాంతవిద్య. వేదాంతవిద్యవల్ల ఆత్మ పరమాత్మలను ప్రత్యక్ష మగునట్లు చేసుకొనవచ్చును. వేదాంతవిద్య నభ్యసించి, దాని యందు చెప్పినప్రకారము అనుష్ఠానము చేయవలెను. ఇట్టి పవిత్రమైన బ్రహ్మవిద్యలో యెవనికి శ్రద్ధలేదో, అట్టివాడు ధర్మానుష్ఠానమునుచేసి మోక్షమును పొందజాలడు. అట్టివారు జనన మరణావర్తులకులోనై కష్టపరంపరల పాలగునుగాని, యేమాత్రము సుఖమును బడయలేరు. ఇట్టి అనర్థపరంపరలకు మానవులు లోనగుటకంటె వేదాంతవిద్యను గురుశుశ్రూషచేసి తెలుసుకొని, విజ్ఞానమునుపొంది, మోక్షపదవిచేరుట శ్రేయస్కరము. ఈ చరాచరాత్మకమైన ప్రపంచమంతటను పరమాత్మ ఆవిర్భవించియున్నాడు. పరమాత్మ సకలవస్తువులయందున్నప్ప టికి, వస్తువులయొక్క గుణదోషములు పరమాత్మను యెంత

మాత్రము అంటజాలవు. మానవులుచేయు త్రివిధాత్మకమైన కర్మలు జీవునకే అంటునేకాని, పరమాత్మకు అంటవు. పరమాత్మ యందు మనము యిమిడియున్నామని, ఆయన మన సకల వ్యాపారములను గమనించుచున్నాడని, మనము పూర్తిగా గ్రహించ గలిగినపుడు జీవయాత్ర సుఖముగా జరుగును. ఇట్టి భావమును పొందిన మానవుడు బ్రహ్మభావనబొందుచున్నాడు. కనుక మానవులలో పరమాత్మ యిమిడియున్నను బ్రహ్మ భావము లేనివారు పరమాత్మలోచేరి యుండజాలరు. ఆకా శము అన్నివస్తువులలో కనుపించుచున్నను, వస్తుగుణదోషములు ఆకాశమును యెటుల నంటవో, తద్విధముగ పరమాత్మ ప్రపంచమంతట వ్యాపించియున్నను, చరాచరాత్మకమైన జీవ జాలము పరమాత్మ నంటజాలదు.

నిర్లేపత్వము. సూక్ష్మత్వము, సర్వవ్యాపకత్వము, పరమాత్మకు గలవు. అటులనే ఆకాశమునకుగూడ పై లక్ష ణములు గలవు. కనుక ఆకాశమును పరమాత్మతో పోల్చుట మయినది. పరమాత్మ అధీనములోనున్న మాయ (ప్రకృతి) జడప్రకృతితో చేరి సమస్త సృష్టిని చిత్రవిచిత్రముగ చేయు చున్నది.

మానవులు వారివారి కర్మానుసారము పరమాత్మవల్ల సృష్టింపబడుచున్నారు. పక్షపాతము, వైషమ్యము, నైర్ఘృ ణ్యము మొదలగు దోషములు పరమాత్మయందు లేవు. కనుక మానవులకు సంభవించెడి జన్మ మార్పులకు పరమాత్మ కారణభూతుడుకాడు. పరమాత్మను కర్మసాక్షిగను, ఫలదాత గను, గుర్తెరుగవలయును. మూర్ఖులగు మానవులు, పరమాత్మ

యందు జారత్వ, చోరత్వ, దోషములు ఆరోపించుచున్నారు. జ్ఞానులు, పరమాత్మయొక్క పరతత్త్వమును గుర్తెరిగి, యావత్ప్రపంచచర్యలు, పరమాత్మలీలలుగా భావించుచున్నారు.

వ్యర్థమైన కోరికలు గలవారును, వ్యర్థమైన కర్మలు జేసెడివారును, అజ్ఞానులును, అవివేకులును రాక్షససంబంధమును, సమ్మోహకరమును అయిన ప్రకృతికి లోబడుచున్నారు.

మహాత్ములైన మానవులు జ్ఞానయజ్ఞముచేత, పరమాత్మ విశ్వాత్మకుడనియు, ఏకస్వరూపుడనియు, బహురూపుడనియు, గుర్తెరిగి పలువిధములుగ ఆయనను పూజించుచున్నారు.

క్రతువు, యజ్ఞము, పితృపిండము, ఔషధము, మంత్రము, హవిస్సు, అగ్నిహోత్రము, హోమము, సత్కర్మ పరమాత్మస్వరూపముగ దెలియవలెను.

జగత్తునకు, తండ్రి, తల్లి, సృష్టికర్త ఆయనయే నని తెలియవలెను. బ్రహ్మ, ప్రణవము, మూడువేదములు, పరమాత్మయొక్క విభూతులని తెలియవలెను.

జగత్తుయొక్క సృష్టి, స్థితి లయములకు పరమాత్మయే మూలబీజముగాకూడ గుర్తెరుగవలయును.

ప్రపంచమందు సంభవించెడి శీతోష్ణములు, అతివృష్టి, అనావృష్టులు, జనన మరణములు పరమాత్మయొక్క విభూతులని తెలియవలెను. వేదాధ్యయనపరులు యజ్ఞములచేత పరమాత్మను పూజించి సోమపానముచేసి పాపవిముక్తులై స్వర్గస్థితిని పొందుచున్నారు.

వైదిక కర్మానుష్ఠానపరులు వారి పుణ్యముల ననుసరించి స్వర్గమునందు సౌఖ్యము ననుభవించి, పుణ్యము క్షీణించిన వెనుక తిరిగి మానవజన్మ మెత్తెదరు. ఈ రీతిగా కర్మపరాయణులు వారి కోరికల ఫలముల ననుభవించుచు రాకపోకలుగల, జననమరణముల పాలగుచున్నారు.

మానవులు ఏకాగ్రచిత్తముతో, పరమాత్మను చింతించి సేవించినయెడల వారు పరమాత్మయం దభియుక్తులై పరమాత్మ కటాక్షమును బడయగలరు.

మానవులు, ఇతర దేవతలను భక్తితో పూజించినవారు సైతము పరమాత్మను అవిధిపూర్వకముగా పూజించినవారగుచున్నారు. అవిధిపూర్వకమనగా అజ్ఞానముతోనని తెలియవలెను.

పరమాత్మ యజ్ఞకర్తయని గుర్తెరుగక, యజ్ఞము చేయువారు జననమరణావస్థలను పొందుచున్నారు. మానవులే భావముతో పరమాత్మ నారాధించునో, ఆ భావార్థరూపమైన ఫలము కలుగుచున్నది. ఆత్మయోగారాధనము నిత్యమైన బ్రహ్మవిద్యను, ఆత్మేతరారాధన మనిత్యమైన యిహఫలమును సమకూర్చును.

మానవులు త్రికరణశుద్ధి కలిగి ఫలము, పుష్పము, పండు, ఉదకము, పరమాత్మకు సమర్పించిన, అట్టి ఫలపత్రాదులను పరమాత్మ ఆరగించును. కనుక మానవుడు భుజించెడి ఆహారమును, చేసెడి హోమములను, ఆచరించెడి తపస్సులను, యిచ్చెడి దానములను, పరమాత్మార్పణముగ చేయవలెను.

# గీతామృత సార సంగ్రహము

దేహేంద్రియాది కృతమగు సమస్తకర్మలను మానవులు ఆత్మార్పణముగ చేయవలయును. ఈరీతిని కర్మలను పరమాత్మకు అర్పణము చేసినవారు పుణ్యాపాపములకు మూలమగు కర్మబంధములనుండి విడువబడి, విముక్తులై పరమాత్మను పొందగలరు.

నిష్కామ కర్మయోగి కర్మల నాత్మార్పణముగ జేయుచు కర్మబంధము లేకుండ విముక్తుడగుచున్నాడు.

మానవులు భక్తితో పరమాత్మను పూజించినచో సర్వభూతములయందును సమముగనున్న పరమాత్మకు యిష్టులు కాగలరు. అట్టివారియందు పరమాత్మ యెల్లప్పుడును ఆవిర్భవించి యుండును.

ఆత్మ సకలభూతములయందు సమముగానుండును. అట్టి ఆత్మకు యిష్టా నిష్టములు లేవు. ఏ భూత మాత్మయం దనన్యమైన భక్తిని గలిగియుండునో ఆభూతమునం దాత్మ ప్రకాశము కలుగును. ఆత్మ ప్రకాశముగల మానవులు మహాత్ములని తెలియవలెను.

మిగుల దురాచారపరుడైన మానవుడు యితరమగు దేవతలను భజింపక సమాహిత చిత్తముతో పరమాత్మను సేవించుచున్న యెడల అట్టివానిని సాధువుగా తెలియవలెను.

ఆత్మయోగ పరాయణులకు సామాన్యాచారములు ప్రతిబంధకములుగావు. ఉత్తమ యోగక్రమము నందు సామాన్య ధర్మములన్నియు భగవత్పరముగ ఉపరతిని కలిగించుచున్నవి. మరియు ఆత్మధ్యానపరాయణుడు శీఘ్రముగ ఆత్మధర్మజ్ఞుడై దేహానంతరము స్థిరమైన శాంతిని బొందుచు పర

మాత్మయొక్క కటాక్షమువలన నాశనము నెరుగని సుస్థితిని బడయునని తెలియవలెను.

పాపపు జన్మనెత్తినవారును, స్త్రీలును, వైశ్యులును, శూద్రులును పరమాత్మను సమాహితచిత్తముతోను, భక్తితోను నమ్మి, ఆశ్రయించి, భజించినచో మోక్షపదమునుపొంద గలరనుట నిస్సందేహము.

ఆత్మయోగమే మహాపాపులకును, తదితరులకును, జాతి, మత, కులభేదములేని తరణోపాయమని తెలియవలెను. పాపాత్ములుకూడ నిశ్చలభక్తిగలవారై మోక్షమును బొందు నపుడు పుణ్యాత్ములును, భక్తులును అయిన బ్రాహ్మణులను రాజర్షులను గురించి యేమి చెప్పవలయును? కనుక ఇహలోక సుఖములను వాంఛించక భగవంతుని భక్తి విశ్వాసములతో భజించి ముక్తులు గావలెను.

ఆత్మభక్తియే ముక్తికి కారణమైనపుడు ఆత్మానుభవము గల యోగులు ముక్తులగుదురని ప్రత్యేకించి చెప్పనవసరము లేదు. కనుక మానవులు ఆత్మానుభవమునుపొంది ఆత్మయోగా రూఢులై కృతార్థులు కాగలరు.

ఆత్మసంయమ యోగాధ్యాయమునందలి యీక్రింద తెల్పిన శ్లోకరీత్యా పరిస్ఫుటము చేయబడిన భావమును తెలుసు కొనుట అవసరము.

శ్లో॥ యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా,
శ్రద్ధావాన్ భజతే యోమాం సమే యుక్తతమో మతః॥ 6 అ 47.

మానవుడు మనస్సును పరమాత్మయందునిల్పి భక్తుడై

పరమాత్మను పూజించవలెను. మానవులు – మనస్సును, బుద్ధిని, చిత్తమును, దశేంద్రియములను నియమించి దృష్టిని ఆత్మయందునిలిపి ఆత్మపరాయణులైన యెడల ఆత్మయోగులు కాగలరు. పైన చెప్పిన విధముగ అర్జునునకు పరమాత్మ రాజ విద్యా – రాజగుహ్య యోగమును పరిస్ఫుటముచేసి యున్నా డని తెలియవలెను.

సా రాం శ ము

మానవులు దురాచారులైనను యోగయుక్తులై ధర్మా త్ములై ఆత్మయోగపరాయణులైన యెడల బ్రహ్మత్వమును బొందుచున్నారు.

ప్రవృత్తియందు యెల్లప్పుడు నిమగ్నులైన మానవులను, ప్రవృత్తిస్వరూపము సర్వకాల సర్వావస్థలయందును సమ్మోహ మును కలుగజేయుట సహజము. విషయారాధనమునందుగల భ్రాంతి ఆత్మారాధనమునందు కలుగదు. పరమాత్మ సర్వత్ర ప్రత్యక్షముగ ప్రకృతి కాధారభూతుడుగ నున్నను, సంకుచిత మైన ప్రకృతి స్వరూపములు చిత్తము నాకర్షించుచున్నవి.

చిత్తాకర్షణకరములైన ప్రకృతి స్వరూపముల నారా ధించుచు, ఆత్మారాధనము చేయగలవిధము నీ యోగము తెల్పుచున్నది. యజ్ఞదాన ధర్మములను చేయుచున్నను, ఆత్మా ర్పణముగా వానినిచేసినచో, కర్మ ప్రతిబంధకము కలుగదు.

సకల జనులును, జాతి, లింగ, మత, కుల, భేదములు లేక మోక్షార్హులు. భగవంతుని యేవిధముగ నెట్టి కోరికతో

మనుజుడు ఆరాధించునో తదనురూపమైన ఫలమును, ఆత్మను పొందుచున్నాడు.

పాపపుణ్య భేదములేక భక్తునకు భగవదనుగ్రహము కలుగుచున్నది. భగవదనుగ్రహముగల భక్తులకు ఆత్మజ్ఞానము కలుగుచున్నది.

# దశమోధ్యాయము

## విభూతియోగము

జగత్తు అనంతములైన విభూతులతో నిండియున్నది. అవి జనుల ననేక విధముల నాకర్షించుచున్నవి. జగత్తు వ్యష్టి, సమష్టిరూపముల ననంతముగ గనుపట్టుచున్నను, అది అనిత్యమని తెలుపబడినది. సర్వభూతములందు సమమైయున్న ఆత్మ నిత్యమని తెలుపబడినది. ఆత్మయోగలక్షణములు, ఆత్మయోగ విధానము, ఆత్మయోగఫలము వివరింపబడినవి. ఆత్మయోగులు బ్రహ్మనిర్వాణమును, బ్రహ్మత్వమును పొందగలవిధము తెలుపబడినది. ఈశ్వరవిభూతులు గీతాశాస్త్రము 7, 9 అధ్యాయములలో దెలుపబడినవి. విజయునకు నిశ్చయయోగ ప్రవృత్తి గలుగుటకు, విభూతి యోగాధ్యాయముద్వారా విపులముగ ఆత్మయోగ మహాత్మ్యము, అష్టసిద్ధులు-మహావిభూతులు, వీనిద్వారా భగవద్యోగమును, భగవత్ప్రతిభను గ్రహించగల విధ మీ యధ్యాయమునందు వివరింపబడినది. ఆత్మయోగానుభవమునందే విభూతియోగానుభవమును సాధ్యమని స్పష్టీకరించ బడుచున్నది.

భగవద్విభూతులను శ్రీ వేదవ్యాసభగవానుడు వేద వేదాంగములందును, అష్టాదశ పురాణములందును అనంతనామ రూప ఇతిహాసములలో వివరించెను. ఐనను తృప్తినిపొందక, భగవద్విభూతులతో నిండియున్న భాగవతమునుఆత్మానుభవము నిమిత్తము వ్రాసినాడని ఇతిహాసముకలదు. శ్రీకృష్ణుడు దగ్గర

నుండి ప్రత్యక్షముగ తన విభూతులను చెప్పుచున్నను, అర్జును నకు తృప్తికలుగక ఆత్మవిభూతుల సమన్వయమును గురించి మరల చెప్పుమని శ్రీకృష్ణుని కోరుచున్నాడు. భగవద్విభూతులు స్వాను భవమువలన తెలియబడవలసినవి. ఘనను బాహ్యములును, సగుణములునైన మహావిభూతుల సాధనమున పరమాత్మను గ్రహింపగల విధమును, అర్జునునకు విభూతియోగ రూపమున శ్రీకృష్ణు డుపదేశించుచున్నాడు.

ఈ అధ్యాయమునందు ౪౨ శ్లోకములు గలవు.

౧వ శ్లోకమున పరమవిభూతియోగ మహాత్మ్యవిషయమై కృష్ణుడు సంభాషించెను. ౧౯-౪౧ వరకు పరమాత్మ సర్వ భూతములకును తాను మూల మనియును విద్యలయందాత్మ విద్య యును రుద్రులందు శంకరుడును, వైష్ణవులందు వాసుదేవుడును, పాండవులందు ధనంజయుడును, విశ్వమునందు విభూతిగోచరించిన దంతయును మత్తేజోంశ సంభవమని తెలిపెను.

శ్లోకము ౪౨ సమస్త జగత్తులును శ్రీకృష్ణపరమాత్మ యొక్క యేకాంశముచేతనే వ్యాప్తమైయున్నదని తెలుపు చున్నది.

శ్లో॥ భూయఏవ మహాబాహో శృణుమే పరమం వచః,
యత్తేహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా॥ 10 అ. 1

ఆధ్యాత్మికమైన నాయొక్క మాటలు వినుము-నీకు వేదాంతమునందు ఆసక్తియున్నది. నీ హితమునుకోరి దానిని నేను నీకు చెప్పుచున్నాను. ఈ విజ్ఞానము ఉత్తరోత్తరమున ఆత్మసంబంధమైన సుఖము కలిగించును.

దేవతలకుగాని, ఋషులకుగాని, నా సంగతి పూర్తిగా తెలియదు. వారందరికి సృష్టికర్తను నేను-నావలననే నా విషయము తెలిసికొనవలయును. ఇతరులద్వారా నా తత్త్వము తెలియుట సాధ్యముకాదు.

శ్లో॥ అసిత గిరి సమంస్యాత్ కజ్జలం సింధుపాత్రే,
సురతరువర శాఖా లేఖినీ పత్రముర్వీ
లిఖిత యదిగృహీత్వా శారదా సర్వకాలం
తదపి తవ గుణానా మీశ పారం నయాతి.

కాటుకకొండంత సిరాను సముద్రమంత పాత్రలోపోసి కల్పతరు కొమ్మయను కలముచే భూమియను కాగితముపై సరస్వతీదేవి త్రికాలములయందు నీ మహిమ వ్రాయుచున్నను దాని అంతు తెలియకున్నది.

"నాకు జననమరణములు లేవని నేను మూడు లోకములకు అధిపతినని, నా తత్త్వము నెఱింగినవారు, పాపపుణ్యముల నుండి విడిపింపబడి మోక్ష మొందుచున్నారు" అని శ్రీకృష్ణ పరమాత్మ తెల్పుచున్నాడు.

"ఎవరికి యే గుణములు కలుగవలయునో, అవియన్నియు నావలననే కలుగుచున్నవి. మానవుల పూర్వజన్మ కర్మానుసారము బుద్ధి జ్ఞానములు కలుగుచున్నవి. మానవులు, సప్త మహర్షులు నావలననే సృష్టింపబడియున్నారు. ఈ సంగతు లన్నియు అర్జునుడు విన్నతదుపరి శ్రీకృష్ణపరమాత్మను స్తోత్రము చేయ మొదలిడెను. ఇదివరలో భక్తులు, జ్ఞానులు మొదలగు వారు మీ విషయమై చెప్పినదెల్ల నిజమని నేను నమ్ముచున్నాను. "భక్తులు తమ చిత్తమును నాయందుంచి వారి

ప్రాణములను నా పరము చేయుదురు. భక్తులు నా నామ గానము చేయుచు, నా స్వరూపమును ధ్యానించుచు, నా పాద సేవలు చేయుచు. నన్నే నమ్మియుందురు. నన్ను మరచుటయే వారికి అపారదుఃఖము. అనేకమంది భక్తులు కలసి మెలసి సమష్టిగా నన్ను భజించి, నాతత్త్వమును బోధపరచుకొను చుందురు. భగవదుపాసన చేయగోరువారు యీ క్రింది విధానమును గుర్తించుట శ్రేయస్కరము.

శ్లో॥ హంతతే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః,
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే॥ 10 అ 18.

“ఓ యర్జునా! నా విభూతుల కంతములేదు. ఐనను నా దివ్యమైన విభూతులందు ప్రధానములైన వానిని నీకు చెప్పెదను. సకల భూతములయొక్క హృదయమునందున్న ఆత్మను నేను. భూతములయొక్క ఉత్పత్తి స్థితిలయములకు కారకుడను కూడా నేనే సుమీ.” “సకల భూతములందును అహంశబ్ద పదార్థ మాత్రమై, భూతములయొక్క అంత్య పరిణామమున కదియే యాధారముగానున్నది. నేను ఆదిత్యులందు విష్ణువును. జ్యోతులందు సూర్యుడను, మరుత్తులందు మరీచిని తారలందు చంద్రుడను” అయి యున్నాను.

“వేదములందు సామవేదమును, దేవతలయందు ఇంద్రుడను, ఇంద్రియములందు మనస్సును, భూతములందు చేతన శక్తియును నేనే అయి యున్నాను. నేను రుద్రులందు శంకరుడను, యక్షులందు కుబేరుడను, వసువులందు అగ్నిహోత్రుడను, పర్వతములందు మేరు పర్వతమును” అయియున్నాను. కాన శ్రీకృష్ణపరమాత్మను సమస్త వస్తువులందు ప్రధానమగు

భగవత్ తత్త్వముగ తెలుసుకొని, లోకమంతా భగవద్విభూతి మయమని మానవులు గౌరవించవలెను. ఉపాసనలు రెండు విధములు (1) అఖండోపాసన (2) ఖండోపాసన.

సర్వకాల, సర్వదేశ, సర్వ అవస్థలయందును భగవంతుని ఆరాధించుట అఖండోపాసన యనబడుచున్నది. స్థల, కాల, వస్తు, ప్రత్యయములందు పరమాత్మనుభజించుట, ఖండోపాసనగా తెలియవలెను. కొన్నివస్తువులు భగవంతుని మహిమను సుప్రకటిత మొనరించుటకు, వాని పూర్వజన్మ పుణ్యవిశేష మని తెలియవలెను. ఖండోపాసన వలన కాలానుగుణ్యముగా అఖండోపాసనచేయు సామర్థ్యము మానవునకు యేర్పడును.

కొందరియందు పాండిత్యముగాను, కొందరియందు బలముగాను, కొందరియందు ఐశ్వర్యముగాను, కొందరియందు అధికారముగాను, భగవంతుడు ప్రకటితమగుచున్నాడు. భగవత్స్వరూపులగు పెద్దలకు నమస్కరించుము. చరచరాత్మకమైన ప్రపంచమంతయు భగవన్మహిమగా తెలియవలెను. ఇదియే భక్తికి మూలసూత్రము.

సారాంశము

భౌతిక పదార్థమయమైన ప్రకృతియందు విరివిగా వ్యాపించియున్న భౌతికపదార్థములు యోగసాధనములుగా వినియోగపడుచున్నవి. భౌతిక పదార్థములు శుద్ధమగు యోగ దృష్టివలన దైవ విభూతులుగను, భగవదంశములుగను, పరిణమించుచున్నవి. దేహమందలి ఆత్మవిభూతి, ఆత్మయోగ పరిణామమును, భౌతిక విభూతి లోకకల్యాణప్రదమగు స్థూల పరిణామమును పొందుచున్నది.

పురుషార్థమునకు సాధనమైన దేహమందు దైవవిభూతిని సందర్శించుటకు నిత్యమైన ఆత్మయోగము సాధనము. సకల విభూతులకును, భగవంతుడు ఆధారభూతుడు. కాని ఆవిభూతులు భగవంతుని కేమాత్రము ఆధారములుకావు. ఈసూత్రముల ననుసరించి ప్రపంచ విభూతులను భగవంతుని స్వరూపముగ తెలిసికొనినవాడు యోగి యగుచున్నాడు. విభూతి రహస్యమును తెలిసికొనిన కర్మయోగులు, ప్రకృతియందు ప్రవర్తించుచున్నను ఆత్మయోగ పరాయణులగుచున్నారు.

# ఏకాదశోధ్యాయము

## విశ్వరూప సందర్శన యోగము

బ్రహ్మవిద్యోపదేశము పదవయధ్యాయమునందు విభూతి యోగరూపమున జేయబడినది. అధ్యాయాంతమునందు "విష్టభ్యాహ, మిదం కృత్స్న, మేకాంశేన, స్థితో జగత్" అని వివరింపబడినది. సకలభూతములకును "అహమాత్మా" యనియును, విద్యలలో "అధ్యాత్మవిద్యయే" విద్య యనియును, సకల విభూతులందునుగల ఆత్మయోగమహాత్మ్యమును యిందు సువ్యక్తము చేయబడినది. ఈ యుపదేశాంతమునందు "మోహోఽయంవిగతో మమ" అని అర్జునుడు చెప్పుచు "ద్రష్టుమిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ!" అని మరల అడుగుచున్నాడు. పరమేశ్వరుని విభూతులందు ఆత్మను జూడగల ఆత్మ యోగ జ్ఞాన మర్జునునకు గలుగలేదని అర్జునుని ప్రశ్న తెల్పుచున్నది. వ్యష్టిరూపమున జూడగలిగినవియు, శ్రీకృష్ణుడు తెలిపినవియు నగు భగవద్విభూతులను (ఆత్మవిభూతులను) అర్జునుడు సమష్టిరూపమున జూచి, సంశయ నివారణమును నిశ్శేషముగ బడయగోరుచున్నాడు. అర్జునునకు ఆత్మేతరములైన విభూతులందు గల లక్ష్య మాత్మయోగమునందు గలుగుటకు, విశ్వరూపయోగసాధనమువలన సమష్టిరూపమున ఆత్మయోగరహస్యము సువ్యక్తము చేయబడుచున్నది. విశ్వరూపమున ఏకత్వమునందు నానాత్వమును, నానాత్వమునం దేకత్వమును ప్రత్యక్షమగుచున్నది.

విశ్వమునం దనుక్షణము జననమరణరూపములైన సర్వ ప్రళయములు కలుగుచునే యున్నవి. ఒక క్షణమునందు విశ్వమున కలుగుచున్న పరిణామము మరొక క్షణములో మారిపోవుచున్నది సృష్టిపరిణామము వర్ణనాతీతము. విశ్వరూప సందర్శనము జనన మరణ జాతములైన శోకమోహములు నశించుటకును నిశ్చలతత్త్వజ్ఞానము గలుగుటకును ముఖ్య సాధనము.

విశ్వరూపమును జూడగోరిన అర్జునునకు విశ్వరూపసందర్శనము భయసంభ్రమములను గలుగ జేసినది. శ్రీకృష్ణ పరమాత్మయొక్క సౌమ్యరూప సందర్శనమే మనశ్శాంతిని గలుగ జేసినది. విశ్వరూప సందర్శనయోగము సామాన్యకర్మయోగులకుగాక ఆత్మయోగసాధనమునకూడా విశదము చేయబడి యున్నది.

అర్జునా! విశ్వరూపమునందు, గుర్తించవలసిన అపూర్వ సందర్శములు, అతిప్రధానమైనవి అనంతముగ అంతర్భూతమై యున్నవి. అందు కొన్ని విషయములను తెలిపి, అర్జునుని మనస్సు విశ్వరూప సందర్శనమున కాయత్తపరచెను. "నేను చూపబోవు రూపములలో అనేక చిత్ర విచిత్రములయిన వస్తుపరిణామములను జూతువు. ముఖ్యముగా (1) ఏకాదశరుద్రులు, (2) ద్వాదశాదిత్యులు, (3) అశ్వినీ దేవతలు మొదలగు వారిని జూతువు. ఇదివరకు చూడనివన్నీ నీవు యిందు చూడనగును. మూడు కాలములయందు జరుగు సంగతులనేగాక, యింకను యేమి చూడదలచెదవో అవి అన్నియు అందులో చూడుము. నీకు జయము కలుగును. యుద్ధము చేయవలసినదని"

స్పష్టముగా చెప్పెను. ఇదివరలో ఫలాపేక్ష లేకుండ కర్మచేయ వలసినదని చెప్పిన విషయమునకు, జయము కలుగునని చెప్పుట విరుద్ధముగా కాన్పించు నేమోనని, పరమాత్మ గంభీరభావ ముతో అర్జునునకు జయము కలుగునో, అపజయము కలుగునో విశ్వరూపములో చూడనగునని చెప్పియుండెను. "శ్రీకృష్ణా, నీయొక్క కాంతిపుంజములైన అన్నివస్తువులను చూచుచున్నాను. అందులో చతుర్ముఖబ్రహ్మ, శివుడు, సంహార కర్త కనబడుచున్నారు. సప్తఋషులు మీ రూపములో నున్నారు. (ఋషులుఅనగా జ్ఞానసిద్ధులు. మృత్యు సంసార సముద్రమును దాటినవారు." లోకకంటకములయిన పాములు కానవచ్చుచున్నవి. అనగా సాత్విక, రాజస, తామసవస్తువు లన్నియు కానవచ్చుచున్నవి. అర్జునుడు పరమాత్మ అనుగ్ర హమును పొందనవా డగుటచే పాములనుచూచి భయపడుట లేదు. "మీ భయంకరమైన నోళ్ళలో సైన్యములు దూరు చున్నవి. ద్రోణుడు మొదలగు వీరులు మీ కోరలలో చిక్కు బడియున్నారు. వారిరక్తమును మీ కఱకునాలుకలతో, ప్రళయ కాలాగ్ని సమానమైన మీ నోటిలోనికి పీల్చుచున్నారు. హే మహాప్రభో! ద్రోణాదివీరులు సైన్యముతో, నదులు సాగరములో ప్రవేశించి నామరూపములు పోగొట్టుకొను మాదిరి, మీ నోటిలోనికి పోవుచున్నారని" అర్జునుడు అనేక విధముల శ్రీకృష్ణుని స్తోత్రము చేసెను. అట్టి అత్యద్భుత విశ్వ రూపమునుచూచి, అనుమానముకలిగి వినయ విధేయతలతో రెండుప్రశ్నలు వేసెను. (1) మీపేరేమి? (2) మీరు యీ రూపమెందుకు దాల్చినారు? అని అడిగెను. అంత పరమాత్మ

ఉచ్చస్వరముతో "నేను కాలుడను. సర్వచ్ఛేదకుడను. అందరిని నాశనముచేయుటకు అవతరించినాను. కాన, నిన్ను నీ సోదరులను తప్ప ఇతరుల నందరిని రూపుమాపెదను" అని చెప్పెను.

కొందరు వ్యాఖ్యాతలు అర్జునునికి తనవలన భగవంతునికి కొంత సాయము గావలసి యున్నదను అహంకార మున్నట్లును, దానిని నశింపు చేయవలయునని భగవంతుడు అర్జునునకు నీవు యుద్ధముచేసినను, చేయకున్నను, కౌరవాదులలో ఒక్కడును కూడా జీవించి యుండడనియును, వారి సంహారము తనచే ఇది వరకే చేయబడెననియు, ప్రత్యక్షముగా కనుపించు కౌరవులు జీవచ్ఛవములనియు పరమాత్మ చూపెనని తెలిపియున్నారు. "అర్జునా! లెమ్ము. నీవు యుద్ధము చేయుము. యుద్ధవిజయ కీర్తి నీకు రావలయును" అనెను. అర్జునుడు "ఈ కీర్తి నాకేల? రాజ్యసుఖములుకూడా నేను కోరను" అని మొదట చెప్పియుండెను. ఐనను ప్రస్తుతము అర్జునునకు శ్రీకృష్ణుడే రాజ్యభాగము కోరునేమో అను సంశయము జనించునని, ఆ సంశయమును తీర్చుటకై పరమాత్మ రాజ్యము మొత్తము అర్జునుని తీసుకొనమని చెప్పెను.

"నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్". నీవు నిమిత్త మాత్రుడవే సుమా!

"భీష్మద్రోణాదుల సంహార మిదివరకే జరిగినది. వారి తలలు నా కోరలలో నేతిగా నొక్కబడియున్నవో నీవు చూచి యున్నావు. కనుక నీవు యుద్ధముచేయుట నీకు కీర్తి రాగలందులకు మాత్రమే. నిన్ను యుద్ధము చేయమనుచున్న కారణమదియే' నని శ్రీకృష్ణుడనెను. అర్జునునియందు యింత వాత్సల్యమేలననగా అర్జునుడు తన భక్తుడగుటవలన. ఈ వాక్యమువలన పామరులు

గ్రహించవలసినది అందరి సుఖమునకు పరమాత్మ కారకుడను విషయము. గీతాశాస్త్రము తొమ్మిదవ అధ్యాయమున పరమాత్మ లోకమునకు తాను పితనని తెలిపియున్నాడు.

పితాపుత్రభావముతో కూడా ఈశ్వరోపాసన చేయవచ్చును.

శ్లో॥ సమోఽహంసర్వభూతేషు నమేద్వేష్యోఽస్తి నప్రియః,
యేభజన్తితు మాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్ 9 అ. 29

పై శ్లోకమువలన పరమాత్మ అందరికీ స్నేహితుడనని బోధించుచున్నాడు. ఇందు సఖ్యభావము వ్యక్తమగుచున్నది. పరమాత్మ యొక్కడే పురుషుడు. జీవులందరు అస్వతంత్రులు. కనుక పరమాత్మమీద ఆధారపడియుండవలసినవారు. మానవులు చేయు తప్పులు స్నేహితునిమాదిరిగాను, భార్య తప్పులు భర్త మన్నించునట్లుగాను, పరమాత్మ మన్నించును. ఇందు సఖ్యభావము, మధురభావము, సూచింపబడినది. వాత్సల్య భావము–పరమాత్మ తన బిడ్డయని యెంచి, బాలకృష్ణుని యశోదవలె లాలించి, ప్రేమించుచు, పోషించుచు, సేవించుచు, ఆనందించుచు, తాదాత్మ్యమును బొందుట వాత్సల్యభక్తిసాధన లక్ష్యము.

భృత్యభావముతో హనుమంతుడు శ్రీరామచంద్రుని సేవవలన యెట్లు శ్రీరామానుగ్రహపాత్రుడై సర్వబంధ వినిర్ముక్తుడై భక్తాగ్రేసరుడై, క్రియాసిద్ధుడై, లోకైక వీరుడాయెనో అందరికిని తెలియును. అర్జునుడు దేదీప్యమాన విశ్వరూప సౌభాగ్యమును దివ్యదృష్టితో చూడజాలక, పరమాత్మను

విశ్వరూపము నుపసంహరించుమని ప్రార్థించెను. పరమాత్మ తనసహజరూపమున అర్జునునకు దర్శనమిచ్చి ఆనందింపజేసెను.

శ్లో॥ సుదుర్దర్శ మిదంరూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః॥ 11 అ 52

శ్లో॥ నాహంవేదైర్న తపసా నదానేన నచేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా (11 అ 53)

వేదశాస్త్రములవలన యెన్ని దాన తపములు చేసినను అఖండమును, సమగ్రమును అగు విశ్వరూప సందర్శనము దుర్లభమనియును, అనన్యభక్తియే విశ్వరూప సందర్శనమునకు తగు సాధనమనియును స్పష్టము చేయబడినది.

"అర్జునా! యెందరోమంది దేవతలు విశ్వరూప సందర్శనము కోరినను వారికి యిట్టి సమగ్రరూపమును చూపియుండలేదు. నీ భక్తికిమెచ్చి యీ రూపమును జూపి నీ ప్రశ్నలకు సమాధానము యిచ్చియున్నాను. నీకు నాయందు అనన్య భక్తి యున్నందున ఈ విశ్వరూపము చూడగలిగితివి. నీవు నన్ను యథోచితముగా భజించి సకల దుఃఖములను పోగొట్టుకొను"మని చెప్పెను.

## సారాంశము

అర్జునునకు శ్రీకృష్ణ పరమాత్మయందుగల అనన్యభక్తి ప్రపత్తులవలన విశ్వరూప సందర్శనభాగ్యము కలిగినది. విరాట్ రూప దర్శనము భయభ్రాంతులను కలుగజేసినది. మోహా తేజోంధకారములు, సర్గప్రళయములు, కర్ణార్జునులు, సౌమ్య భయంకరరూపములు, దైవీ రాక్షసరూపములు, పంచభూత

ములు, త్రిమూర్తులు మొదలగు సమస్త విశ్వమును, విరాట్ స్వరూపమందే కస్థానమున గోచరమైనవి. అర్జునునకు దివ్య దృష్టియున్నను, వీని నన్నింటిని చూచుటకు సాధ్యముకాలేదు. అర్జునుడు తన కలవాటైన సౌమ్యరూపమును తిరిగి చూపుమని పరమాత్మను ప్రార్థించి దానినిచూచి శాంతి పొందెను. ప్రవృత్తి భగవద్విభూతులనేగాక, పరమాణువునుండి పర బ్రహ్మము వరకును వ్యాప్తమైన విశ్వమంతటిని ప్రత్యక్షము చేయుచున్నది. మహాయోగులు సకలమునందును భగవద్వి భూతులను సందర్శించుచున్నారు. విశ్వరూపసందర్శన ద్వార మున జిజ్ఞాసువులు, ఆత్మయోగులుగా గలవిధమును తిరిగి భక్తి యోగాధ్యాయమందు వివరింపబడినది.

ప్రవృత్తియందు భక్తి పురుషార్థమునకు సాధనము. భక్తి శ్రద్ధలు లేని కార్యము నిరర్థకము. అనంతమైన విశ్వరూప సంద ర్శనమున కనన్యమైన భక్తిసాధనము. అనన్య భక్తియోగ మున కాత్మయోగము మూలము.

# ద్వాదశోధ్యాయము

## భక్తియోగము

విశ్వరూప సందర్శనయోగాధ్యాయమునందలి ఆఖరు శ్లోకమునందే భక్తిమార్గముయొక్క పూర్ణస్వరూపము తేట తెల్లముగా తెల్పబడినది.

శ్లో॥ మత్కర్మకృన్మత్పరమో మద్భక్తి స్సఙ్గవర్జితః,
నిర్వైరః సర్వభూతేషు యస్సమామేతి పాండవః 11 అ. 55

భగవద్భక్తులు, భగవత్ కైంకర్యమును చేయగలవిధమును, భగవత్ భక్తిపరాయణులు అనన్య భక్తిని సాధించు విధానమును, నిష్కామకర్మయోగమును, సర్వభూతములందును సమబుద్ధిని బడయుట మొదలగునవన్నియు ఈ అధ్యాయమునందు నిరూపింపబడినవి. అనన్యమైన భక్తిస్వరూప స్వభావములను, యథార్థభక్తిలక్షణములను ఈ అధ్యాయము సుబోధకము చేయుచున్నది.

జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను, మనోబుద్ధి చిత్తాహంకారములను కర్మయోగసాధనముద్వారా ఆత్మయోగమునందు సంయోగము చేయవలసిన మార్గమును భక్తియోగము నిరూపించుచున్నది.

అర్జునునకు పరమేశ్వర సాక్షాత్కారముకలిగినను సంశయ నివారణము కాలేదు. అనన్యమైనభక్తియే "పరమా

త్మను తెలుసుకొనుటకును, చూచుటకును, చేరుటకును, సాధన మని ౧౧ వ అధ్యాయాంతమునందు తెలుపబడినది.

సగుణ నిర్గుణోపాసకులగు భక్తులలో శ్రేష్ఠు లెవరని అర్జునుడు పరమాత్మను ప్రశ్నించుచున్నాడు. కర్మయోగము ద్వారా భగవంతుని సేవించువారును, జ్ఞానయోగముద్వారా అవ్యక్తమైన పరమాత్మను సందర్శించెడివారును – యిరువర్గముల వారు శ్రేష్ఠులేనని పరమాత్మ సమాధానము చెప్పుచున్నాడు. ఐనను సగుణోపాసనద్వారా భగవంతుని సేవించుట సులభ సాధ్యమని తెలియజేసి యున్నాడు.

భగవంతుని రెండువిధములుగ పూజించవచ్చును. (1) నిర్గుణోపాసన (2) సగుణోపాసన. విశ్వరూప అధ్యాయము నందలి కడపటి శ్లోకమందు శ్రీకృష్ణుడు "మత్" అను పదమును నాల్గు పర్యాయము లుపయోగించినాడు. ఆ పదమే యీ అధ్యాయమునకు మూలసూత్రము.

అద్వైతపరముగ నిర్గుణోపాసనము చేయువాడా, ద్వైతపరముగ సగుణోపాసన చేయువాడా – యీ యిద్దరిలో యెవరు గొప్పవారు? పరబ్రహ్మమునకు నిర్గుణ సగుణావస్థలు రెండును గలవు. నిర్గుణోపాసనకు నామరూపములు లేవు. ఎట్టి బాహ్యవ్యాపారములేదు. సృష్టి, స్థితి, సంహారము అంతయు అంతర్గముగా నున్నది. నిర్గుణబ్రహ్మమే ప్రకృతియందు (మాయలో) ప్రతిబింబించి సగుణమగుచున్నది రజోగుణముతో బ్రహ్మ రూపమున సృష్టించుచున్నాడు. సాత్త్విక గుణముతో విష్ణురూపమున సృష్టికిలోనైన చరాచర ప్రపంచమును కాపాడుచున్నాడు. తామసగుణముతో మహేశ్వరుడై

కాలానుగుణ్యముగ సృష్టిని సంహారము చేయుచున్నాడు. పరబ్రహ్మమే త్రివిధమైన నామరూపములుదాల్చి—సృష్టి, స్థితి, సంహారములను చేయుచున్నాడు. ద్వైత వ్యాఖ్యానానుసారము సగుణోపాసన విధానమునను సరించి పరమాత్మ నుపాసించువాడు నిర్గుణోపాసకునికంటె శ్రేష్ఠుడు. సగుణోపాసనముకన్న నిర్గుణోపాసన చాలా కష్టము.

శ్లో॥ క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్తచేతసామ్,
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే॥ 12 అ. 5

అక్షరబ్రహ్మోపాసనము కష్టసాధ్యము. జ్ఞానులవ్యక్తోపాసనమును కష్టసహిష్ణులై చేయుదురు. పరమాత్మయందు దాసభక్తి గలిగి స్థిరచిత్తముతో సకలకర్మలను పరమాత్మార్పణముగా చేయుచు, ఏకాంతయోగయుక్తులై పరమాత్మను ధ్యానించుచు, సేవించెడిమానవులను జననమరణరూపముతో గూడిన సంసారసాగరమునుండి, పరమాత్మ శీఘ్రముగా నుద్ధరించును.

చిత్తమును పరమాత్మయందు నిలకడగానుంచ జాలని మనుజులు అభ్యాసయోగరూపమున పరమాత్మను సేవించి తరుణోపాయమును పొందగలరు. అట్టి అభ్యాసయోగమును చేయజాలనివారు కర్మలు చేయుటయందు దాసభక్తి గలిగియుండవలయును. కర్మఫలములను భగవదర్పితము చేయుచు, కర్మలను మనుజులాచరించినయెడల ఆత్మసిద్ధిని పొందగలరు. కర్మలు చేయుటయందు నిరతులు కాజాలని మనుజులు, ఆత్మనిగ్రహమునుపొంది పరమాత్మనాశ్రయించి నిష్కామకర్మలనుజేయుచు, ఆత్మసిద్ధిని పొందవలెను. పరమాత్మను సేవించుటకు యేర్పడిన

పలువిధములగు మార్గములలోను నిష్కామ కర్మాచరణమే మానవులకు శాంతిని కలిగించును.

భక్తులు, సకలభూతములందును ద్వేషభావము లేక ద్వంద్వములగు సుఖదుఃఖములను దూరముగావించి యావత్ప్రపంచమును సమబుద్ధితో చూచుచు, ఓర్మిగలిగి, నిత్యసంతుష్టులై, యోగయుక్తులై, ఆత్మనిగ్రహముతో మనస్సును, బుద్ధిని, పరమాత్మయందు నిలుపగలిగినయెడల అట్టివారు పరమాత్మకు అత్యంత యిష్టులగుదురని తెలియవలెను. ఇంతియే గాక, ఏవిధముగను, లోకమునకు అపకారముచేయక, లోకము వల్ల అపకారమును బొందక, సంతోష, క్రోధ, భయ, ఉద్వేగములు లేక సంచరించు భక్తుడు పరమాత్మకు అత్యంతప్రియుడు కాగలడు.

కోరిక లేనివాడును, పరిశుద్ధుడును, నేర్పరియును, నిర్లిప్తుడును, విచారరహితుడును, కర్మపరిత్యాగియును, హర్ష ద్వేష శోకమోహములు లేనివాడును, శుభాశుభములను విడిచిన వాడును, శత్రుమిత్రులయందును, మానావమానముల యందును, శీతోష్ణములయందును, సుఖదుఃఖములయందును, నిందాస్తుతులయందును సమబుద్ధిగలవాడును, సంగము లేని వాడును, ప్రాప్తించినదానితో తృప్తిచెందువాడును, ఒకే స్థానము నంటిపెట్టుకొని యుండనివాడును, స్థిరచిత్తుడును అగు భక్తుడు పరమాత్మకు ప్రియుడు కాగలడు. ఈ పైన తెల్పిన విధమున శ్రద్ధావంతులును, పరమాత్మ సేవాతత్పరులును, భగవదర్పిత జీవితులైన భక్తులు ధర్మస్వరూపమును సేవించుచు పరమాత్మ కత్యంతప్రియులు గానుందురు.

## సారాంశము

గీతాశాస్త్రము బహువిధయోగ సాధనములద్వారా బ్రహ్మవిద్యోపదేశమును జేయుచున్నది. పదకొండవ అధ్యాయమగు విశ్వరూప సందర్శనయోగమువలనను, పదమూడవ అధ్యాయమగు క్షేత్ర క్షేత్రజ్ఞవిభాగయోగ సాధనములవలనను, బ్రహ్మజ్ఞానమును, ఆత్మజ్ఞానమును బోధింపబడినవి. నిర్గుణమైన పరబ్రహ్మమువలె, నిర్గుణమైన ఆత్మను గ్రహించుట కష్టము. సగుణమైన భక్తియోగము నిర్గుణమైన ఆత్మజ్ఞానమునకు సాధనముగనున్నది. నిర్గుణయోగసాధనల నుజ్జీవింపజేయు పలుసాధనము లీ యధ్యాయమునం దుదహరింపబడినవి.

ధర్మము సగుణమైనను, ధర్మసాధనము ఆత్మయోగమునకు ప్రాణమగుచున్నది. "ధర్మంచర సత్యంవద" అని ధర్మోపదేశము చేయబడినను, అన్ని ధర్మములు తద్ధర్మ పర్యుపాసనము వలననే బోధపడుచున్నవి. ధర్మము విశ్వమునంతయు ప్రేమస్వరూప, స్వభావరూపములందు ధరించుచున్నది. జీవయాత్రయందు అనంతమైన ధర్మములు ఉత్సాహమును కలుగజేయుచుండును. అన్ని ధర్మములను భక్తిజ్ఞానములతో చేయుట యోగసాధనము. ఇట్టి సాధన అనన్యమైన భక్తిమూలమున మానవులకు సాధ్యమగుచున్నది. త్యాగము, సమత్వము, భూతదయ, స్వధర్మనిర్వహణము, మొదలగు ధర్మములను శ్రద్ధతో పర్యుపాసనచేసి భక్తులు పరమార్థమును బడయుచున్నారు.

# త్రయోదశోఽధ్యాయః

## క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

పండ్రెండవ అధ్యాయమునందు ధర్మ్యామృతమును, ధర్మనిష్ఠులు యోగపరాయణులై ఉపాసించి, నిరతిశయ సుఖమును పొందగలవిధము వివరింపబడినది. భగవద్గీత అర్జునునకు కర్తృత్వాభిమానమువలన గలిగిన విషాదయోగముతో నారంభమగుచున్నది. గీతాశాస్త్రము ధర్మక్షేత్రముతో నారంభమగుచున్నను, మొదటి ఆరుఅధ్యాయములయందును కర్మజిజ్ఞాసయును, రెండవ ఆరు అధ్యాయములయందును ధర్మజిజ్ఞాసయును, మూడవ ఆరు అధ్యాయములందును జ్ఞానజిజ్ఞాసయును, విశదీకరింపబడినవి. పదమూడవ అధ్యాయము క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగపరమైన ధర్మజిజ్ఞాసతో నారంభమగుచున్నది. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము – ధ్యాత, ధ్యేయము, ధ్యానము – కర్త, కార్యము, కర్మ – ధర్మి, ధర్మ్యము, ధర్మము అను త్రిపుటిలే, సాధకుడు, సాధ్యము, సాధనము మొదలగునవి సంబంధముగలవైనను, ప్రవృత్తియందు అవి భిన్నవిధములని తెలియదగి యున్నవి. వాటిని పరమార్థమైన బ్రహ్మవిద్యా పూర్ణయోగ శాస్త్రరూపమున గీతాశాస్త్రమునందు బోధించియున్నది.

ప్రాచీన వ్యాఖ్యాతలు, త్రిమత స్థాపకులు, వారి శిష్య ప్రశిష్యులు, మొదటి షట్కము "త్వం" పదార్థమును, ద్వితీయ షట్కము "తత్" పదార్థమును, తృతీయషట్కము "అసి" పదార్థమును తెలుపుచున్నటుల వివరించియుండిరి. అవినాభావ

సంబంధముగల జ్ఞాత, జ్ఞేయ, జ్ఞానపదార్థముల జిజ్ఞాసయందు వీటిని ప్రత్యేకించుట యసంభవము.

మొదటి 6 అధ్యాయములందు, శేషించిన 12 అధ్యాయములయందలి విషయములును, ద్వితీయ షట్కమునందు ప్రథమ తృతీయ షట్కములలోని విషయములును, తృతీయ షట్కమునందు ప్రథమ ద్వితీయషట్కములలోని విషయములును సహజముగ పునఃప్రతిపాదితములైనను పునరుక్తిదోషము లేదు. మూడవషట్కములోని విషయములు గ్రహించినతరువాత ప్రథమ ద్వితీయ షట్కవిషయములు సులభగ్రాహ్యములుగ నుండును. ప్రవృత్తియందు ఆత్మ పరమాత్మల పరమార్థమును దెలిసికొనుట కాత్మయోగమే పరమసాధనము. ఈ యధ్యాయమునందు జ్ఞేయవివరణము విశేషముగ గలదు. విశ్వరూప సందర్శనయోగము పరమాత్మవిషయమై చేసిన వివరణ, యీ యధ్యాయమునందు క్షేత్రజ్ఞుని విషయమై చేయబడినది.

శ్లో॥ ప్రకృతిం పురుషంచైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవచ,
ఏతద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయంచ కేశవ॥ 13 అ 1

ప్రకృతి, పురుషుడు, జ్ఞానము, జ్ఞేయము, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, వీని వివరమేమి ? అని అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మను అడిగెను.

ప్రకృతి, క్షేత్రము యీ రెండును ఒకటి. పురుషుడు, క్షేత్రజ్ఞుడు యీ రెండును ఒకటి. జ్ఞానము, జ్ఞేయము, యీ రెండును వేరు. మొత్తం ఆరింటిని నాలుగుగా క్లుప్తపరచి పరమాత్మ అర్జునునికి జవాబు చెప్పెను. కొన్ని గీతలలో ఈశ్లోకము

లేదు. దీనితో కలసి గీతలో మొత్తము 701 శ్లోకములు అగుచున్నవి.

శ్లో॥ ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమి త్యభిధీయతే,
ఏతద్యో వేత్తితం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః॥ 13 అ 2

శరీరము రెండువిధములు – (1) స్థూలశరీరము (2) సూక్ష్మశరీరము. 1 స్థూలశరీరము: పాంచభౌతికమయినది. కాలానుగుణ్యముగ నశించును. ఇది కవచమువంటిది. 2 సూక్ష్మశరీరము : ఇదిస్థూలమునకు లోపల 19 తత్వములతో కూడినది–జీవతత్వము నశించినగాని సూక్ష్మశరీము నశించదు. కర్మక్షయమైన జీవుడు మోక్షము నొందును. పై రెండుశరీరములకు కలిపి క్షేత్రమనిపేరు. ఏలనన జీవుని సంరక్షణకు పాంచభౌతిక శరీరము కవచమువంటిది. శరీరమును ఆహార నియమాదుల వలన కట్టుబాటులో నుంచినగాని జీవులు పరమాత్మయందలి జ్ఞానానందములను తెలిసికొనజాలరు. ఆత్మకు గాయము తగులకుండ కాపాడు కవచము స్థూలశరీరము. అందువలన మనశరీరమును క్షేత్రమని తెలియవలెను. బ్రహ్మాండరూపమగు క్షేత్రమునకు యజమాని పరమాత్మయని గుర్తెరుంగవలయును.

క్షేత్రజ్ఞుడు అనగా క్షేత్రరహస్యముల నెరింగిన పురుషుడు–క్షేత్రములో నేమేమి జరిగినది, జరుగునది తెలుసుకొను శక్తిగలవాడు క్షేత్రజ్ఞుడు.

ప్రతి శరీరములోను క్షేత్రజ్ఞులు యిద్దరుగా నుందురని తెలియవలెను. 1 సామాన్యుడు 2 ముఖ్యుడు. ఇందు జీవుడు సామాన్యుడు. పరమాత్మ ముఖ్యుడు. పరమాత్మకు శరీర

యందలి సంగతులేకాకుండ ఆత్మయందలి సంగతులుకూడ తెలియును.

మన శరీరములు, ఆత్మలు మొదలగు నవన్నియు, పరమాత్మకు క్షేత్రములు. వైష్ణవ సిద్ధాంతప్రకారము శ్రీమన్నారాయణుడు సర్వశరీరి అని చెప్పబడుచున్నాడు. శరరము సొత్తు. పరమాత్మ దాని యజమాని అని అందురు. అందువల్ల శరీర శరీరిభావము శేషి శేష భావమునికూడా తెలియవలెను.

జ్ఞానము : నిత్యానిత్య వస్తువివేకము (ఆత్మానాత్మ వివేకము) అనగా, ఆత్మానాత్మ వ్యత్యాసమును తెలిసికొనుటయే జ్ఞానమని తెలియవలెను. లౌకికజ్ఞానము కామక్రోధములను వృద్ధిపరచి జీవుని సంసారములో కట్టివేయుచున్నది.

ఆత్మోద్ధరణకు హేతుభూతమైన ఆత్మ-పరమాత్మల విలక్షణ యథార్థజ్ఞానము. క్షేత్ర మెట్టిమార్పులతోను, యెట్టి తత్త్వములతోను కూడియున్నదో పరమాత్మ బోధించియున్నాడు.

శ్లో॥ ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధైః పృథక్,
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః॥ 13 అ 4

ఇదివరకు బోధించినదానికి ఇప్పుడు చెప్పుచున్నదానికి ప్రమాణము ఏమైనా కలదా? అని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించెను.

అసామాన్యమైన వేదాంతవిషయమును తెలుసుకొనునపుడు యెట్టివారినైనను ప్రమాణము చూపవలసినదని అడిగి తెలుసుకొనవలయును. "బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు,

ప్రమాణముగా అంగీకరించి వేద సమ్మతమగు విధానమును చెప్పుచున్నాను. నేను చెప్పునది నాస్వకల్పితముకాదని, శ్రీకృష్ణుడు అర్జునునకు" తెలిపెను.

ఈ సందర్భములో శ్రీకృష్ణపరమాత్మ భక్తుడగు అర్జునునియెడల కనుపర్చిన వినయము మిక్కిలి గమనించవలసి యున్నది.

(1) స్థూలశరీరము : (క్షేత్రము) ఇందలి తత్త్వములు:- (పంచ భూతములు), పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము. వీటినొక్క కూడికయే స్థూలశరీరము.

(2) సూక్ష్మశరీరము : మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. ఈ నాలుగు కలసి సూక్ష్మశరీరమగును.

అవ్యక్తం : మూల ప్రకృతి, సృష్టికి మూలకారణము. ఇంద్రియములు పదకొండు - జ్ఞానేంద్రియములు (5) ఐదు, కర్మేంద్రియములు (5) ఐదు, వీనిని నియమించు మనస్సు (1). అందువలన మనస్సును పైన తెల్పిన జ్ఞాన కర్మేంద్రియములలో చేర్చవలెను. మనస్సు సంకల్పించిన కార్యమును స్థిరపరచి, క్రియారూపములోనికి తెచ్చునది బుద్ధియని తెలియవలెను.

ఇంద్రియములవలన గ్రహింపబడు తత్త్వములు యిరువది నాల్గుకలవు. అనురాగము, ద్వేషము, తెలివి, అంతఃకరణ ధర్మములు. (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము యివినాలుగు అంతఃకరణయని తెలియవలెను). అంతఃకరణ ధర్మములు భిన్నములు. ఇరువదినాలుగు (24) తత్త్వములలో అయిదు తత్త్వములు స్థూలశరీరమునకును, పందొమ్మిది తత్త్వములు సూక్ష్మశరీరమునకును సంబంధించి

యుండును. వీటి కన్నిటికి అగ్రాసనాధిపతిగా నున్నది ఆత్మయని తెలియవలెను. గాయత్రీమంత్రమందుగల 24 అక్షరములు ఇరువదినాలుగు తత్త్వములుగా గ్రహించవలెను.

సత్ప్రవర్తన : గీతాశాస్త్రము ౧౬ అధ్యాయము దీనిని గురించి విస్పష్టము చేయుచున్నది.

1. అమానిత్వం : విద్య, ద్రవ్యము, సంతానము, అధికారము, జాతి, పీనివలన కలుగు పొగరుబోతుతనము. తాను యితరులకన్న యెక్కువ అనుకొనుట అభిమానము. అభిమానము లేకుండవలెను. అట్టి గుణమే అమానిత్వమని తెలియవలెను.

2. అదంభిత్వము : పొగరుబోతుతనము లేకుండుట. ఇది అజ్ఞానుల యందుండును. జ్ఞానులకు డంబము యేమాత్రము కూడదు.

3. అహింస : కాయక, వాచక, మానసిక, రూపమున ఎవరికిని యేవిధమైన హింస చేయకుండుట. "అహింసాపరమో ధర్మః" ఈ ధర్మము పరమాత్మకు ఎక్కువప్రీతిని కలిగించును.

4. క్షాంతి : అపకారికికూడ ఉపకారముచేయుట. ఇట్టి గుణముగలవారు యెక్కువ ఖ్యాతిని పొందుదురు.

మనుజుడు—ఎంత గొప్పవాడైనను గడ్డిపోచకన్న తక్కువ వాడనని భావించుకొనవలెను. ఇట్టి వినేయతతో చరించు మానవులు పరమాత్మయొక్క అనుగ్రహమును బడయగలరు. పై కారణమువలన మానవుడు తన జీవయాత్రను నిరాడంబర వృత్తితో—గడుపుట అత్యంత శ్రేయస్కరమని తలచవలెను.

5. ఆర్జవము : నిష్కపటము. అనగా తాను తలచిన సంగతి తలచినట్లు వెల్లడించుట. ఇదియే సత్పురుషుల లక్షణమని తెలియవలెను.

6. ఆచార్యోపాసన : భక్తివిశ్వాసములతో గురుసేవ చేయుట.

7. శౌచము : శుద్ధి (Cleanliness) విషయ వికారములను మానవుడు జయించి, అంతశ్శుద్ధిని సంపాదించుకొనవలెను. ఇట్టిదే శుద్ధి యని తెలియవలెను. కాని స్థూలశరీరముయొక్క బాహ్య శుద్ధిమాత్రమే యెంతమాత్రము (శుద్ధి) కానేరదని తెలియవలెను.

8. స్థైర్యము : పట్టుదల. కార్యదీక్షతో పట్టినపట్టును విడువక తాను తలంచిన కార్యమును నిర్విఘ్నముగా పూర్తి చేయుట.

9. ఆత్మనిగ్రహము: ఇంద్రియములను స్వాధీనపర్చుకొని ఇంద్రియములవలన గ్రహించబడు విషయసౌఖ్య లంపటల యందు ఉదాసీనత జూపవలెను. విషయసౌఖ్యములు తాత్కాలికములు. కనుక విషయసౌఖ్యములను మానవుడు విడనాడవలెను. వాటిని అనుభవించినకొలది దుఃఖప్రాప్తియేగాని సుఖము యెంతమాత్రము కలుగదు.

మృగాదులు ఇంద్రియసుఖములకు లోబడి పతనమును పొందుచున్నవి. కనుక మానవులు మృగసమానులుగాక వారికిగల జ్ఞానమువలన ఇంద్రియసుఖములను నియమించుకొనవలెనని తెలుసుకొనగలరు. జ్ఞానము నొందతలచిన మనుజులు

ప్రాపంచిక విషయసుఖములను పూర్తిగా విడనాడవలెను. మనుజుడు తా నొకరికంటె అతిశయుడనని చెప్పుడు అహంకారమునొందకూడదు. మనుజునికి అహంకారము జయించు కీలుకేవి శత్రువని తలంచగలరు.

శ్లో॥ ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవచ,
జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్॥ 13 - 8

మనుజుడు తనకు కలిగిన జన్మకు కారణమును, మాతృగర్భగోళములో అనుభవించిన కష్టపరంపరలను, అట్టి సమయమున తనకుగల అజ్ఞానమును విడువవలయును. కామక్రోధముల విడనాడవలెను. సద్గురువును ఆశ్రయించి భవసంబంధమగు బంధమును విడగొట్టుకొనవలెను. ఇత్యాదిగుణములతో సంచరించుటయే జ్ఞానమని యెరుగవలెను. ఇట్టి జ్ఞానమును మాతృగర్భమునుంచి భూపతనమైనవెంటనే, ప్రకృతి (మాయ) వలన ఆవరింపగ బమరచిపోయి-మానవుడు ప్రాపంచిక భ్రాంతికి వశీకృతుడగుచున్నాడు. జ్ఞానమును పొంది దేహభ్రాంతిని విడువవలయును. ఎట్టివారికిని మృత్యువును జయించుట దుర్లభమని తలంచవలెను. మనుజునకు పెండ్లికి మించినసుఖము లేదు. మృత్యువుకంటె యెక్కువ కష్టము లేదు. మానవునకు విధిగా ప్రాప్తించు వార్థక్యమును సర్వకాలమందు జ్ఞాపకముంచుకొనవలెను. మానవుని శరీరమందుగల అపరిశుద్ధపదార్థములు వ్యాధిగ్రస్తుడైన సమయమున బయల్పడును. వాటిని యెంత మాత్రము మరువకూడదు. శరీరముయొక్క అందచందములను విలోకించి జీవుడు యెప్పుడును శరీరముమీద ఆశపెట్టుకొనకూడదు. వస్త్రము కాలానుగుణ్యముగ యేవిధముగా జీర్ణించి

చినిగి నిరుపయోగ మగునో, అవిధముగనే శరీరము కాలాను గుణ్యముగా జీర్ణించుట దైవవిధిగా తెలుసుకొనవలెను.

10. వైరాగ్యము : భార్య, బిడ్డలయందును, యితరుల యందును, ఆస్తులయందును, మనుజుడు యెక్కువమమకారము నుంచగూడదు.

11. ఏకాంతము : ఏకాంతస్థలమున మానవుడు యేకాకిగా కూర్చుండి భగవంతుని ఆరాధించుటవలన ఆధ్యాత్మిక తలంపులు కలిగి చిత్తశుద్ధి, మనశ్శాంతి, లక్ష్యశుద్ధియేర్పడును.

12. సాధు సాంగత్యము: మంచివారితో సహవాసము, ప్రాపంచిక విషయలంపటతో నిమగ్నులైనవారికి అమృత ప్రాయము. విషయసౌఖ్యములను విసర్జించుట ఆత్మయోగమునకు ప్రధానము. కాన సాధు సాంగత్యము మనుజునకు ముఖ్య అవసరముగా తెలియవలెను.

13. జీవాత్మ పరమాత్మల సంబంధము : జీవులు సర్వ కాలమందును ఆత్మవిచారము చేసిన, జీవాత్మ పరమాత్మల సంబంధము తెలియగలదు. మానవుడు జీవనకాలమును యెంతమాత్రము వ్యర్థపరచరాదు. జ్ఞానము సంపాదించి ఆత్మ తత్త్వమును పూర్తిగా యెఱుగవలయును.

అన్ని జన్మలలోను ఉత్తమమైన నరజన్మ లభించినప్పుడు, దానిని వృథాచేయక ఆత్మతత్త్వమును గుర్తెరిగి, తరుణోపాయమును సాధించవలెను. "నేను" అనునది యెక్కడ నున్నది? ఎక్కడనుండి వచ్చినది? ఎక్కడ లయమగుచున్నది? ఇది తెలిసికొనుటయే వేదాంత విద్యయని గ్రహించవలెను.

"నైనం ఛిందంతి శస్త్రాణి" ఆత్మకు నాశము లేదు. కనుక ఆత్మ పరమాత్మల ఐక్యానుసంధానమును సాధనవలన గ్రహించి మానవులు మోక్షరూపమగు శాశ్వతానందమును పొందవలెను.

(1) అనాది: ఎనుబదినాలుగు లక్షల యోనివర్గములకు మూలము. ప్రారంభము లేనిది. పరమాత్మ, జీవుడు, ప్రకృతి, యీ మూడును అనాదులు.

(2) సత్–అసత్ : ఆత్మవస్తువును సత్ అని కాని, అసత్ అని కాని నిర్ణయించి చెప్పవీలుకాదు. ఆత్మ సద సత్తుల కతీతము.

ప్రత్యక్షముగా కనుపడుదానిని లేక జ్ఞానేంద్రియముల ద్వారా గ్రహించగలుగు దానిని మాత్రమే సత్ అని చెప్ప వీలుగాదు.

ఆత్మవస్తువు ఇంద్రియములకు గోచరముకానిది. అంత మాత్రముననే లేదనుటకు వీలులేదు. ఉన్నదని చెప్పుటవలననే, పంచేంద్రియములు పనిచేయుచున్నవి. జ్ఞేయము విచిత్రమైన తత్త్వము. ప్రాపంచిక విషయములవలె యిది ఉన్నదనిగాని, లేదని గాని చెప్పుటకు వీలులేదు. కొందరు వ్యాఖ్యాతలు జీవాత్మ సత్ అనియు, జడ ప్రకృతిమాత్రమే అసత్ అనియు విమర్శించి యున్నారు.

(3) జ్ఞేయవస్తువు : ఇది పరబ్రహ్మమని తెలియవలెను. మానవులు పరమాత్మసాక్షి అనుకొనుట బ్రహ్మభావన. బ్రహ్మ భావనను మనుజుడు కలిగియుండవలెను.

(4) తేజస్సు: తేజస్సు అన్ని వస్తువులయందుండి వాటిని ప్రకాశింపచేయుచున్నది. ఇంద్రియములను ప్రకాశింపజేయునది జీవాత్మయైనను, ఆయనను గ్రహించుటకు ఇంద్రియముల శక్తిజాలదు. పురాణములు, ఇతిహాసములద్వారా పరమాత్మను తెలిసికొనుట అసంభవము.

పరమాత్మవల్ల నిర్మింపబడిన వాక్స్థానము పరమాత్మ యిట్టివాడని నిరూపించజాలనందున, బ్రహ్మవస్తువు యెంత మాత్రము ఒకరివల్ల గ్రహించబడునది కాదని తెలియవలెను.

(5) సర్వాంతర్యామి: చరాచరాత్మకమైన ప్రపంచమందును, అండజ, స్వేదజ, ఉద్భిజ్జ, జరాయుజ ములుమున్నగు వాటి లోపల, బయట, మధ్యలోనున్నాడు. కాన సర్వాంతర్యామిగా ఈశ్వరుని తెలియవలెను. అజ్ఞాన నిమగ్నులగు మనుజులు యీ విషయమును గమనించజాలరు.

(6) సూక్ష్మము: పరమాత్మను కంటికి గోచరముకాని సూక్ష్మవస్తువుగా తెలియవలెను. పరమాత్మ దూరమునందును, సమీపమందును వున్నాడని ఇంద్రియనిగ్రహముగల వారు మాత్రము తెలియగలరు. ఇంద్రియ మనోనిగ్రహములు లేని మూఢులకు పరమాత్మ చాలా దూరస్థుడై యున్నాడు.

అంతఃకరణ అద్దమువంటిది. అద్దము మాలిన్యముగానున్నపుడు మన ప్రతిబింబము చక్కగా తెలుసుకొనబడదు. ఆవిధముగా అంతఃకరణ మాలిన్యము పోనిది మానవుని అజ్ఞానము నశించి, ఆత్మప్రతిబింబించదు. అజ్ఞానము తొలగిన కాని ఇంద్రియనిగ్రహము కలుగనేరదు. అజ్ఞానమువలన పరమాత్మను తెలుసుకొనజాలడు.

మానవునికి జీవకారుణ్యము, భూతదయ, పశ్చాత్తాపము లున్నచో, పరమాత్మ సాక్షాత్కారము కలుగుట కవకాశమున్నది.

పరమాత్మను తెలుసుకొనుటకు ఆరుయోగములు గలవు. (1) ధ్యానయోగము (2) రాజయోగము (3) జ్ఞాన యోగము (4) కర్మయోగము (5) భక్తియోగము (6) ప్రార్థ యోగము.

సృష్టికిలోనైన అన్నివస్తువులను పరమాత్మ తన మహిమ వలన చైతన్యయుతముగా చేయుచున్నాడు. చైతన్యములేని జడపదార్థము సృష్టిలో లేదు.

ఉత్తమజన్మనెత్తిన మానవులు కాలము వృథాపుచ్చిన యెడల అధోగతిపాలై హీనజన్మముల నెత్తుదురు.

శరీరము, ఆత్మ, పరమాత్మల అన్యోన్య సంబంధములను తెలుసుకొనగలవారు ఇహపరసుఖముల ననుభవించి జన్మాంతర మందు మోక్షమును పొందుచున్నారు. "భూతప్రకృతి మోక్షంచ" ప్రకృతిలోనుంచి విడుదల బొందుమార్గము రాబోవు అధ్యాయముయొక్క పీఠికగా తెలియవలెను.

## సారాంశము

బ్రహ్మవిద్యకు క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ జ్ఞానము పరమావసరము. బ్రహ్మమునిత్యము. క్షేత్రములు-అనిత్యములు. క్షేత్రజ్ఞుడు నిత్యుడు, క్షేత్రములనిత్యములు. సాంఖ్యయోగాధ్యాయమునందు దేహినిత్యుడనియును, దేహ మనిత్యమనియును తెలుపబడినది. బ్రహ్మసూత్రములు, తత్త్వశాస్త్రములు సహే

తుకముగా క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానమును స్థిరపరచినవి. ప్రకృతియందు క్షేత్రము దేహము. క్షేత్రమును తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు. ఆతడు సకలక్షేత్రములయందును సర్వవ్యాపియైన పరబ్రహ్మముగా నున్నాడు.

బ్రహ్మము క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయము సకలహృదయములందును సుప్రతిష్ఠితములు. అవి సమస్త భూతములయందు సమముగనుండును. పురుషుడు ప్రకృతియందు గుణముల ననుభవించుచుండినను, బ్రహ్మజ్ఞాని బంధములకు లోనుగాడు. సకలక్షేత్రములందును ఆత్మక్షేత్రజ్ఞుడు. సకల క్షేత్రములందును క్షేత్రి పరబ్రహ్మము. జగత్తునువలె క్షేత్రమును పరబ్రహ్మము ప్రకాశింపజేయుచున్నాడు. జ్ఞానులు ధ్యానము, యోగము, సాంఖ్యము, మొదలగు సాధనములచేత క్షేత్రక్షేత్రజ్ఞానమును పొంది, పురుషార్థము సాధించుచున్నారు.

# చతుర్దశోధ్యాయము

## గుణత్రయవిభాగయోగము

ఈ అధ్యాయమునందు నిర్గుణమైన బ్రహ్మమును, ఆత్మను, సత్త్వరజస్తమోగుణములు గుణరాగసంగులను చేయుచున్న విధము తెలుపఁబడియున్నది. సకల క్షేత్రములందును క్షేత్రజ్ఞుఁడు గుణబద్ధుఁడై, సుఖదుఃఖముల ననుభవించుచుండును. యోగులు క్షేత్రములందు ప్రకృతిగుణముల ననుభవించుచున్నను గుణబద్ధులుగారు.

త్రిగుణాత్మకమైన ప్రకృతియందు గుణాతీతుఁడైన పరమేశ్వరుఁడు భూతాసక్తుఁడు కాకుండ, భూతములను భరించుచున్నాఁడు. క్షేత్రజ్ఞుఁడు త్రిగుణాత్మకమైన క్షేత్రమును అనాసక్తయోగియై భరించుచున్నాఁడు. నిర్ద్వంద్వుఁడు, నిత్యసత్త్వస్థుఁడు మాత్రమే బ్రహ్మవిద్యాధికారి యని తెలియవలెను. అనన్యమైన భక్తియోగము బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనము. త్రిగుణాతీతమైన ఆత్మసాక్షాత్కారమునందు బ్రహ్మత్వము సాధ్యమగుచున్నది. సకలభూతముల హృదయములయందును ఆత్మరూపమున సమవస్థితమైన పరమేశ్వరానుభవము బ్రహ్మవిద్యకు ఫలము.

ఈ యధ్యాయమునగల ౨౭ శ్లోకముల ద్వారమున త్రిగుణములు దేహిని దేహమునందు బంధించుచున్న విధమును, సత్త్వరజస్తమో గుణఫలములును తెలుపబడెనవి. జ్ఞాని తాను గుణాతీతుఁడై దేనికిని కర్తను కాదని తెలుసుకొనిన

యెడల కలుగు ఫలమును, భగవద్భక్తులు త్రిగుణముల కతీతులై బ్రహ్మభూతులగుటవలన కలుగు ఫలితమును, సకల భూతములకును భగవంతుడు సూత్రకారుడను విషయమును యీ అధ్యాయమునందు తెలుపబడియున్నది.

జీవుని యేవిధముగా ప్రకృతి బంధించుచున్నది యీ అధ్యాయము తెలియజేయును. మునీశ్వరులుకూడ దేనిని తెలుసుకొని మోక్షము నొందిరో అట్టిదానిని పరమాత్మ మానవుల కందరికి చెప్పుచున్నాడు. ఈ అధ్యాయము అత్యంత ప్రధానమైనదని ఆత్మయోగపరులు భావింతురు. జ్ఞానులు, జనన మరణములకు, సృష్టి సంహారములకు అతీతులు. జ్ఞానము పొందినవారికి మోక్షము కలుగును. ఈ చరాచరాత్మక ప్రపంచమందుగల ప్రతివస్తువుయొక్క ఉత్పత్తికి, స్త్రీ పురుష సంయోగముండవలయును. అట్లే ఈ ప్రపంచ సృష్టికిగూడ తల్లిదండ్రు లుండవలయునుగదా! పరమాత్మ ప్రపంచమునకు తండ్రియని, ప్రకృతి (మాయ) ప్రపంచమునకు తల్లియని తెలియవలయును. ప్రపంచమునకు తండ్రియైన పరమాత్మ స్త్రీతత్త్వమైన (మాయ) ప్రకృతితో కలసినప్పుడు సర్వభూతములును సృష్టియగుచున్నవి. ప్రపంచమునందుగల 84 లక్షల యోనివర్గములును ప్రకృతిలోనుండి పరమాత్మ తేజస్సువల్లనే సృష్టింపబడుచున్నవి.

ప్రకృతి (మాయ) త్రిగుణాత్మికము : (1) సత్త్వగుణము, (2) రజోగుణము, (3) తామసగుణము : జీవుడు పరమాత్మను చేరి సుఖపడుటకు జన్మతః హక్కుగలదు. కాని త్రిగుణాత్మికమైన ప్రకృతి జీవుని పరమాత్మ సన్నిధికి చేరకుండ అడ్డగించు

చున్నది. ఎల్లమానవులకు అనివార్యముగ పైన తెల్పిన గుణము లుండును. కాని ఆ మూడుగుణములలో యేగుణము ప్రధానముగ నుండునో, అట్టి గుణలక్షణములు ప్రకటితమగుచుండును. (1) సత్వగుణము : జీవుని శాస్త్రప్రవచనములవల్ల జ్ఞానవంతుని చేసి సుఖేచ్ఛలో కట్టివేయుచున్నది. మానవులు ప్రాపంచిక సుఖములందు మిక్కిలి మోహముగలవారై పరమాత్మ సాన్నిధ్యమును పొందజాలకున్నారు.

(2) రజోగుణము : "రజో రాగాత్మకం విద్ధి" రజోగుణము ప్రాప్తమైనదానితో తృప్తిచెందనివ్వదు. ఈ రజోగుణము మానవునకు పేరాశను కలుగచేయును.

(3) తమోగుణము : "తమస్త్వజ్ఞానజం విద్ధి" తామసగుణముగల మానవుడు తన శరీరమునే ఆత్మగాను, శాశ్వతముగాను, తలచి పాపపుణ్యములను విచారించక ఆత్మవినాశక కార్యములను చేయుచు, ఆత్మ పరమాత్మల విచక్షణచేయక, దేహాభిమానముతో కాలము గడుపుచుండును. సహజముగ తమోగుణ ప్రధానులగు మానవులందు సంశయజ్ఞానము, నిద్ర, ప్రమాదము. మున్నగు గుణములు కన్పట్టును. సత్వగుణ ప్రధానులు దేహపతనము అయిన వెంటనే ఉత్తమజన్మలను పొందుదురు. రజోగుణముగలవారు జన్మాంతరమందు మధ్యమ యోనిలో ప్రవేశించి, మానవజన్మ మెత్తి, తత్సంబంధమైన కార్యములుచేయుదురు. తమోగుణ ప్రధానులు జన్మాంతరమున మూఢయోనులలో ప్రవేశించి, క్షుద్రజంతువులుగాను, వృక్షములుగాను జన్మించెదరు. పైనదెల్పిన త్రిగుణాత్మకమైన భేదములవల్ల మొదటి తరగతివారు ఉత్తమ స్థానము చేరుట

కును, రెండవ తరగతివారు యథాస్థితిలో నుండుటకును, మూడవ తరగతివారు తక్కువగతికి చేరుటకును కారణము కలుగుచున్నది.

ద్వంద్వములనగా: కష్టము-సుఖము, సుఖము-దుఃఖము, కలిమి-లేమి, ఉష్ణము-శీతము మొదలగునవి గా తెలియవలెను.

మానవులిట్టి ద్వంద్వములను సమబుద్ధితో అనుభవించవలెను. ద్వంద్వగుణములయొక్క స్వభావమువల్ల యెంత మాత్రము చలించనివాడే స్థిరబుద్ధిగలవాడని తెలియనగును. పై ద్వంద్వగుణములతో కలసియుండు ప్రకృతిని (మాయ) దాటుటకు పరమాత్మను నిశ్చలభక్తితో, శ్రద్ధతో, భజించవలెను. భక్తిలేని కర్మానుష్ఠానము యెంతమాత్రము ప్రయోజనకారిగాదని తెలియవలెను.

శ్లో॥ బ్రహ్మణోహి ప్రతిష్ఠాఽహ మమృతస్యా వ్యయస్యచ,
శాశ్వతస్యచ ధర్మస్య సుఖస్యైకాన్తికస్యచ॥ (14 అ 27).

నిత్యమును నిర్వికారమును అయిన బ్రహ్మమునకును, శాశ్వతమైన ధర్మమునకును, నిరతిశయానందమునకును భగవంతుడే ఆశ్రయుడుగదా. అహంతత్త్వము పరమేశ్వరునకు వలెనే ప్రత్యగాత్మకును వర్తించుచున్నది. ఆత్మయోగము బ్రహ్మత్వమునకును, ధర్మమునకును, ఆనందమునకును, పరమ సాధనము.

## సారాంశము

ఏకము, అద్వితీయము, అవ్యక్తమునగు బ్రహ్మము ప్రకృతియందనంతములైన నామరూపముల మూలమున వ్యక్త

మగుచున్నది. ఈశ్వరుడు సర్వక్షేత్రములయందును సమముగ నున్నాడు. నిర్గుణుడైన పరమేశ్వరుడు గుణసంగుడు కాకుండనే ప్రపంచనాటకమును నడుపుచున్నాడు.

ప్రకృతి సంభవములయిన సత్త్వరజస్తమోగుణములు క్షేత్రములయందు అనంతములైన రూపగుణభేదములు కల్పించుచున్నవి. నిర్మలమైన సత్త్వగుణము సుఖమునకును, జ్ఞానమునకును, ప్రకాశమునకును సాధనము. రజోగుణము రాగమునకు, తృష్ణకు, కర్మాసక్తికి కారణము. తమోగుణము, అజ్ఞానమునకును, మోహమునకును మూలము. సత్త్వరజస్తమోగుణముల పరస్పర సంఘర్షణలు వివిధరూపమున పురోవృద్ధి పతనములకు సాధనములగుచున్నవి. సర్వమునందును సమబుద్ధిగల ఆత్మయోగులు గుణబద్ధులుగాక సర్వద్వారములయందును ప్రకాశముగలిగి సత్త్వసంపన్నులగుచున్నారు. సత్త్వసంపన్నులు బ్రహ్మవిద్య కధికారులు. సకలక్షేత్రములందును సమముగనున్న ఆత్మ, ధర్మమునకు సుఖమునకు నిరతిశయానందమునకు ప్రధానస్థానము.

# పంచదశోధ్యాయము

## పురుషోత్తమ ప్రాప్తి యోగము

శ్లో॥ ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్,
ఛందాంసి యస్యపర్ణాని యస్తంవేద సవేదవిత్॥ 15 అ 1

ఈ అధ్యాయము పై శ్లోకముతో ఆరంభమగుచున్నది. "అశ్వత్థ" శబ్దము సామాన్యముగ వాడుకయందున్న అశ్వత్థ వృక్షమును స్ఫురింపచేయుచున్నది. గీతాశాస్త్రమందు "అశ్వత్థ స్సర్వవృక్షాణాం" అని భగవంతుడనుట కిదే కారణమై యున్నది. వేదవిదులను అశ్వత్థవృక్ష దృష్టాంతముతో వర్ణించుట సాధ్యముకాదు. పురుషోత్తముడు దిక్కాలాద్యనవచ్ఛిన్నుడు. కాలాతీతుడైన పురుషోత్తముని నిత్యునిగ వర్ణించుట సమంజసము. అందువలన అశ్వత్థమునకు అశ్వత్థవృక్షార్థమును చెప్పుటకన్నను కాలాతీతార్థమును గ్రహించుటయే యుక్తము. "అశ్వత్థః" శాశ్వతముకానిది-రేపు వుండనిది.

సృష్టిక్రమము : ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, ఈ విధముగ ప్రపంచము పరిణమించినట్లు గీతా శాస్త్రమందు తెలుపబడినది. ఆకాశమునకంటె అతీతమైన పరబ్రహ్మము పురుషోత్తముడని వేదవిదులు తెల్పినారు. ఆకాశమంతా వ్యాపించి దానిని అతిక్రమించికూడాయున్న పురుషుని తెలుసుకొన తగిన మార్గము ఈఅధ్యాయమునందు తెలుపబడినది. వెనుకటి అధ్యాయములందు తెలిపిన మార్గములనే యిందును మరొక విధముగ తెలుపబడియున్నది.

మానవదేహములో ఊర్ధ్వమూలమునందున్న సహస్రారము బ్రహ్మస్థానమని పరిగణింపబడుచున్నది. ఆ మూల స్థానమునుండి సకలేంద్రియములును గుణప్రవృద్ధములై శాఖోపశాఖలుగ విలసిల్లుచున్నవి. ఈ రహస్యమును తెలిసిన యోగులు ప్రవృత్తియందు ప్రవర్తించుచున్నను నిస్సంగులై బ్రహ్మవిద్యాధికారులగుచున్నారు.

పైన మూలమును క్రిందకొమ్మలును గలదియును, వేదము లాకులుగ గలదియును అగు అశ్వత్థమును అవ్యయమని చెప్పుచున్నారు. ఆ అవ్యయతత్త్వమును తెలుసుకొనిన వారు వేదవిదులు.

విభూతియోగమునందు "అశ్వత్థస్సర్వవృక్షాణాం" అని అశ్వత్థ వృక్షరూపమున పరమేశ్వర విభూతి నిర్వచింపబడినది. ఆ నిర్వచనమే ఈ అధ్యాయమునందలి 'అశ్వత్థము' అవ్యయమనియును, వేదములు పర్ణములుగ గలదనియును వర్ణింపబడినది. అశ్వత్థమునకు వైదికసాంప్రదాయమునందు యేమి గూఢార్థముకలదో నిర్ణయించుటకు సాధ్యముకాదు. శంకర రామానుజాచార్యాదులు అశ్వత్థమునకు సంసారవృక్షమను అర్థమును కల్పించిరి. ఈ యధ్యాయమందు పురుషోత్తముడు క్షరాక్షరాతీతుడుగ నిర్దేశింపబడిన బ్రహ్మము. ఊర్ధ్వమూలమును అధశ్శాఖలునుగల అశ్వత్థము, బ్రహ్మమని యీ అధ్యాయమునందు తెలుపబడినది. తర్వాత శ్లోకములయందలి అశ్వత్థార్థమును ఈ భావముతోనే గ్రహించుట యుక్తము. సృష్టి క్రమమున ఆకాశమునుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుండి నీరు మొదలగునవి పుట్టుచున్నవి. శబ్దము వేదపరిణామ

మును పొందుచున్నది. వేదములు సహజముగ బ్రహ్మకు పర్ణములు. చతుర్వింశతి తత్త్వములను జయించి బ్రహ్మవిద్యను సంపాదించగల విధానము, ఈ అధ్యాయమునందు వివరింపబడినది. దేహమునందు సహస్రారము బ్రహ్మస్థానము. ఊర్ధ్వమునుండి జ్ఞాన కర్మేంద్రియాదులు శాఖోపశాఖలుగ గుణప్రవృద్ధములై దేహమునందు వ్యాపించుచున్నవి. వానిని తెలిసికొనుటయే బ్రహ్మవిద్యకు మార్గము.

ఈ అశ్వత్థవృక్షముయొక్క పూర్ణమైన రూపముగాని, ఆది మధ్యాంతములుగాని తెలియశక్యముగాదు. పాతుకున్న వేళ్ళుగల యీ సంసార రూపమైన అశ్వత్థమును నిష్కామ సాధనముచేత గట్టిగా భేదించి, పిమ్మట యెచ్చటనుండి ఈ అనాదియైన ప్రవృత్తి గలిగినదో, యెక్కడికిపోయిన పునరావృత్తికలుగదో ఆ పదమునన్వేషించి, ఆ యాదిపురుషుని శరణు బొందవలయును.

దేహాభిమానము విడిచినవారును, నిస్సంగులును, నిరహంకారులును, ఆత్మయోగులును, కామవర్జితులును, ద్వంద్వాతీతులును అయిన జ్ఞానులు నిత్యమైన మోక్షపదమును పొందుచున్నారు. మోక్షపదము పునరావృత్తిరహితమయినదియును, సూర్యచంద్రాగ్నుల ప్రకాశమున కతీతమైనదియునైన యుత్తమస్థానమైయున్నది.

జీవుడు : దేహమునందు మనస్సును, శ్రోత్ర త్వక్చక్షుర్జిహ్వా ఘ్రాణేంద్రియములను అధిష్టించి శబ్దస్పర్శరూపరసగంధముల ననుభవించుచుండును. జీవుడు గుణాన్వితుడై దేహమునుండి వెడలుట, దేహమున నుండుట, సుఖములను అనుభవిం

చుట మొదలగు కార్యములను జేయుచుండుటను వివేకులు కనుగొన జాలుదురు. కాని, అజ్ఞానులు దానిని తెలియజాలరు. ఆత్మయోగతత్వము తెలియని పామరులు పరమాత్మను తెలుసుకొనజాలరు. ఏ తేజస్సుచేత సూర్యచంద్రాదులు ఈ చరాచరాత్మక ప్రపంచమును ప్రకాశింపచేయుచున్నారో అట్టి తేజస్సు పరమాత్మ తేజస్సుగా తెలియవలెను. అది సూర్యచంద్రాదుల స్వశక్తివలన కలిగిన తేజస్సుకాదు-వారికట్టి స్వశక్తిలేదు.

పరమాత్మ భూమియందుండి బీజశక్తిద్వారమున భూతములను ధరించుచున్నాడు. అతడే చంద్రుడై సమస్త సస్యములను పోషించుచున్నాడు. మానవులు ప్రతిదినము భుజించు ఆహారమును పరమాత్మ వైశ్వానరరూపమున జీవులయందున్నవాడై, ప్రాణాపానాది వాయువులతో జీర్ణింపజేసి, మానవుల దేహమును, బుద్ధిని, వృద్ధిపొందించుచున్నాడు. జ్ఞాపకశక్తి-మరుపు-జ్ఞానము పరమాత్మవల్లనే మానవులకు కలుగుచున్నవి. వేదవేదాంత శాస్త్రములద్వారా పరమాత్మను మానవులు తెలుసుకొనగలరు. వేదములను తెలిసినవాడును, వేదాంతకర్తయును, పరమాత్మయే అయియున్నాడు. జగత్తునందు రెండువిధములగు పురుషులుగలరు. వారు క్షరులు, అక్షరులు. సకలభూతములును క్షరమనియును, కూటస్థుడు అక్షరుడనియును తెలియవలెను. ఈ ముల్లోకములను రక్షించుచున్నవాడే పురుషోత్తముడు. ఆయనయే పరమాత్మయని తెలియబడుచున్నాడు. క్షర అక్షరములకు అతీతుడైనందున లోకమునందును, వేదములందును, పరమాత్మ పురుషోత్తముడని ప్రసిద్ధికెక్కినాడు.

అర్జునా! ఎవడు జ్ఞానవంతుడై నన్ను పురుషోత్తమునిగా

తెలుసుకొనుచున్నాడో వాడు సకల వేద వేదాంగములు తెలిసినవాడై సకలభావములచేత నన్ను పూజించుచున్నాడు.

సారాంశము

ఈ అధ్యాయమునందు గీతాప్రయోజనమైన గుహ్యతమ శాస్త్రవిషయము తెలుపబడినది. పరమేశ్వరుడు సర్వహృదయములందును వుండి భూతజాలమునకు జ్ఞానము, సమ్మోహనము కలుగ జేయుచున్నాడు. నిత్యుడైన జీవుడు, కర్మానుభవమును వాయువు గంధమునువలె, మరణసమయమున కొనిపోవుచున్నాడు. లోకమునందు క్షరాక్షరులుగలరు. క్షరములైన భూతములు నశించునపుడు అక్షరుడు జన్మవాసనలను గొనిపోవుచున్నాడు. సర్వవ్యాపకమైన ఆత్మను పరమాత్మయైన పురుషోత్తముడు అధిష్ఠించుచున్నాడు. జగత్తునందు త్రిగుణములు ఆద్యంతములేక, జీవుని కర్మబద్ధుని జేయుచున్నవి. వేదవిదులు అసంగ శస్త్రముచేత, త్రిగుణ సంజాతములైన విషయవాసనలను ఛేదించి మోక్షమార్గమును నన్వేషించుచున్నారు. మోక్షమార్గాన్వేషణమునకు నిష్కామ కర్మయోగము సాధనమై, ఆత్మయోగమును సాధ్యము చేయుచున్నది. ఆత్మయోగమునకు దైవీసంపద సాధనముగనున్నది. దైవీ సంపద కధికారలక్షణములు గూడ నీ అధ్యాయమునందు సువ్యక్తము చేయబడినవి. గీతాశాస్త్రమందు పురుషోత్తమ ప్రాప్తివిధానమును సువ్యక్తముచేయు నీ అధ్యాయమును మానవులు నిత్యము పారాయణచేసి పురుషోత్తమ పదవిని పొంద యత్నింతురుగాక!

# షోడశోధ్యాయము

## దైవాసురసంపద్విభాగయోగము

ప్రవృత్తియందు మానవులకు సుఖదుఃఖములు, లాభనష్టములు, జయాపజయములు వారి కర్మానుసారముగ కలుగుచుండును. అభయము, అంతఃకరణశుద్ధి, జ్ఞానయోగము, స్వాధ్యాయము, అహింస, సత్యము, శాంతము, క్షమ, మొదలగు సద్గుణములుగలవారు ప్రపంచమునందు అరుదు. అట్టివారు సుఖమును, మోక్షమును పొందుచున్నారు. అసురసంపన్నులు దుష్పూరమైన కామమునాశ్రయించి, కామభోగపరాయణులై, దంభాహంకారములను, స్వాభిమానపరాయణత్వమును పూని, పరపీడనము చేయుచు, దుఃఖమును పొందుచు అధోగతి పాలగుచున్నారు. వారుచేయు దానములు, యజ్ఞములు, దంభాహంకారసంయుక్తములై నిరర్థకములగుటయేగాక, ప్రతిబంధకములగుచున్నవి. అసుర సంపన్నులకు, కామ, క్రోధ, లోభములమీదగల అభిమానము-ఆత్మయందు వుండదు.

మానవులకు కార్యములు నిర్వహించుటయందు, వాటిని విడుచుటయందు శాస్త్రమే ప్రమాణము. శాస్త్రము ననుసరించుటధర్మము. ఈఅధ్యాయమునందుమానవుల,దుష్కృతసుకృత స్వభావములు తెలుపబడినవి. ధీరులు త్యాగులు, జ్ఞానులు, అనుభవజ్ఞులు ప్రవృత్తియందు తాము దైవీసంపదల నారాధించుచు, నితరులకు, మార్గదర్శకులుగ నున్నారు. ధనాధికారాభిమానులు-కామ క్రోధముల నారాధించుచు యితరులకు

దుఃఖమును కలుగజేయుచు, తాము దుఃఖముల ననుభవించుచున్నారు. దైవసంపదల నారాధింపగల విధము-శ్రద్ధాత్రయ విభాగయోగమునందు వివరింపబడినది.

శ్లో॥ అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః,
దానం దమశ్చ యజ్ఞశ్చ, స్వాధ్యాయ స్తప ఆర్జవం॥ (16 అ 1)

శ్లో॥ అహింసా సత్యమక్రోధః త్యాగశ్శాంతి రపైశునం,
దయాభూతేషు అలోలుప్త్వం మార్దవం హ్రీః అచాపలం॥ (16 అ 2)

శ్లో॥ తేజః క్షమాధృతిశ్శౌచం అద్రోహోనాతిమానితా,
భవంతి సంపదం దైవీం అభిజాతస్య భారత॥ (16 అ 3)

(1) అభయము - భయములేకుండుట. (2) సత్త్వసంశుద్ధి - మనశ్శుద్ధికలిగి భగవంతునిమీద ఆధారపడియుండుట, (3) జ్ఞానయోగవ్యవస్థితిః - శాస్త్రాచార్యోపదేశమునుపొంది, ఆత్మానాత్మ వివేక జ్ఞానముతో ప్రవర్తించుట. (4) దానము - జీవులను అన్నపానాదులనిచ్చి ఆదరించుట. (5) దమము - బాహ్యేంద్రియనిగ్రహమును బడయుట. (6) యజ్ఞము - లోక కల్యాణప్రదమగు కార్యములనుచేయుట. (7) స్వాధ్యాయము - ప్రమాణ గ్రంథములనుపఠించుట, (8) తపము శరీరవాఙ్మనో నియమములతో భగవంతు నారాధించుట. (9) ఆర్జవము - ఋజుభావముతో, ఆత్మసాక్షిగా ప్రవర్తించుట (10) అహింస - మనోవాక్కాయముల యందుకూడా పర పీడనగావింపకుండుట. (11) సత్యము - అప్రియూ అనృత వర్జనమగు సంభాషణచేయుట. (12) అక్రోధము - ఇతరుల యందేమాత్రము కోపతాపములు లేకుండుట. (13) త్యాగము భగవంతునికి సర్వసమర్పణముచేయుట. (14) అపైశునము -

ఇతరుల తప్పులనుకనుగొనుటకై యత్నించకుండుట. (15) శాంతి-అంతరింద్రియ నిగ్రహముతో ప్రవర్తించుట. (16) దయాభూతేషు- యావత్సృష్టిలోని జీవజంతువులను దయతోచూచుట (17) అలోలుప్త్వం - విషయసుఖములకు దూరముగ నుండుట. (18) మార్దవము - ప్రేమతోకూడిన సౌమ్యస్వభావము కలవాడుగానుండుట. (19) హ్రీః-విధ్యుక్తధర్మవిరుద్ధకార్యము లందు లజ్జకలిగియుండుట. (20) అచాపలం - ఇంద్రియ చాంచల్యము లేకుండుట. (21) తేజస్సు - భగవద్విశ్వాసముతో కూడిన శూరశక్తి ప్రకటించుట. (22) క్షమ - కష్టసహనశక్తి గలిగి ఓర్పుతో ప్రవర్తించుట. (23) ధృతి - భగవద్రక్షణతో కూడిన ధైర్యము. (24) శౌచము - పరిశుద్ధ నడుంగని బాహ్యాభ్యంతరభావము. (25) అద్రోహము - ద్రోహచింతన లేకుండుట. (26) నాతిమానిత్వము - స్వాతిశయము లేని ప్రవర్తనము. ఈ 26 గుణములును దైవలక్షణములని పిలువబడుచున్నవి. ఇవి దైవాంశసంభూతుల యందుండును.

## రాక్షసాంశములో పుట్టినవారి లక్షణములు

శ్లో॥ దంభోదర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవచ,
అజ్ఞానం చాభిజాతస్య పార్థ! సంపదమాసురీం॥ (16 అ 4)

(1) దంభము-ప్రగల్భములను చెప్పుట (2) దర్పము-ధనమదోన్మత్తత (3) అభిమానము - స్వీయగౌరవాదులయందభిమానము (4) పౌరుషభాషితనము - ఈ దుర్మార్గగుణము లన్నియు అజ్ఞానమువలన కలుగుచున్నవి. పరమ మూఢుడై, తాను శాశ్వతమనియెంచి, యితరులకు హింస కలిగించువాడు

రాక్షసాంశయందు పుట్టినవాడు. ఈ రాక్షస గుణములతో బుట్టినవానికి యీ పని చేయవచ్చును-ఇది చేయరాదు అను యోచన యుండదు. శుభ్రత, సదాచారము మొదలగునవి వుండవు. యథార్థము మాట్లాడడు. ఇట్టివారు నాస్తిక వాదమునే ప్రథమ విద్యగా నేర్చుకొందురు. ప్రపంచమును సృష్టించి, పోషించుచున్న కర్త లేడని రాక్షసీలక్షణములు కలవారందురు. స్త్రీ పురుషుల కొండొరులమీద నుండు కామాపేక్షయే సృష్టికి కారణమని వీరు వాదింతురు. ఇట్టి నాస్తిక దృష్టిని అవలంబించి, జీవితమును చెడగొట్టుకొని అల్పబుద్ధి కలవారై లోకులకు అహితమును, భయంకరమును అయిన పనులు చేయుదురు. ఇవి యన్నియు రాక్షసప్రకృతి యొక్క లక్షణములు.

రాక్షసాంశములో బుట్టినవారు భగవంతుని దగ్గరకు రాలేరు. దినములు గడచుకొలది వారు అధోగతి చెందుదురు. అట్టివారు మనుజులుగా జన్మించి భగవత్సాన్నిధ్యమును చేరు మార్గమును వెతకక, కామినీ కాంచనలోలురై మరణానంతరము పశుపక్ష్యాదులుగా జన్మించుచున్నారు. రాక్షసాంశములో బుట్టినవారధోగతి చెందుటకు కామ, క్రోధ, లోభములు ద్వారములు. దైవాంశము కలిగినవారికి సద్గతి కలుగుటకు నాల్గు ద్వారములున్నవి. ఇవి "ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, సంతోషము, సత్సాంగత్యము"ని ఉపనిషత్తులలో చెప్పబడినది. నరకద్వారములుకాన కామ, క్రోధ, లోభములను, మానవుడు వదలిపెట్టవలయును.

## సారాంశము

ప్రవృత్తియందు పుణ్య పాపములు, సౌందర్య వికారములు, సౌమ్య రౌద్రములు, సత్యాసత్యములు, ధర్మాధర్మములు మానవస్వభావములందు సహజముగ కలుగుచున్నవి. ఈ స్వభావములకు కారణము సత్త్వరజస్తమో గుణములు. సత్త్వగుణము గలవారు దైవీసంపన్నులై సుఖమునకు, మోక్షమునకు అధికారులగుచున్నారు. సత్త్వసంపన్నులు-యోగలక్షణములను, జీవయాత్రయందు అనుసరించుచు, స్వకర్మ, స్వధర్మారాధనమును చేయుచుందురు.

అసురసంపన్నులు - తమ దేహమునే ప్రధానముగా చూచుకొనుచు - దేహారాధనమునకై, తమ యావచ్ఛక్తిని వినియోగించుచున్నారు. దుష్పూరమైన కామము నాశ్రయించినవారికి కామ క్రోధలోభారాధనము చేయుట సహజముగ సంభవించుచున్నది. ఆద్యంతములు లేని విషయోపభోగములు, సుఖసాధనముగ కనుపడినను అంత్యమున దుఃఖభాజనములగుచున్నవి. అసురసంపన్నులు విషయసమ్మోహితులై, ఆత్మపీడనమును, పరపీడనమును చేయుచు తమ్మును అధోగతిపాలు గావించుకొనుచు, లోకమును అధోగతిపాలు చేయుచున్నారు.

ఈ అధ్యాయమునందు సుకృతులు శాస్త్రవిధానము ననుసరించి, స్వకర్మ, స్వధర్మారాధనము చేయుచు కృతార్థులు కాగలవిధము తెలుపబడినది.

# సప్తదశోధ్యాయము

## శ్రద్ధాత్రయ విభాగయోగము

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగములో నారంభింపబడిన బ్రహ్మవిద్యాప్రాప్తి సాధన, మీ యధ్యాయమునందు విపులము చేయబడినది. దేహాని తెలుసుకొనుటకు-దేహానే అద్య సాధనమైనను. దేహావాసన లాత్మజ్ఞానమునకు ప్రతిబంధకములుగ నున్న విధమును ౧౩, ౧౪, ౧౫, ౧౬ అధ్యాయములందు సువ్యక్తము చేయబడినది. గుణత్రయ విభాగయోగమందు సత్త్వరజస్తమోగుణములు సకలప్రాణులకును, దుఃఖకారణములగుచున్న విధము తెలుపబడెను. దేహవాసనలకు మూలబీజములైన కామక్రోధలోభములను జయించి, శాస్త్రప్రమాణముల ననుసరించి కర్మలనుజేయుట యోగశాస్త్రమూలమున బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనము అగుచున్నది.

కామక్రోధలోభములను జయించుటకు శ్రద్ధ యేవిధముగ నుపయుక్తమగునో అర్జునుడు వినగోరుచున్నాడు. శాస్త్రవిధానము ననుసరించక అశ్రద్ధతో చేసెడి కార్యములు, దంభాహంకారసంయుక్తములై స్వప్రయోజనమునకే విఘాతము కలుగజేయుచున్నవి.

ప్రతి మానవుడు బహిర్ముఖముగా చేయు పనులు వాని అంతఃకరణను వెలిబుచ్చుచున్నవి. శ్రద్ధ మానవుని అంతఃకరణను బట్టి యేర్పడుచున్నది. ప్రతి పురుషుడు శ్రద్ధామయుడు.

ఒక మంచిపనిలోగాని, చెడుపనిలోగాని జయము కలుగవలె నన్న ఆ పనియందు దీక్ష, ఏకాగ్రత ఉండి తీరవలయును.

శ్లో॥ యే శాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః,
తేషాం నిష్ఠా తు కా కృష్ణ! సత్త్వమాహో రజస్తమః. (17 అ 1)

శాస్త్రవిధుల ననుసరింపక, శ్రద్ధతో గూడినవారలై పరమాత్మను పూజించువారి నిష్ఠ యెట్టిది? సాత్త్వికమా? రాజసమా? తామసమా? అను ప్రశ్నను అర్జునుడు శ్రీకృష్ణుని అడిగినాడు. శ్రద్ధ మూడువిధములు. (1) సాత్త్వికశ్రద్ధ, (2) రాజసశ్రద్ధ, (3) తామసశ్రద్ధ - శ్రద్ధ అనగా ఆత్మవిశ్వాస యుతమగు ఏకాగ్రత. సాత్త్వికశ్రద్ధ అనగా, ఆత్మసుఖము నకు కారణమైన కర్మలుచేయుటలో చూపుశ్రద్ధ. ప్రఖ్యాతిన కొరకు, పేరు ప్రతిష్ఠకొరకు చేయుకర్మ, రాజసికశ్రద్ధతో కూడిన ప్రయత్నమని తెలియవలెను. ఇతరులకు హింసను కలుగించుపనులు చేయుటను తామసికశ్రద్ధ ప్రోత్సహించును.

మానవుడుచేయు కర్మలవల్ల వాని అంతఃకరణాభివృద్ధి తెలియవచ్చుచున్నది. శ్రద్ధకు అంతఃకరణకు అన్యోన్య సంబంధముగలదు. మానవుడు యెట్టి పనులు చేసినను, వాని యందు ఏకాగ్రత (శ్రద్ధ) యుండవలెను. మానవులుచేయు పనులనుబట్టి, వారి అంతఃకరణశుద్ధి, వారియందలి శ్రద్ధ తెలియబడును. మానవులుచేయు పనులు వారి ఆత్మపరిణామమునకు మూలము లగుచున్నవి. సర్వభూతసమత్వము ఆత్మయోగమునకు లక్ష్యము. మోక్షార్థులై, లోకకల్యాణ ప్రదమగు కర్మలు చేయువారు సాత్త్వికులు. ఇహలోక సుఖ, సంపదల నిమిత్తము కర్మలుచేయు మానవులు రాజసులు. క్షుద్ర దేవతలను

పూజించుచు ప్రజాపీడన కార్యములను జేయువారు తామసులుగా తెలియవలెను. యజ్ఞములలో కేవల మాత్మదృష్టితో చేయు జపయజ్ఞము శ్రేష్ఠము. స్మార్తులు అనగా శృతిప్రమాణులు. వారు జ్ఞానయజ్ఞములను ఆత్మయోగము ననుసరించి చేయుదురు. ద్వైతులు, విశిష్టాద్వైతులు చేయు యజ్ఞములందు పిష్టముతో యజ్ఞపశువునుచేసి దానిని వాడుదురు. స్మార్తులు (అద్వైతులు) ప్రత్యక్ష పశుయజ్ఞము చేయుచుండెడివారు. ప్రస్తుతము ప్రత్యక్ష పశుయజ్ఞములు వాంఛనీయముకాదు. శాస్త్ర విరుద్ధమును, ఘోరమును అగు తపస్సును, దంభాహంకార కామ రాగ దృష్టితో చేయువారును, పరపీడన కర్మలు చేయువారును, దేహమునందలి యింద్రియములను పరమాత్మను కృశింపచేయుచున్నారు. అట్టిమూఢులు అసుర నిష్ఠగలవారని తెలియవలెను. సమస్తజనులు భుజించు ఆహారముకూడ మూడువిధములుగా నుండును. తిను ఆహారము వల్లనే మానవులుచేయు కర్మలు మూడువిధములుగా పరిగణింపబడుచున్నవి.

సాత్వికులు యెల్లప్పుడు బలమును, ఆరోగ్యకరమును, ఆయుర్వృద్ధిని, సుఖసంతోషాతిశయములను కలిగించునవియును, రసవంతములైనవియును, చూచుట కింపైనవియును అగు పదార్థములను భుజించెదరు.

రజోగుణముగలవారలకు చేదును, పులుసును, ఉప్పును, మిక్కిలి వేడియును, కారము గలవియును, దాహమును యెక్కువగ కలుగచేయునవియును, దుఃఖ రోగములను కలుగచేయునవియునగు ఆహారములు ప్రియమగుచున్నవి.

తామసగుణము గలవారలకు వండియుంచిన నిలవ పదార్థములును, తినగా మిగిలిన యెంగిలి వస్తువులును పాసిపోయిన అపరిశుద్ధ పదార్థములును, కలసిన ఆహారములు ప్రియమైనవి.

నిష్కామదృష్టితో మనస్సునందు నిశ్చయించుకొని, శాస్త్రసమ్మతముగా చేయబడేయజ్ఞము సాత్త్వికయజ్ఞమనబడుచున్నది. ఫలాపేక్షతోను, లోకాడంబరముతోను, చేయుయజ్ఞము రాజసయజ్ఞమని తెలిసికొనవలయును.

అశాస్త్రీయముగ అన్నదానము, దక్షిణ లేకుండచేయు యజ్ఞము తామసయజ్ఞమని తెలియవలెను.

దేవతలను, గురువులను, ద్విజులను, జ్ఞానులను పూజించుచు శుచిత్వము, సత్ప్రవర్తనము, బ్రహ్మచర్యము, అహింస మొదలగు లక్షణములతో చేయునది శారీరక తపస్సనబడుచున్నవి.

సత్యము, ప్రియము, హితము, సౌమ్యతకలిగి వేదాధ్యయనముతో సంస్కరింపబడిన పరిశుద్ధ వాక్కును బడయు గాక యత్నము వాచకతపస్సని పిలువబడుచున్నది.

ప్రశాంతపూరితమగు మనస్సు, సౌమ్యస్వభావము, మౌనము, ఆత్మనిగ్రహము, అంతఃకరణశుద్ధి, అనునవి-మానసిక తపస్సునకు లక్షణములు. పైన తెల్పిన మూడురకముల తపస్సులు, శారీరక, వాచక, మానసిక తపస్సులని తెలియబడుచున్నవి. ఇతరులు తనను సత్కరించవలెనను భావముతో డంబముగా చేయునట్టి తపస్సు అస్థిరమును చంచలమును అగు రాజస తపస్సనబడును.

ఇతరులకు, తనకు, దుఃఖమును గలిగించునదియు-మూర్ఖపు పట్టుదలతో కూడినదియు నగు తపస్సు, తామస తపస్సనబడును.

దానములు మూడువిధములు : సాత్త్వికము, రాజసము-తామసము.

1. సాత్త్వికదానము : దేశకాల పాత్రలను గుర్తెరిగి ప్రత్యుపకార దృష్టితో కాక, విధిగా భావించి చేయు దానము-

2. రాజసిక దానము : ఫలమును, ప్రత్యుపకారమును, కోరి చేసెడు దానము రాజసిక దానమనబడును.

3. తామసిక దానము:అయోగ్యులకు నిందాపూర్వకముగను, నిర్లక్ష్యముగను దేశకాల పాత్రవిచక్షణము లేకుండ చేయు దానము తామసిక దాన మనబడును.

బ్రహ్మము : ఓమ్, తత్, సత్ అను మూడు శబ్దములతో నిర్దేశింపబడినది. అట్టి నిర్ణయము ననుసరించి బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములు పూర్వకాలమున ప్రచారములోనికి తేబడినటుల తెలియవలెను. బ్రహ్మవాదులు యే కార్యము చేయ నారంభించుచున్నను ఓమ్ అను పదము నుచ్చరించి ఆరంభించెదరు.

మోక్షమును గోరువారు యజ్ఞ, తపో, దానములు చేయుటకు ముందుగా 'తత్' అని ఉచ్చరించుచు వానిని చేయుదురు. "సత్" అను శబ్దము సద్భావమునందును, సాధుభావమునందును-పవిత్రమైన కర్మలయందును, ఉపయోగించబడుచున్నది.

యజ్ఞ తపోదానములతో సంబంధించిన నిష్ఠయును వానికి సంబంధించిన కర్మలును "సత్" అని చెప్పబడుచున్నవి.

శ్రేష్ఠ. భక్తి లేకుండ చేసిన యజ్ఞ యాగాది క్రతువులు దానములు-"అసత్" అని చెప్పబడుచున్నవి. అట్టివానివలన యిహాపరలోకములందు ఫలము గలుగదు.

ఈ పైన తెలిపిన విషయములన్నియు శ్రేష్ఠా, భక్తి మొదలగు అంశములస్థానమును తెల్పునవిగా తెలియవలెను.

## సారాంశము

ఆత్మారోహణమునందు పురుషుడు - శ్రద్ధామయుడు. ఎవ రెట్టి శ్రద్ధ గలవారో వారికి అట్టి స్థానము లభించుచున్నది. శ్రద్ధ సకల మానవుల సత్త్వమునకు అంతఃకరణాభివృద్ధికి అనురూపముగ పనిచేయుచున్నది. సకల కార్యములందును సత్యప్రవర్తన, సత్త్వమునకు ఆత్మాభివృద్ధికి సాధనమగుచున్నది. సత్త్వసిద్ధిని బడయుటకు సాత్త్విక ప్రవృత్తిని అభ్యాసము చేయుట అవసరము. సాత్త్వికాహారమువలన శరీరమును, సాధనకనుకూలించుస్థితియందుంచవలయును. వాక్కును, మనస్సునుకూడా సాత్త్వికస్థితియందుంచుటయే సమగ్ర సాధన విధానము. సకలకర్మలను ఫలాపేక్షలేక భగవదర్పణముగ చేయవలయును. సాత్త్వికులు, ఆహార విహారాదులను పాలింతురు. దేవతారాధనమునకన్న ఆత్మారాధనము చేయుటయే వారు ప్రశస్తముగా భావించి కృతార్థులగుచున్నారు.

సాత్త్వికులుగానివారలు శాస్త్రప్రమాణముల విడచి, దంభాహంకారయుక్తులై, యథేచ్ఛగా ప్రవర్తింతురు. కొందఱు శరీరమునకు కష్టమును కలుగచేయుపనులను చేయుచు, శరీరస్థుడైన పరమాత్మకును, ఇంద్రియ సమూహమునకును, బాధ కలుగచేయుదురు. ఇతరులకు పీడను కలుగచేయువలెనన్న యుద్దేశముతో చేసెడి తపస్సు ఆత్మహింసకే మూలమగుచున్నది. వీరు చేసెడి యజ్ఞ, దాన, తపస్సులు అశ్రద్ధతో కూడినవై, ఇహపరములకు నిరర్థకములగుటయేగాక ఆత్మాభివృద్ధికి ప్రతిబంధకము లగుచున్నవి.

# అష్టాదశోధ్యాయము

## మోక్ష సన్న్యాస యోగము

అర్జునునికి యుద్ధారంభమునందు కలిగిన సందేహమును యిప్పుడు పూర్తిగా నివృత్తి చేసుకొనుచున్నాడు.

సన్న్యాసాశ్రమ స్వీకారముతోనే మోక్షము లేదని పండితాభిప్రాయము. అందువలన ఆత్మతత్త్వమును గురించి యెంతవినినను సన్న్యాసమును గురించిన సందేహము తీరలేదు. అర్జునుడు సన్న్యాసతత్త్వమును, త్యాగతత్త్వమును, శ్రీకృష్ణుని వలన మరల వినగోరుచున్నాడు. కామ్యకర్మలను విడుచుట సన్న్యాసమనియును, కర్మఫలత్యాగము – త్యాగమనియును, శ్రీకృష్ణుడు స్పష్టముగ సమాధానము చెప్పెను. దేహధారులకు కర్మలను పూర్తిగావిడచుట శక్యముగాదు. ఫలత్యాగమే త్యాగమని చెప్పబడుచున్నది. ఆత్మశుద్ధికొఱకు సంగమును విడిచి కర్మలనుచేయుట సకలజనులకు క్షేమకరము, నియమిత ధర్మము. ప్రతిమనుజుడును స్వధర్మమును భగవదర్పితముగ జేయుచు తరించుచున్నాడు. కర్మలందు ఉచ్చనీచములు లేవు. ప్రతిమనుజుడు స్వధర్మాచరణమును, మమకారఅహంకారములు లేకుండా చేయుట పురుషార్థమునకుసాధనము. మానవులేకర్మలు చేసినను, ఈశ్వరకైంకర్యముగ భక్తితోచేసినచో, భగవంతుడు వానిని పాపములనుండి రక్షించును. త్యాగము రెండువిధములు. రాజసికము, సాత్త్వికము.

(1) రాజసిక త్యాగము: శరీరమునకు కష్టమని భయ

పడి భగవద్ధ్యానము, భగవన్నామస్మరణ, భగవత్తత్వచింత నము, పురాణశ్రవణము మొదలగు మంచికర్మలు మానుట కూడనిపని. అట్టిదానికి త్యాగఫలితము దక్కదు. కష్టములకు లోబడి కర్మల నాచరించి సన్న్యాసము చేసిననే కాని ఫలము కలుగదు. రాజసిక త్యాగమునకు, రాజసిక సన్న్యాసమునకు ఫలితము ఒకే విధముగనుండును.

(2) సాత్త్విక త్యాగము లేక సన్న్యాసము : వేదశాస్త్ర ములచే విధింపబడిన అత్యావశ్యకమైన కర్మలను అహంకార మమకారములను వదలిపెట్టి ఫలాపేక్ష లేకుండా చేయుచు ఫలములనుకోరకుండుటయే త్యాగమనిపించుకొనును. తద్వారా మోక్షము కలుగును.

కర్మానుష్ఠానమువలన జీవుడు తరించునా అనునది ముఖ్యసమస్య. జీవుడు చేయు కర్మానుష్ఠానము వలననే తరించునని చెప్పుటకు వీలులేదు. ప్రతి కార్యమునకు అయిదు కారణములున్నవి. అవి సాంఖ్యశాస్త్రమందు విజ్ఞానవిదులచే చెప్పబడినవి. ఇచట వాటిని పరమాత్మ ప్రమాణపూర్వకముగా విధేయతతో చెప్పుధోరణి యెంతో గమనించవలసి యున్నది.

(1) అధిష్ఠానము (శరీరము) (2) జీవుడు (కర్త) (3) కరణము – జ్ఞానేంద్రియ మనోబుద్ధులు (4) నానావిధ వ్యాపారములు – పంచప్రాణములు (5) భగవదనుగ్రహము – దేవతాసంబంధము. ఈయైదింటిలో దైవసంబంధమే ముఖ్యమైనది. సామాన్య కారణములగు నాలుగింటిలో జీవుడొకడు. కాన కార్యసిద్ధికి తానే కారణమని తలచుట గొప్పపొరపాటు. ప్రతి కార్యమునకు ఈశ్వరుడే ముఖ్యకారణమని గ్రహించి అహం

కార, మమకారాదులను వదలవలయును. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత, కర్మ, కర్త, కారణము – సాత్త్విక, రాజసిక, తామసిక గుణముల ననుసరించి, మూడు విధములుగ నుండును. అట్లే ధృతి, బుద్ధి మున్నగునవియును మూడువిధములు. పిపీలికాది బ్రహ్మపర్యంతము వ్యాపించియుండు సకల జీవులును – దుఃఖ పరిహారము గావించుకొని సుఖము నొందగోరుచున్నారు. ఆ సుఖము సాత్త్విక, రాజసిక, తామసికములని త్రివిధములుగా నున్నది. ఏసుఖము అతీంద్రియమో, అనుభవించినకొలది క్రొత్త క్రొత్త సుఖముల నిచ్చునో, సకలదుఃఖవినాశమునకు కారణమగు చున్నదో, ఆరంభమున విషప్రాయముగను–అంత్యమున అమృత మయముగను వుండునో అట్టిదేసాత్త్వికసుఖము. అట్టి ఆధ్యాత్మిక శాశ్వత సుఖమును పొందుటకే ప్రతి జీవియు శక్తివంచన లేకుండ–యత్నించవలయును. శ్రవణ, మనననిధిధ్యాసములు శాశ్వతసుఖమును బడయు విధానములను బోధించుచున్నవి. కనుక యిట్టిసాధనముల ననుష్ఠించి జన్మసాఫల్యము నొందుటకై యత్నించువాడే నిజముగ మానవుడు.

"ఓ అర్జునా! బ్రహ్మప్రాప్తికి కర్మానుష్ఠాన మత్యావశ్యకము. కర్మాచరణవలన అంతఃకరణశుద్ధి, తద్వారాజ్ఞానము, తద్వారా మోక్షము కలుగును. కర్మచేయనిచో జీవుని మాలిన్యము పోదు. మాలిన్యము పోనియెడల ఆత్మయోగము నందు విశ్వాసముకలుగదు. విశ్వాసము లేనిపనులు వ్యర్థము." అని పరమాత్మ అనేకవిధముల అనేక వుదహారణలతో బోధించి యున్నాడు. పరమాత్మ ప్రతిజీవుని హృదయమందుండి ప్రాచీన కర్మననుసరించి వానిజీవితమును నడుపుచున్నాడు. జీవుడు పర

మాత్మ చేతిలో కీలుబొమ్మవంటివాడు. సర్వస్వాతంత్ర్యమీశ్వరు నిది. జీవునికి పూర్ణస్వాతంత్ర్యము లేదు. పరమాత్మ ఆజ్ఞప్రకారము నడుచుకొనవలసినవాడు జీవుడు. పరమాత్మ ఆజ్ఞల ననుసరించుచో జీవుడు సుఖపడును. తదితరులు దుఃఖము నొందుదురు. "అర్జునా నేను చెప్పవలసినదంతయు పూర్తియైనది. బాగుగ యోచించి నీయిష్టము ననుసరించి ప్రవర్తింపుము" అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పెను.

శ్లో॥ నష్టోమోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత,
స్థితోస్మి, గత సందేహః కరిష్యే వచనంతవ॥ (18 అ 73)

అర్జునుడు "ఓ స్వామీ! మీ యుపదేశమువలన నా వ్యామోహము పూర్తిగ నశించెను. మీ దయకు నేను పాత్రుడనయితిని. కాన సందేహము లన్నియు నశించెను. తమ యిష్టప్రకారము ప్రవర్తించెదను. యుద్ధమును స్వధర్మముగ, త్వదర్పణదృష్టితో చేయుదును" అనెను.

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥ (18 అ 66)

ఆత్మయోగసారముగా భగవంతుడు "ఓ అర్జునా! సకల కర్మలను నాకు సమర్పణచేయుము. అహంకార మమకారములను వదలుము. సకలధర్మములను (ఫలాపేక్షలను) వదలి, అద్వితీయుడను, అవ్యాజకరుణా కటాక్షములతో గూడినవాడను అగు నన్నే శరణుబొందుము. నీవెంత పాపివైనను నీ పాపము లన్నిటిని నేను పోగొట్టి నిన్ను తరింప చేసెద"నని అర్జునునకు అభయప్రదాన మొసంగెను. ఈ సూత్రము నందరు జ్ఞప్తియం దుంచుకొనవలెను. శ్రీకృష్ణుని గొప్పతనము

దర్శనాతీతము. అర్జునుడు సామాన్యుడు. శ్రీకృష్ణప్రభువు విసుగు చెందక కరుణామయుడై అర్జునుని ప్రశ్నలకు తగిన సమాధానములను పలుతెరంగుల చెప్పి అర్జునుని యందు ఆత్మయోగ సంస్కారమును, స్వధర్మాచరణ గౌరవమును కలిగించెను. సంజయుడు వేదవ్యాసుని దయచే దూరదృష్టి, దూరశ్రవణము మొదలగు శక్తులనందియుండుట వలన శ్రీకృష్ణార్జున సంవాదమును వినగలిగెను. విశ్వరూపమును సంజయుడు జూడగలిగెను. ఎంతో ఆనందించెను. పరమాత్మ యెవరిని అనుగ్రహించినాడో, పరమాత్మ ఆజ్ఞలను పాలించు అర్జునునివంటి భక్తులేవైపుననున్నారో, ఆవర్గమునకువిజయము కలిగి తీరును. భగవత్కథలు, భాగవత కైంకర్యములు చెప్పువారు, జరిపించువారు, వినువారు దురితక్షయముద్వారా, సకలైహికాముష్మిక సుఖములనంది శాశ్వత బ్రహ్మానందమునొందుదురని తెలియవలయును.

శ్లో॥ యత్ర యోగేశ్వరః కృష్ణో, యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువానీతిః మతిర్మమ॥ (18 అ 78)

యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడును, ధనుర్ధరుడైన అర్జునుడును యెచటనుందురో, అచట లక్ష్మియును, విజయమును, ఐశ్వర్యమును, సుస్థిరమైన ధర్మమును-వుండితీరునని నా అభిప్రాయమని సంజయుడు తెలిపెను. ధృతరాష్ట్రుడు గీతారంభమునందు తన వారును పాండవులును కురుక్షేత్రమందు యేమిచేసిరి? అని అడిగిన ప్రశ్నకు సంజయుని సమాధానము యుక్తియుక్తముగ నున్నది. ఈ సమాధానము ప్రవృత్తియందు సర్వకాలములకును అన్వయించుచున్నది. మనుజులు తమ కార్యములను జయ

ప్రదముగ సాధించుటకు, కర్మేంద్రియములు కర్మానుష్ఠానము నందు శిక్షణ పొందవలయును. క్షత్రియులకు ధనుర్ధరణము వలె, యితరులు వారి స్వకర్మలందు ప్రవీణులు కావలయును. విజయదశమియందు ప్రజలు ఆయుధపూజను చేయుటలోని మూలసూత్రము కర్మయోగమునందు ప్రావీణ్యతను బొందుటకు నిదర్శనము. మానవులు కర్మప్రవీణులేకాక పూర్ణయోగ ప్రవీణులుకూడా కావలెను. సంకల్పసిద్ధికి క్రియాశక్తియును, జ్ఞానశక్తియును, సాధనములని సంజయుడు తెలిపెను.

హరిః—ఓం—తత్సత్.

